
ఆంధ్రసచిత్రవారపత్రిక

5-11-76
75 పైసలు





ఈ రోజుల్లో తలనొప్పి అంటే మాటలా!

సాలోఫేన్‌ను వాడండి. అమోఘంగా నొప్పులను నివారించే విశిష్టమైన మాత్ర. వెల అతిచౌక

మంచి నొప్పుల నివారిణి సాలోఫేన్‌ను గమనించండి. దీనిలో రెండు మందులు అమోఘంగా నొప్పులను పోగొట్టేవి చేరివున్నాయి—ఆస్ప్రిన్, ఫెనాసిటిన్—అయినప్పటికీ వెల మాత్రము 7 పైసలే ఒక మాత్ర. సాలోఫేన్ అతిశీఘ్రంగా, తలనొప్పులకు జలుబులకు పండ్లనొప్పి, ఫ్లూ జ్వరాలకు కండలనొప్పులకు ఉపశమనం కల్గిస్తుంది.

సాలోఫేన్ నొప్పుల నివారిణి మాత్రలు—ఏళ్లతరబడి ఇంటింటా ప్రసిద్ధిపొందిన అమృతాంజన్ లిమిటెడ్ వారి తయారీ.


అమృతాంజన్ లిమిటెడ్ వారి నమ్మకమైన తయారీ

సాలోఫేన్
అమోఘమైన
నిరపాయకరమైన
నొప్పుల నివారిణి

SAA/AMS/2197 TEL

గోద్రెజ్ నవ-తాళ్

18 ఏళ్ళ నుంచి అన్నిటికన్నా దీనినే కోరి ఎంచుకుంటున్నారు.



ఎందుకంటే భద్రత కావాలనుకున్నప్పుడు ధర కోసం ఎవరు వెనకాడతారు గనక?

నిజమే, గోద్రెజ్ నవ-తాళ్ సాధారణమైన తాళాలకన్న ఎక్కువ ఖరీదే. అయితే, మీరు నమ్మదగ్గ తాళం కోసం, మరికాస్త ఎక్కువ ధర యివ్వటం సమంజసం అని మీకూ తెలుసు. యంత్రంలో అదమబడ్డ యిత్తడితో చేయబడిన దీనిలో, దుర్బలమైన రివెట్లు ఏమీ లేవు. గట్టిగా వున్నదానికి పైన మలాము పూత పూయబడి తుప్పును నిరోధించేది అయిన దీని పైతొక్కెన్ని ఎవరూ విరగొట్టలేరు. దీనో 'డై'తో కోయబడిన ఎనిమిది లీవర్లు ఉన్నాయి. మరి నవ-తాళ్‌ని దాని తాళం చెవితో తప్ప మరి దేనితోనూ తియ్యలేరు. వీటన్నిటివలనా మీకు కావలసినంత రక్షణ—అందుకే దీనికి మీరు పెట్టే ధర కన్నా మీకు ఎక్కువగానే గిట్టుబాటై బాగా పనిచేస్తుంది.

Godrej

సైజు ...
40 మి.మీ.—5 లీవర్లు; 50 మి.మీ.—6 లీవర్లు;
65 మి.మీ.—7 లీవర్లు; 85 మి.మీ.—8 లీవర్లు;

ప్రఖ్యాతి చెందిన వస్తువుల నిర్మించేవారు—గోద్రెజ్

సాహిత్య సంస్కృతి రంగాలకు అవినాభావ సంబంధమున్నదన్న ఒక విశ్వాసాన్ని సహస్రాధిక గ్రంథాల రూపంలోను, వివిధ సాహిత్య రూపాలలోను సాక్షాత్కరింపజేసి— ప్రవచించిన శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు అరవై సంవత్సరాలు సాహిత్య కృషీవలుడై పండించని 'ప్రక్రియ' లేదు. రాణించని పారస్యత రీతి లేదు.

స్వర్గీయ "విశ్వనాథ"



"వేయి పడగ" లెత్తిన ఆయన ప్రతిభావ్యుత్పత్తులు అరవైకిపైన నవలలు, రెండువందల ఖండ కావ్యాలు, ముప్పై కావ్యాలు, పౌరాణిక డ్రామాలు, కథలు, ఎన్నో విమర్శలు అన్నింటిని మించి "రామాయణ కల్పవృక్షం"- సృష్టించాయి. ఇవన్నీ ముందుతరాలవాళ్లు విమర్శకులు, మరి అరవై సంవత్సరాల దాకా అనుశీలించి అంచనాలు కడుతూ వున్నా, యింకా సత్యనారాయణగారి రచనలను తరచి చూడాలన్నవారు— చూడవలసింది వుండిపోయేటంతటి- బృహత్తర సాహిత్య వ్యాసాంగం వారిది.

ఆయన అధిష్ఠించని జ్ఞానపీఠం లేదు... ఆయనను వరించని సాహిత్యఅవార్డు లేదు శాసనమండలి సభ్యుడు. ఆయన భారతదేశమెరిగిన "తెనుగు సాహిత్య కల్పవృక్షం" ఆంధ్ర ప్రభుత్వ ఆస్థానకవి.

"పుస్తక భాండాగారంలో ఆయన ఆక్రమించివదిలిన జాగాలోనే యీ 'శకం'లో వచ్చిన సాహిత్య రీతులు సాహిత్యప్రక్రియలు అన్నీ చోటుచేసుకుంటాయి" అని ఆయనని కొలిచే శిష్యకోటిఅంటారు— ఆయన గ్రంథాలను నెట్టి వాటి స్థానంలో యితర సాహిత్యోద్యమ పీఠాలను చేర్చాలన్న వారి కోరిక నెరవేరడమేలేదని— చెప్పే పరిశీలకులూ వున్నారు.

కవిసమ్రాట్, కళాప్రపూర్ణ, అభినవ 'కవిత్రయమూర్తి' లాంటి బిరుదాలన్నింటిని తన సిల్కులాల్చీ జేబులో వేసుకుని కూడా— ఆయన సాహిత్యరంగం నుంచి తన "జరీ కండువా" తీయకుండా. ఎత్తిన తన ధ్వజాన్ని దించకుండా సానబట్టిన కలాన్ని,ఆకు రాయి లాంటి నాలికను విశ్రమించనివ్వకుండా పరిపూర్ణమైన జీవితాన్ని సాహిత్య సంసారాలలో అనుభవించి, తన 82వ ఏట గుండె 'పోటు' తో, "తన కలం పోటు"కు "ఫుల్ స్టాపు" అన్నాడు... [అక్టోబర్ 18 సోమవారం]

"కిన్నెరసాని పాటలు" "కోకిలమ్మ పెండ్లి" చదువుకునేవాళ్ళకి అలా ఆయనలోని సరస్వతీమూర్తి కానవస్తుంది— వెలియలి కట్టు మంచి జేబుదొంగదాకా చదువుకున్న వారికీ ఆయనలోని మహోన్నత సాహిత్యమూర్తి కానవస్తుంది— ఆంగ్ల, సంస్కృత, తెలుగు భాషలలో రాసిన కావ్య గ్రంథాలను తరచి చూసే కొందరికి ఆయన "సహస్రాధిక సాహిత్య పడగలున్న శేషపురుషుడై కానవస్తున్నాడు...

"ఆయన చూపు ఎటు" అన్నదానిపైన వాదించేవారేకాని- ఆయన "ఎత్తు" విషయంలో 'వివాదం' చేయగల వారీ శతాబ్దంలోనే వుండరేమో?...

విస్తారంగా తెలుగువాడు, స్థూలంగా భారతీయుడూ, సగర్వంగా చెప్పుకునే సాహిత్యమూర్తి సత్యనారాయణగారు. ఏటు నుంచి చూసినా ఆయనతో ఒక సారస్వత 'శకం' ముగిసింది.

[పి రా జీ]

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు.
స్థాపితం : 1908

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
[1938–1972]

శుక్రవారం : 5–11–'76
నలనామ సం. కార్తిక శుద్ధ చతుర్థి
సంపుటము 70 : సంచిక : 10

సంపాదకుడు
శివలెంక రాధాకృష్ణ

*


పోస్టులో ఏడాది చందా రు. 41–60
" ఆరుమాసాల చందా రు. 20–80
విడి ప్రతి వెల 75 పైసలు
ఆంధ్రపత్రిక కార్యాలయము
గాంధీనగరం, విజయవాడ–520003.

విషయానుక్రమణిక

మ న లో మా ట

ఈ సంచిక పూర్తి అయి అచ్చుకి వెళ్తూ వుండగా శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు పోయారన్న విషాద వార్త అందినది. ఆ ''మహనీయుని''కి ఆంధ్ర సచిత్ర వారపత్రిక జోహార్లు. ఈ సంచికలో ఊమెన్ కార్టూన్ రద్దుచేసి, వారిపై ఒక వ్యాసం వేస్తున్నాము.

ఈ సంచికలో ''సముద్రం'' ''హెడ్ వెంకటస్వామి'' అన్న రెండు కథలు వేశాము. దీంతో దీపావళికథలపోటీలో సంపాదకునిబహుమతి పొందిన కథల ప్రచురణ పూర్తి అయింది. మా పాఠకులు వీటి ఐదింటిని చదివి సంగ్రహంగా వాటిపై తమ అభిప్రాయాన్ని వ్రాసుకుని వుంచుకుంటే పై వారం ప్రకటించే వ్యాస రచన పోటీలోను, ఉత్తమ కథ నిర్ణయంకోసం నిర్వహించే బ్యాలట్‌లోను పాల్గొన వచ్చును. బ్యాలట్ పత్రం కూడా పై వారం సంచికలో వేస్తాము. ఈ లోగా పాఠకులు దీపావళి కథలు ఐదింటిని బాగా పరిశీలిస్తారని ఆశిస్తున్నాము.



అట్టమీదబొమ్మ

మా ఆంధ్రసచిత్రవారపత్రిక ప్రతివారం కొని చదివే పాఠకులలో నేనొకడిని. మీ పత్రిక అట్టమీద బొమ్మ చాలా బాగుంటుంది. కాని పాలాక్షనిగారి డైరీలో పాపం ఆయుష్షగారు ఎప్పుడు మద్రాసులో భార్య, భర్తలు చావు. ఒక్క కూతుళ్ల చావు అని అన్ని చావు కబుర్లు చెప్పితే వింతలూ, విడ్డూరాలూ అసలు ఉండవు. ఇకన ఎప్పుడైనా చావుకబుర్లు కాకుండా వింతలు విశేషాలూ వెయ్యించగలరని ఆశిస్తాము.

డి. ఏ. ఎస్. రాజా. (రాజగారి పాలెం.)

•

హీరో కృష్ణగారి ముఖచిత్రంతో వెలువడ్డ ఈ వారం పత్రిక మిసిమిక్కిరి శోభాయమానంగావుంది నూతనంగా ప్రారంభమైన సీరియల్ ''మజిలీ'' చాల బాగుంది. మంచి రసవత్తరంగా వుంది. మిగతా వాటిల్లో చెప్పుకోదగినది ''అప్పు''. ముఖ్యంగా సినిమా విశేషాలు'లో మీ స్పెషల్టీ ఒక ప్రత్యేకత. ఇతర పత్రికలకన్న మిన్నగా చాలా బాగా, విస్పష్టంగా వివరించేది మీ పత్రిక ఒక్కటే. అందుకు నా కృతజ్ఞతలు. దయచేసి హీరో కృష్ణ (మా అభిమాన కథానాయకుడు) తో మంజుల కలిసి ప్రక్కనున్న ముఖచిత్రాన్ని (సాహసగాళ్ళు) అందించగలరని ఆశిస్తున్నాము.

కె. ఎస్. ఆర్. కె. పరమహంస, (భీమడోలు)

మన సినిమాల్లో

జింకా శ్రీనివాస్‌గారి ''వ్యాసం'' యదార్థాన్ని స్పష్టంగా చాటి చెప్పిందనటంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు మంచి వ్యాఖ్యానాన్ని మాకందించి నందుకు అభినందనలు. మన సినిమాల్లో తెలుగు భాషను అందలం ఎక్కించినా, అధోగతి పట్టించినా రచయితలకూ, రచయితలను ప్రోత్సహించే నిర్మాతలకూ ఎంతైనా బాధ్యత వుందని ప్రేక్షకులకు తెలియక కాదు కానీ, స్వల్పకాల ఆనందం ఏది యోగ్యమైనదో, ఏది అయోగ్యమైనదో మనకంతగా బోధించదు. మన రచయితలూ, నిర్మాతలూ తేడాను గుర్తించి, కర్తవ్యంగా భావిస్తే ఒకరకంగా భాషకు మేలు చేసినట్టే!! ఏది ఏమైనా తెలిసి తప్పు చెయ్యడం ఎవ్వరికీ మంచిదికాదు కదా!!!

లక్ష్మీమోహన్, (కోట)

క థ లు

శ్రీ పాయసం సుబ్రహ్మణ్యం 'రథా మాథ నీయం' స్పైరగాల్లా హుషారుగానే సాగింది! మరీ ఉదాత్తంగా చెప్పాలంటే 'పాయసం'లోకి వెయ్యి ఒలికినట్టే ఉంది! చెణుకులు, సెన్స్ ఆఫ్ హ్యూమర్ ఆ పాయసంలో ద్రాక్షా, జీడిమామిడి బద్దల్లా పంటికి తగిలేట్టు పత్రికా పాఠకులు అల్పాటుపడ్డ చిక్కని స్థాయిలోనే ఉన్నాయి.

సర్వత్రా అన్ని రంగాల్లోను 'యువతరాని'కి చాలా చాలినంత ప్రోత్సాహం ఇవ్వాలంటున్న ఈ రోజుల్లో 'వర్ధిష్ణు రచయితల''కు మీ పత్రిక ఇస్తున్న ప్రోత్సాహం అభిలషణీయమైనదే!

వేంపల్లి అబ్దుల్ ఖాదర్ (కలికిరి)

క్ష య

మీరు వ్యాసము ప్రారంభించి నందులకు కృతజ్ఞుడను. దయచేసి ఈ పొరపాట్లు సరిదిద్దండి 8.10.76 దసరాసంచిక పుట 43 అచ్చు పోసినది డక్టరు కోలుగంటి...1924 సవరణ 1926

3 వ కాలము 15 వ వాక్యము: మానులు జంతువులు, పక్షులు, ఇతరదినుసులు—సవరణ మానవులకు, జంతువులకు, పక్షులకు వ్యాధి కలుగచేసేవి, తదితరములు.

15.10.76 పుట 8, చివరిపేరా కొంచెంగా రోగం తగిలితే మంచిదని...అనుకున్నారు సవరణ

ప్రథమ క్రిమికాటు అందరిలో సంభవిస్తుంది.

ఓ. ఆంజనేయశర్మ (హైదరాబాదు)

•

15-10-76 వారపత్రికలో క్షయ—2 లో క్షయ వ్యాధి ఎలాగ సంక్రమిస్తుంది. అనే అంశాలపై డా. వో. ఏ. శర్మగారు మాకు తెలియని ఎన్నో అంశాలను తెలియచేస్తున్నందుకు వారికి నా కృతజ్ఞతలు

వై. లక్ష్మణరావు, (శంకరపల్లి.)





ఆందోళన

ఆఫీసులో పనిలో నిమగ్నులమయి ఉన్నప్పుడు ఆప్తమిత్రుడికో, అత్యంత సన్నిహిత బంధువుకో చాలా జబ్బుగా ఉన్నదనీ, వెంటనే రావాలనీ వర్తమానం వస్తే కలిగే ఆందోళన యింతంత అని చెప్పలేం. పయి అధికారి వెళ్ళడానికి సమ్మతించక—చివరకు —ప్రాధేయపడగా పని ముగించి వెళ్ళాలని చెప్పగా తొందరగా ఎలాగో ఒకలాగ దానిని ముగించి వెళ్ళే దాకా మనస్సు పడే వేదన వర్ణనాతీతమై ఉంటుంది. పోతూ వుంటే దారిలో ఏదయినా అంబులెన్సు కారు కనబడితే అందులో వున్న రోగి తమ వాడేమో అనే భ్రాంతి కలిగి —తమ వాడు కాదని తెలిసిన తర్వాతనే కొంచెం ధైర్యం వస్తుంది. ఇతరులు ఎక్కువ బాధ పడుతున్నా మనకు అంత కష్టంగా తోచదు. ఆందోళన వుండదు.

పయివాళ్ళ విషయంలో యీ ఆందోళన లేకపోవడానికీ, తనవారి విషయంలో ఉండడానికీ కారణం యేమిటి ? పైవాళ్ళ మీద ప్రేమ లేకపోవడం మనవాళ్ళ మీద ప్రేమ ఉండడమూ దీనికి కారణం !

ఇతరులను కూడా ఆప్తుల మాదిరిగానే ప్రేమిస్తే ఈ ఆందోళన అందరి విషయం లోనూ ఒక్కరీతిగానే ఉండవచ్చును. చెప్పవచ్చును కాని, అందర్నీ సమానంగా చూడడం సాధ్యం కానేకాదు.

ఒకటి మాత్రం సాధ్యం కావచ్చు.

ఇతరుల కష్టాలను చూచినా ఆందోళన పడని విధంగా తనవాళ్ళ కష్టాలను చూచినా ఆందోళన చెందకుండా ఉండడం అలవాటు చేసుకోవాలి. తనకు కలిగే చిక్కులకు తాను ఆందోళన చెందకుండా ఉండడం, నేర్చుకుంటే ఇతరుల విషయమై కూడా అది సాధ్యమవుతుంది.

ఒక యెద్దు మీద ఒక జోరీగ వాలి కరవడం ప్రారంభించింది. తోకతో అది కొడుతుందేమో అనే భయంతో ఎగిరిపోయి మళ్ళీ దానిమీది వాలి కుట్టసాగింది. ఎద్దు చలించలేదు. ఇలా ఎన్నో సార్లు కరిచినా, ఎద్దు నిశ్చలంగానే ఉంది. జోరీగ "నేను కుడుతున్నా, మందలించకుండా ఊరుకున్నావేం?" అని అడిగింది. "నువ్వు మాత్రమే కాదు, మీ పటాలం అందరూ వచ్చి కరిచి, బాధించినా నాకు లెక్కలేదు. ఆందోళన పడను. నేను బెదరించకుండా వుంటే విసుగెత్తి కొంతసేపటికి నీవే ఊరుకుంటావు." అని సమాధాన మిచ్చింది.

ఆందోళన పడకుండా వుంటే అన్నిటినీ సహించవచ్చును. అన్ని పనులనూ సక్రమంగా జరుపుకోవచ్చు.

క్షయం - 5
చికిత్స

డా॥ ఓ. ఏ. శర్మ

ఈ రోజుల్లో క్షయ చికిత్సకి మందుల మీదనే అధికంగా ఆధారపడుతున్నారు దూర ప్రదేశాలలోని శానిటోరియమ్‌లలో వుండనక్కరలేదు అహారం విషయంలో సంయుతం అవసరానికి సరిపోయే పుష్టికరమయిన అహారం (బాలన్స్‌డ్ డయట్) వుంటే చాలు నని అనుకుంటున్నారు నేటి నిపుణులు. అహారం మితిమీరి వ్యాయామం తగ్గితే రోగి బరువు పెరిగి గుండె జబ్బుకి గురి కావచ్చు

ఆధునిక చికిత్సా పద్ధతిలోనూ విశ్రాంతికి ప్రముఖ స్థానం వుంది. ఇది చాలా అవసరం

ఇక మందులలో వాడకంలో వున్నవి కొన్ని స్ట్రెప్టోమయిసిన్, అయిసోనియాజిడ్, పారా ఎమినో శాలిసయిలిక్ ఆసిడ్, థయాసెటజోన్ వీటిని సందర్భాన్ని, అవసరాన్ని బట్టి వాడతారు.

ఈ మందులు కొన్ని కొందరికి పడవు అప్పుడు వాటిని మార్చాలి. స్ట్రెప్టోమయిసిన్ ఒకటే సూదిమందు. తక్కినవి మాత్రలు

మందుల వాడకం సక్రమంగా జరగాలి క్రమం తప్పితే క్షయ క్రిములు మొండికెత్తి మందుకి లొంగవు!

అటువంటి సందర్భాలలో కొత్త మందులు కొన్ని వాడుతూ వుంటారు ఇవి ఖరీదయినవి అందరికీ పడేవీ కానివికూడా. కొన్ని పేరులు: ఎథియోనమయిడ్, పయిరాజినమయిడ్, సయిక్లో సెరీన్, ఇథామ్‌బ్యూటాల్, రిఫాంపిసిన్

రోగి తీసుకోనవలసిన చికిత్స ఒకటిన్నర సంవత్సరాలు వుంటుంది. ఈ సంగతి రోగి స్పష్టంగా అర్థం అయ్యేట్టు చెప్పాలి గ్రామీణ ప్రాంతాలలో హెల్త్ విసిటర్లు డాక్టర్లు ఈ పని చెయ్యాలి.

రోగిపేర కార్డు ఒకటి తీసుకుని దానిమీద అతని రికార్డు సృష్టిస్తారు. రోగి కార్య క్రమాన్ని దానిమీద రాస్తారు. రోగి ఆసుపత్రికి రావలసిన తేదీలనాడు రాకపోతే ఇంటికి పోయి గుర్తు చేస్తారు!

జిల్లా క్షయ పథకం కింద మందులు లోకల్ ఫండ్ డిస్పెన్సరీలలో, గ్రామ ఆరోగ్య కేంద్రాలలో దొరుకుతాయి. పట్నాలలో గృహ చికిత్సాలయాలు వివిధ ప్రాంతాలలో ఏర్పరచారు. రోగుల ఇళ్ల దగ్గర ఉండే ఈ "క్లినిక్" లకి వెళ్లి చికిత్స పొందటం మరింత సులభం అయిందన్నమాట.

ఊపిరితిత్తిలో "ఫయిబ్రోసిస్" మిరి


(గత సంచిక తరువాయి)

పెరిగినప్పుడు శస్త్ర చికిత్స చేస్తారు. తిత్తిని మొత్తంగా తీసికాని, ఒక భాగాన్నికాని తీసివేస్తారు

ఇంతకి ముందే చెప్పినట్లు మధుమేహం వ్యాధి వున్నవారు క్షయ విషయంలో ప్రత్యేకంగా జాగ్రత్త పడటం మంచిది. వారు తమ అహారాన్ని వైద్యులు చెప్పినట్లు మార్చి తినాలి - చక్కెర వీరికి పనికిరాదు.

కఫం అధికంగా పడనప్పుడు పొడి దగ్గుని నివారించటం ఉత్తమం. లవంగం ఏలక్కాయ పలుకులు, దగ్గు బిళ్లలు వాడవచ్చు

దగ్గుతున్నప్పుడు రక్తం పడితే భయపడ



రాదు. భయపడిపోయేవారికి మనస్సు కుదుట పడే మందులు ఇవ్వాలి. వారు వేడి తిండిని తినాలి.

క్షయ వ్యాధి అదుపు

మానవుడ పరిసరాలు బాగా వుండాలని మొదటే గుర్తించబడింది. మంచి గాలి వెల్తురు అవసరం. తాగే నీరు శ్రేష్ఠమయినదిగా వుండాలి. ఆహారం పోషక గుణములు కలది వుండాలని వేరే చెప్పనవసరంలేదు ఆధునిక అభివృద్ధి పథకాలకల ద్వారా మారుమూలల వారికి కూడా వసతులు అందుతున్నాయి. వీటి ఫలితంగా జబ్బు అదుపులో వుండే అవకాశాలు పెరుగుతాయి.

విశ్వ విద్యాలయాలలో క్షయని గురించి ప్రత్యేకంగా బోధిస్తున్నారు. ఆరోగ్య శాఖాధిపత్యం కింద క్షయ విభాగం ఒకటి ఏర్పడింది దానికి ఒక ప్రత్యేకమయిన సలహాదారు వున్నాడు.

బి. సి. జి. పథకాలు విస్తరింపబడినాయి. ట్యూబర్క్యులిన్ పరీక్ష లేకుండానే 19 సంవత్సరాల లోపువున్న వారందరికీ బి. సి. జి. టీకాలు వేస్తున్నారు.

క్షయ వ్యాధి నిర్మూలన ప్రదర్శన కేంద్రాలు నెలకొల్పుతున్నారు.

రోగికి ఆసుపత్రిలోనే కాదు ఇంటివద్దా చికిత్స ఇవ్వవచ్చునని అనుభవం వలన తెలుస్తోంది.

కుటుంబనియంత్రణ ద్వారా క్షయని కొంతవరకు అరికట్టవచ్చు. ఆడువారు ఎక్కువ కాన్పులవలన నీరసించిపోయి క్షయకి గురి అవుతూ వుంటారు.

కొన్ని జాగ్రత్తలు

1. రోగి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు ముఖానికి బట్ట అడ్డు పెట్టుకొనటం మంచిది.

2 కఫాన్ని ఉమ్మివేసే గిన్నెలో ఫినయిల్ కలిపిన నీరు వేస్తే మంచిది.


3. కఫాన్ని మింగరాదు.

4. కఫాన్ని ఎక్కడపడితే అక్కడ ఉమ్మరాదు.

5 రోగి దుస్తులు, పాత్రసామగ్రి వేరే వుంచాలి

6. రోగి వదిలిన పుస్తకాలు వగయిరాలు

(36 వ పేజీ చూడండి)



సముద్రం

బస్సు సముద్ర తీరానికి దగ్గరవుతున్నకొద్దీ చల్లని సముద్రపు గాలి ఆహ్లాదంగా స్పర్శిస్తోంది. బస్సు లోపల చాలా కోలాహలంగా వుంది. అంతా స్త్రీలే కావడంవల్ల సన్నని గొంతులు ఆ సముద్రపు గాలి శబ్దంతో పాటు కలిసిపోయి, ఓ విధమైన సంగీతంలా వినబడుతోంది. ఆ బస్సుకి ఒక వేపు 'ఉమన్స్ కాలేజ్, హైద్రాబాద్' అని రాసున్న పొడుగాటి గుడ్డ వేళ్లాడుతోంది.

రాణి, మిగతావాళ్ల గొడవేమీ పట్టించుకోకుండా కిటికీలోంచి రోడ్డు కిరువైపులా అడవిలా పెరిగిపోయిన సరుకు తోటల్నీ, మామిడి తోటల్నీ చూస్తూ కూర్చుంది. ఆమె మనసంతా గత స్మృతులతో సముద్ర కెరటాల్లా ఎగిసిపడుతోంది. నిర్మానుష్యంగా వున్న రోడ్డుమీద – సముద్రపు ఘోష వింటూ, సరకు తోటలు కమ్మే చీకటిలో – అప్పుడూ ఇలాగే సముద్ర తీరానికి వచ్చింది తను!

అప్పుడూ ఇలాంటిదే బస్సు – కానీ అది గర్ల్స్ హైస్కూల్ బస్! అప్పుడు ఫోర్త్ ఫారం క్లాస్ పిల్లలు ఎక్స్‌కర్షన్‌కి ఇక్కడికే వచ్చారు.

ఆరోజూ ఇలాగే తను కిటికీ దగ్గర కూర్చుంది. తన్మయత్వంతో అందమైన ప్రకృతిని చూస్తుండిపోయింది.

బస్ వేగంగా మలుపు తిరగడంతో అంతవరకూ బస్ మధ్యలో నుంచుని, ఎవరినో అనుకరిస్తూ అందరినీ నవ్విస్తూన్న లెక్చరర్ శ్రీదేవి తూలి రాణిమీద పడింది. రాణి తుళ్ళిపడటంతో అందరూ ఘొల్లున నవ్వేశారు.

"లేకపోతే ఏమిటి! అందరం సరదాగా కబుర్లు చెప్పుకుంటూంటే, తను అమ్మమ్మలా మూల కూర్చుని మౌనవ్రతం పాటిస్తోంది!" అంది జానకి.

"ఈ సుందర దృశ్యాలు చూస్తూంటే తనువు, మనసు పులకరిస్తున్నాయేమో!" అంది శారద నవ్వుతూ.

"అందుకే పెళ్ళి చేసుకోవే అని చెప్తే వినదు!" తిరిగి జానకే అంది నవ్వేస్తూ.

రాణి చిరునవ్వు నవ్వి ఊరుకుండిపోయింది.

* * *

సముద్రం స్పష్టంగా కనబడుతోందిప్పుడు.

సముద్రం వంక చూస్తుంటే గుండెలు వేగంగా కొట్టుకోసాగినయ్ రాణికి. మనసు అవ్యక్తమైన ఆనందంతో నిండిపోయింది.

అప్పటికీ, ఇప్పటికీ మధ్య పదిహేను

సంవత్సరాలు!

అయినా ఏమీ మార్పు కనిపించలేదు. అవే తోటలు, అదే సముద్రం!

బస్ ఒక కిళ్ళీకొట్టు దగ్గర ఆగిపోయింది.

అందరూ కిందకి దిగసాగారు. తనూ దిగి నించుంది రాణి. ఆ పిక్‌నిక్ బాధ్యత తీసుకున్న సుశీల బస్‌లో తినుబండారాల ప్యాకెట్స్ని వేరువేరుగా చేసి, స్వీటు, కారం వున్న పాకెట్స్ అందరికీ పంచింది.

"డియర్ వుమన్" అరిచింది బస్ ఫుట్ బోర్డ్ మీద నిలబడి.

"ఏమిటి డియర్ మన్" నవ్వుతూ అరచింది శ్రీదేవి.

"మీకు మాట్లాడుకోటానికి చాలా టైముంది. నేను చెప్పే మాటలు రెండు వినండి" అందామె ఏదో చెప్పడానికి సిద్ధమవుతూ.

"క్లాసులో పిల్లలకి కొట్టే బోరు చాలక మాక్కూడా ఇస్తున్నావా లెక్చర్లు" ఎవరో అన్నారు. అంతా గట్టిగా నవ్వేశారు.

"మీరు ఓ అరగంటసేపు ఇక్కడే వుండేటట్లయితే 'టీ' వేడిచేసి ఇవ్వడం జరుగుతుంది. తర్వాత మీ ఇష్టం సాయంత్రం వరకూ సముద్రంలో జలక్రీడలు జరుపవచ్చు! సరుగుతోట విహారాలు చెయ్యవచ్చు!..." అంతా చప్పట్లు కొట్టారు.

"నువ్వు పాలిటిక్స్‌లోకెళ్తే బాగా రాణించే దానివి" అంది జానకి.

మళ్ళీ నవ్వులు అలుముకున్నాయ్!

రాణి ఇదేమీ గమనించలేదు. ఆమె దృష్టంతా సముద్రం వేపే వున్నది.

అప్పుడూ ఇలాగే బస్ దిగారు.

తమ క్లాస్ టీచర్ హేమలత యిలాగే అందరినీ వరుసాగ్గా నించోబెట్టి యెవ్వరూ దూరంగా పోకూడదని—అంతా దగ్గర దగ్గరె "గ్రూపులు"గా తిరగాలని ఆదేశాలిచ్చింది.

తనూ, సరస్వతి, శాంత, అలక కలసి బయల్దేరారు. కాసేపు ఇసుకలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ కాలం గడిపారు. తర్వాత ఎవరు ఎక్కువ అందమైన సముద్రపు గవ్వలు, శంఖువులు ఏరుకొస్తారోనని పందెం వేసుకున్నారు.

అందరూ గవ్వలు, శంఖువులు ఏరడానికి బయల్దేరారు.

ఒక్కసారిగా కోలాహలం బయల్దేరేసరికి రాణి ఆలోచనల్లోంచి బయట పడింది.

సరుకు పేడు మంటలో 'టీ' మరిగిపోతోంది. అందరూ తలో గ్లాసూ అందుకుని 'టీ' తాగసాగారు.

రాణి-తనూ నెమ్మదిగా 'టీ' చప్పరించసాగింది.

పది నిముషాల్లో ఆ కార్యక్రమం ముగిసిపోయింది.

అంతా ఒక్కుమ్మడిగా సముద్రంవేపు నడవసాగారు ఎవరి లోకంలో వాళ్లు ఉత్సాహంగా మాట్లాడుకుంటూ, పరుగెడుతూ—ఆ ప్రాంతమంతా రంగు రంగుల సీతాకోక చిలుకలు తిరుగుతున్నట్లుంది.

నెమ్మదిగా నడుస్తోంది రాణి.

అప్పుడూ ఇలాగే—తను గవ్వలు, శంఖాలు ఏరుకుంటూ ఎంతదూరం వెళ్ళిపోయిందో తనకే తెలియదు!

సముద్ర తీరం వెంబడ రెండు మూడు మైళ్ళు వెళ్ళిగాని వెనక్కి తిరిగి చూడలేదు.

దీపావళి కథల పోటీలో
రూ. 600 లు
బహుమతి పొందిన కథ

తను తెచ్చుకున్న సంచీ రకరకాల గవ్వలు, శంఖులతో నిండిపోయింది.

దగ్గరలో ఇసకలో నిలబడ్డ రెండు పడవల్ని చూసి స్పృహలోకొచ్చింది. అయితే ఆపడవల్లో ఏముందో చూడాలనే వుత్సాహం, కుతూహలం వెనక్కి తిరగనీయలేదు. వాటి దగ్గరగా నడచి ఓ పడవలోకి తొంగిచూసింది లోపల తొట్టిలాగుంది. అడ్డంగా రెండు స్తంభాల్లాంటి చెక్కలు! వల్లని రంగు పూసుంది. నెమ్మదిగా అంచు పట్టుకుని ఎక్కి, పడవలోకి దూకింది. చుట్టూ తిరిగి చూసింది. ఈ పడవల్లోనే పల్లెవాళ్లు చేపలు పడతారు కాబోలు! దూరంగా శిధిలావస్థలో వున్న ఓ పాక కనిపించింది. అక్కడెవరుంటారు? ఎవరూ వున్నట్లు కనిపించడంలేదు పడవలోనించి కిందికి దిగి ఆ పాకవేపు నడిచింది. ఓవక్కకి ఒరిగిపోయి వుందది. దానికి తలుపేమీ లేదు. లోపలికి తొంగి చూసింది తను. లోపల శుభ్రంగా. చదునుగా వుంది. ఏవస్తువూ కనిపించలేదక్కడ!

దూరంగా కనబడుతున్న మరో పడవ దగ్గరకి నడిచింది. అందులోకి తొంగి చూస్తూనే వులిక్కిపడింది. లోపల పడుకున్న కుర్రవాడ్ని చూసి భయపడి పోయింది.

తనని చూడగానే లేచి నించున్నాడతను తనంత ఎత్తే వున్నాడు. వంటిమీద చొక్కా లేదు. పొట్టినిక్కరు ఒక్కటే వేసుకున్నాడు.

ముందుకు పొడుచుకొస్తున్న ఛాతీ, మూతిమీద మొలుస్తున్న నల్లని మీసకట్టు, మెడలో ఆంజనేయస్వామి తాడు, ఉంగరాల జుట్టు, ఆకర్షణీయమైన కళ్ళూ—

"ఎవరు నువ్వు?" అడిగాడతను ఆశ్చర్యం నిండిన కళ్ళతో.

తను భయపడిపోయింది గానీ, అంతలోనే తేరుకుంది. "మా స్కూల్ వాళ్ళంతా సముద్రం చూట్టానికొచ్చాం. నేను గవ్వలేరుకుంటూ వచ్చాను."

"ఏ వూరు మీది?" అడిగాడతను.

"గుడివాడ"

"ఏం చదువుతున్నావ్?"

"ఫోర్తుఫారం"

తన చేతి సంచీలోని గవ్వల్ని, శంఖాల్ని చూసి నవ్వాడతను.

"ఎందుకా పిచ్చివన్నీ భద్రంగా తీసుకెళ్తున్నావ్?"

"చాలా బాగున్నాయ్ ఇవి."

"నాదగ్గర ఇంకా పెద్దవి వున్నాయ్! ఇంకా బాగుంటాయి కూడా!" అన్నాడతను.

"ఏవి?"

"ఇక్కడెందుకుంటాయ్? మా ఇంట్లో వున్నాయ్"

"మీ ఇల్లెక్కడ?"

"అదుగో అటు చాలా దూరం నడిస్తే, కనబడుతుంది." సరుగు తోటల్లోకి చూపిస్తూ అన్నాడతను.

తనకి ఆశ కలిగింది—అతని దగ్గరున్న గవ్వలు, శంఖువులు తనకిస్తే బాగుండునని కానీ అడగలేకపోయింది.

అప్పటికే ఆకాశం పూర్తిగా మేఘావృతమైపోయింది. తనసలు చూసుకోనే లేదు!

వెళ్ళిపోడానికి వెనక్కి తిరిగింది తను. సన్నగా వర్షం మొదలైంది.

"ఏయమ్మాయ్" వెనకనించి పిలిచాడు తను.

"ఏమిటి?" వెనక్కి తిరిగి చూసింది తను.

"అటు సముద్రంవేపు చూడు! పెద్దగా

వర్షం వస్తోంది! నువ్వు తడిసిపోతావ్!" అన్నాడు సముద్రం వేపు చూస్తూ.

అటువేపు చూసింది తను!

సముద్రంలో దూరంగా పెద్ద గాలి, దుమారం లేచినట్లు కనబడుతోంది. ఇప్పుడు తనేమిటి చేయడం? వర్షంలో తడుస్తూనే పరుగెట్టాలా? ఆలోచిస్తూ అక్కడే నిలబడి పోయింది. మరు నిముషంలో పెద్ద పెద్ద చినుకులతో వర్షం రానే వచ్చేసింది.

"ఏయ్! ఇక్కడకు రా! లేకపోతే తడిసి పోతావ్!" గుడిసెవేపు పరుగెత్తుతూ అన్నాడతను. ఇంకో ఆలోచన లేకుండా తనూ అతని వెంబడి పరుగెత్తి పాడుబడ్డ గుడిసె లోకి జేరుకుంది.

వర్షం బాగా విజృంభించింది.

పాకకూడా ఒకపక్క కారడం మొదలు పెట్టింది. అంతవరకూ అందంగా, పరవశం కలిగించిన ప్రకృతి చీకట్లు క్రమ్మగానే భయంకరంగా కనిపించ సాగింది.

"నీ పేరేంటి?" అడిగాడు తను.

"రాణి."

"ఓహో!

'స్కూలు చదువుకుంటున్నావా?' అడిగింది తను కుతూహలం భరించలేక.

"వుహూ! నాలుగో క్లాస్ చదివి మానేశాను."

"ఎందుకు?"

"మరి మా నాన్న చేపలు పట్టడానికి వెళ్తాడుగా! సహాయం చేయొద్దూ?"

"చేపలెప్పుడు పడ్తారు?" ఉత్సాహంగా అడిగింది తను.

"నిన్న రాత్రి వెళ్ళారు! ఇవాళ సాయంత్రానికల్లా రావాలి మరి!"

"అమ్మో రాత్రంతా సముద్రంలోనే వుంటారా?"

"ఒక్కోసారి రెండు మూడు రోజులు కూడా వుండిపోతారు."

తను ఆశ్చర్యపోయింది.

అతను తను కూడా తన తండ్రితో సముద్రంలోకి వెళ్ళడం – ఒకసారి తమ పడవ ఎలా తిరగబడి పోయిందీ – తాము ఎట్లా బ్రతికి బయట పడిందీ – అన్నీ కళ్లకు కట్టినట్లు చెబుతుంటే తనను తను మర్చిపోయి వినసాగింది రాణి.

బయట వర్షం ఎప్పుడాగిపోయిందో తెలీలేదు.

"అరే! వర్షం ఆగిపోయింది!" అన్నాడతనే. ముందు బయటకి నడుస్తూ. తనూ గుడిశలోంచి బయటకి నడిచింది రాణి.

"నేను వెళ్తాను" అంది అతనితో.


"అలా మా ఇంటికి రారాదూ! నీకు నాశంఖువులూ-గవ్వలూ ఇస్తాను."

"త్వరగా వెళ్ళి వచ్చేయగలనా?"

"నీ కెందుకు? అరగంటలో వచ్చేస్తాం!"

"అలాగయితే, పద!" ఆశతో అతని వెనకే నడుస్తూ అంది.

సరుకు తోటల్లో అతని వెనకే-అతనంత వేగంగా నడవడం కష్టంగానే వుంది తనకు.



సరకు తోటలు దాటి, కూరగాయల తోటల్లోకి వచ్చారిద్దరూ.

"అదిగో! ఆ చెట్ల మధ్య పాకలేదూ? అదే మా ఇల్లు!" అన్నాడతను.

తనకు ఎంతో బావుందా ఇల్లు! పచ్చని తోటలు-మొక్కల మధ్య బొమ్మను చూస్తున్నట్లుంది.

ఇంటి చుట్టూ కూడా కాయగూరల పాదులు అల్లుకుపోయి వున్నాయ్.

ఇంట్లోకి వెళ్ళి మరుక్షణంలో తల బయటికి పెట్టి "రా! లోపలకు!" అంటూ తనను కూడా పిలిచాడు.

సంశయంతో లోపలకు నడిచింది తను.

ఓ గూట్లోంచి రెండు పెద్ద అందమైన గవ్వలు, నాలుగు పొడుగ్గా, రంగు రంగుల చుక్కలతో గాజులా మెరిసిపోతున్న శంఖువుల్నీ తీసి తనకిచ్చాడు.

"చాలా?" అన్నాడు ఆనందంగా.

"ఓ! చాలు!" అంది తను వాటన్నిటినీ సంచీలో వేసుకుంటూ!

"ఇంక వెళ్దామా?" అడిగింది ఆ పని పూర్తయాక.

"పద!"

ఇద్దరూ తోటల వెంబట నడవసాగారు.

చెట్లపై నించి వర్షపు నీరు చుక్కలు చుక్కలుగా పైన పడుతోంది. అక్కడవున్న గుంటల్లో నీళ్ళు నిండివున్నాయ్! రంగు రంగుల కప్పలు, కీటకాలు మొదటి సారిగా చూస్తోంది తను.

అతనితో వేగంగా నడవలేక తనకి ఆయాసంగా వుంది.

దూరంగా తమ క్లాస్ పిల్లలు చిన్నగా కనబడుతున్నారు బహుశా తను కనిపించలేదని వెదుకుతున్నారు బహుశా కంగారు పడుతూంటారు.

"అరుగో – వాళ్ళతో నేగా నువ్వు వచ్చింది!?" ఆగి తన వంక చూస్తూ అన్నాడతను.

"అవును! ఇంక నేను వెళ్ళిపోగలను లే!" అంది తను.


అతను దగ్గరగా వచ్చాడు "నువ్వు ఇక్కడే నాతో ఉండిపోతే బాగుంటుంది" అన్నాడు ఆశగా.

తను ఉలిక్కిపడింది.

అదేమిటి? అతనితో ఎలా వుంటుంది? హఠాత్తుగా గుండెల్లోంచి ఏదో తెలీని బాధ దూసుకొచ్చింది. అతన్ని వదిలి వెళ్ళాలంటే



పురుగులు మీరు అనుకున్న దానికంటే ఎంతో త్వరగా పెరుగుతాయి
ఫినిట్ ను మీ ఇంట్లో నియమంగా చిలికి
మీ ఇంట్లో పురుగులను సురక్షితంగా, నిశ్చయంగా హతమార్చండి
ఫినిట్ క్రిమిసంహార ప్రణాళిక
ఫినిట్ ఉపయోగించే విధానం
ఎగిరే పురుగులు
ప్రాకే పురుగులు
FINIT
HOUSEHOLD
insecticide
POISON
HP
KEEP OUT OF THE REACH OF CHILDREN
NET CONTENTS 1 LITRE
దోమలు, ఈగలు, బొద్దింకలు, నల్లులపై
ఫినిట్ చిలకండి.
వాటిని నాశనం చేయండి!
సురక్షితంగా నిశ్చయంగా హతమార్చండి.
HP
హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్
CMHPF-3-244-Tel



ఏంటోగా వుంది తనక్కూడా! కొద్ది గంటల పరిచయం అంతే!

అయినా అతన్ని వదిలి వెళ్ళాలనిపించడం లేదు తనకి. అతని కళ్ళలోని ఆకర్షణ—అతని అమాయకత్వం అంతగా ఆకర్షించాయ్ తనని!

"నిన్నోమాట అడగనా?" తిరిగి అడిగాడతను.

"ఏమిటి?"

"నీకు కోపం రాదుగా?"

"ఊహూఁ...ఏమిటో చెప్పు!"

'మనం ఒక్కసారి కావలించుకొందామా?'

బిత్తరపోయింది తను. ఇదేమిటి ఇలా మాట్లాడుతాడీ అబ్బాయ్!

"ఛీ! తప్పుకదూ?" భయంతో అంది తను. కాని అప్పటికే తన మనసు తిరగబడుతోంది. వంపులు తిరిగిన అతని శరీరాన్ని తనకు అదుముకోవాలనీ—ఇంకేమేమో చెయ్యాలనీ—

"సరే-పోనీలే, వెళ్ళిపో!" భయంతో వెనక్కి తగ్గాడతను.

తను కదల్లేక పోయింది.

ఒక్కసారి కౌగలించుకుంటే తప్పేముందీ? తనకోసం పాపం ఇంత శ్రమ పడ్డాడు!

"ఇలారా!" పిలిచిందతన్ని.

అతను దగ్గర కొచ్చాడు.

అతని మెడచుట్టూ చేతులు వేసి కౌగలించుకుంది తను. ఇద్దరి ఎత్తూ ఒకటే కావడంతో ఇద్దరి పెదాలూ కలుసుకున్నాయ్. మొట్టమొదటి కౌగిలింత అది. అంతకు ముందు స్త్రీపురుషుల కౌగలింతలు, ముద్దులు సినిమాలోనే చూసింది తను. ఆ కౌగిల్లోని మాధుర్యమేమిటో అప్పుడే అర్థమైంది తనకి. అతని కంటే తనకే ఉద్రేకం ఎక్కువయిపోయింది.

"ఇంక చాల్లే!" అన్నాడతనే వదిలేస్తూ,

తను సిగ్గుపడి అతన్ని వదిలేసింది.

కొద్ది క్షణాలు ఒకరు వంక ఒకరు వేగంగా స్పందించే గుండెలతో చూసుకుంటూ నిలబడిపోయారు.

"ఇంక వెళ్తానేం!" అంది తనే సిగ్గుతో.

"మళ్ళీ ఎప్పుడొస్తావ్?"

"ఏమో! బహుశా వచ్చేఏడు కూడా ఇక్కడికే ఎక్స్కర్షన్‌కి వస్తాం."

కొబ్బరి బిస్కట్లు

కావలసిన వస్తువులు: మైదాపిండి 1 కప్పు, డాల్డా 1 కప్పు, పాలు 1 కప్పు, ఎండు కొబ్బరికోరు 1 కప్పు, పంచదార తగినంత, చిటికెడు సోడా.

తయారుచేయు విధానము: జల్లించిన మైదాలో పాలు, నెయ్యి, చక్కెర సోడా వేసి పూరీల పిండిలాగా తడుపుకోవాలి. (నీళ్లు ఉపయోగించాలి. లేకపోతే పంచదార కరుగదు) కొంచెము పిండిని తీసుకొని పూరీలాగా పెద్దగ చేసుకొని బిస్కట్లు ఆకారంగా ముక్కలు చేయాలి. ఇలా అంత పిండిని చేసేసుకుని బాణలిలో నూనె వేడిచేసి, చేసి పెట్టుకున్న ముక్కలను సన్నటి సెగపై దోరగా వేయించుకోవాలి.

— మానుపాటి జమునారాణి.

"ఎప్పుడయినా సరే-వస్తే మా ఇంటికి వస్తావా ?"

"తప్పకుండా వస్తా !"

"ఇదిగో ఈ దండ కావాలా ?" మెడలోని పూసలదండ తీసి అతనికిస్తూ అందామె.

అతను సంతోషంతో అందుకున్నాడది.

"నువ్వు మళ్లీ వచ్చాక చూపిస్తాను దీన్ని" అన్నాడు నవ్వుతూ.

అతని కళ్ల నిండుగా నీరు చేరుకోవడం తను గమనించింది. తన కంటి నీళ్లతో అతను మసకగా కనిపించేంతవరకూ చూపి తను అక్కడ్నించే నడవసాగింది.

అంతే! పదిహేను సంవత్సరాలు గడిచి పోయినయ్.

ఆ అనుభూతి తన మనసులో భద్రంగా అలాగే వుండిపోయింది. ఆ మరుసటి సంవత్సరం హైదరాబాద్‌కి తాము ట్రాన్స్‌ఫర్‌లో వెళ్లిపోవడం — అక్కడే సెటిలైపోవడం జరిగింది. ఎప్పటికైనా ఓసారి అక్కడకి రావాలనీ, అతన్ని చూడాలని తన కోరిక! ఆ కోరిక ఇన్నాళ్లకి నెరవేరబోతుంది. అసలిక్కడికి రావడానికి తన ప్రోద్బలమే కారణం. తమ టూర్ ప్రోగ్రామ్‌లో ఈ ప్రదేశం లేనేలేదు.

తీరం వెంబడే నడవసాగింది రాణి. అప్పటికే అందరినీ వదిలి చాలా దూరం వచ్చేసింది.

ఎండ బాగానేవుంది కాని చల్లగాలికి వేడి సోకటంలేదు.

దూరంగా నల్లని బోట్లు కనిపించినయ్యామెకి. ఉత్సాహం ఇనుమడించిందామెకి. త్వరత్వరగా నడిచి ఆ బోట్లలోకి తొంగి చూసింది. ఎవ్వరూ లేరు!

అక్కడికి దగ్గరగానే సరుకు తోటల్నను కొని కొత్తగా వేసిన పాక కనబడుతోంది. ఆ పాకలోనే తను, అతను వర్షం పడుతూంటే తల దాచుకున్నారు.

పాక వెనక నించే కాలి దోవ వుంది ఆ దోవ వెంబటే తాము అతనింటికి వెళ్ళారు.

త్వరత్వరగా నడవసాగింది రాణి

ఒకవేళ అతను కనిపిస్తే తనేం మాట్లాడుతుంది ? అతన్నెలా గుర్తు పడుతుంది ? అసలతను తన్ని గుర్తిస్తాడా ?

అవేమీ ఆలోచించ దలచుకోలేదామె!

దూరంగా కాయగూరల తోటలు—ఆ ఇల్లు కనబడుతూనే వుంది! అవే చెట్ల మధ్య బొమ్మలాగానే వుందింకా! అయితే రంగులు రంగులు కనబడుతున్నాయింటికి. ఆ ఇంటి దగ్గరకి నడిచింది రాణి. ఆమెకి చెమటలు కారిపోతున్నాయ్! కర్చీఫ్ తీసి తుడుచుకుంటూ ఇంట్లోకి చూసింది.

గడప కెదురుగా ఏడెనిమిదేళ్ల పాప కూర్చుని ఆడుకుంటోంది పాప మెడలో తన పూసల దండ! పూసలన్నీ నల్లబడి పోతున్నాయ్!

తనని ఆశ్చర్యంగా చూసింది పాప! పాప మొఖంలో అతనే కనబడుతున్నాడు రాణికి.

"ఏమిటి ?" అడిగింది పాప.

"మీ నాన్నేడి ?" వణుకుతూ అడిగింది రాణి.

"ఏటి పోయాడు"

"ఎక్కడికి ?"

"సముద్రానికి"

"మీ అమ్మేదీ ?"

"అమ్మే-మరే-పాలా నికెల్లింది"

ఆ పాపని ఎత్తుకొని ముద్దు పెట్టుకుంది రాణి.

తన చేతిలోని స్వీట్ల పొట్లాం పాపకిచ్చింది.

'మీనాన్నవస్తే రాణివచ్చి వెళ్లిందనిచెప్పు.'

'రాని వేను' అంది పాప బుంగమూతిపెట్టి.

రాణి చలించిపోయింది. "నీ పేరు రాణా?"

"అవును! మా నాన్న రానీ అని పిలుస్తాడు. 'మా అమ్మ కూడా అంతే!"

మరోసారి పాపని ముద్దాడి అక్కడ్నించి బయల్దేరింది రాణి.

పాప పాకెట్‌లోంచి లడ్డూ తీసి తింటూ రాణి వంక చూస్తోంది! చేయి వూపింది రాణి నవ్వుతూ.

ఆమెకి ఎంతో సంతోషంగా వుంది. అతన్ని చూడకపోయినా ఫరవాలేదు. కాని అతనికి తను గుర్తుంది! అతని మనసులో తనుంది! అంతే! అంతే తనక్కావలసింది. సముద్ర తీరం వెంబడే పరుగెత్తి సాగింది రాణి. సముద్రపు అలలు వువ్వెత్తున ఎగిసి పడుతూ - ఒడ్డుని తాకుతూ — వెనక్కి వెళ్లి పోతున్నాయ్!

మాస్కోలో శరత్ వర్ధంతి

మాస్కోలోని స్నేహ భవనంలో జరిగిన శరచ్చంద వర్ధంతి సభలో సోవియటు ఇండోలజిస్టు పాల్గొన్నారు. చెలిషేవ్ ప్రసంగిస్తూ శరచ్చంద్రుని సృజనాత్మక కృషిని గోర్కీ రచనలతో పోల్చేరు సాధారణ ప్రజల జీవితాలను, వారి సంతోషాలు, దుఃఖాలను, ఆశలు, ఆశయాలను చిత్రించడమే గాక శరచ్చంద్రుడు సామాజిక న్యాయాన్ని సమర్థించాడు భారత దేశ జ్యాతికి, స్వాతంత్ర్య పోరాటానికి గొప్ప సేవ చేశారన్నారు అని ఆయన అన్నారు.

భారత రాయబారి ఐ. కె. గుజ్రాల్ ప్రసంగిస్తూ, శరచ్చంద్రుని స్మృతిము ద భారత దేశం మీద ప్రపంచంమీద శాశ్వతంగా వుండగలదన్నారు. ప్రపంచమంతటా నేడీ ప్రసారజ్ఞీవన దోహదాన్ని ఆయన రచనలు ప్రతిబింబించడం దానికి కారణమన్నారు.

ఇటీవల సోవియటులో మూడు సంపుటాల శరచ్చంద రచనా సంకలనలు 1,50,000 ప్రతులు ప్రచురించబడ్డాయని ఆమె చెప్పారు ఆయన కథలెన్నో అనువదించబడ్డాయన్నారు. 'గృహదాహ' లిథుయేనియన్ భాషలోకి అనువదించబడిందన్నారు చాల శరచ్చంద రచనలు యుక్రేన్ భాషలోకి అనువదించే పని సాగుతున్నదన్నారు. [సో. స]

పి.పి.ఎస్. విశాఖపట్నం.

అమె నన్ను మనసారా ప్రేమించి హృదయంతో పాటు తన సర్వస్వాన్నీ నా కర్పించింది. మా ఇద్దరికీ పెళ్లి జరగడం అసంభవం.

మంచి ప్లాటు. దీనిమీద ఎలాంటి సినిమా కథేనా అల్లుకోవచ్చు! పెళ్లాడేస్తే కథేలేదు చూడండి ఇలా 'అర్పించడాలు' అందుకోడాలు వాస్తవిక జీవితంలో చాలా అసహజంగా బాధ్యతా రహితంగా తోస్తాయి. ఎంత 'ప్రేమ గుడ్డిది' అయినా, దాని కాళ్లు బొత్తిగా ఈ భూమ్మీద వుని వుండాలి. లేకపోతే మీ కథలాగే అవుతుంది.

కె.ఎ.కె. నాగపూరు.

అక్కయ్యా, తల్లిదండ్రులను ఎదిరించి ప్రేమించిన అతన్ని పెళ్లిచేసుకోవడం మంచిదా? లేక తల్లిదండ్రులు చెప్పినట్టు చేసుకోవడం మంచిదా ?

ఏం, తమరు ప్రేమించిన వ్యక్తిని తమరి తల్లిదండ్రులు ఆమోదించరా ?! చూడండి ప్రేమ బాధ్యతతోకూడి వుంటుంది. మీ బాధ్యత ప్రత్యక్షంగా స్వీకరిస్తాడన్న నమ్మకం మీ ప్రియ తమ ప్రేమికుడు ముందుగా తల్లిదండ్రులకు కల్గించాలికద ! ప్రేమించడం ఒక్కటే తన బాధ్యత అనేసి మీ తల్లిదండ్రులపైనే బాధ్యత వేస్తే రకం అయితే అది మీ ప్రేమకేకాదు, ఆత్మగౌరవానికి కూడా దెబ్బ.

వి.జి.ఆర్. పిడ్డిపేట.

పాఠకుల ప్రశ్నలకి సమాధానా లివ్వడానికి మీకున్న అర్హత లేమిటి ?'

ఏం లేదు ! తెలియని వారేకద ధైర్యంగా ముందు కొచ్చేది ?!

మీ రెంతవరకు చదివారు. తిన్నగా ఖచ్చితంగా సమాధానం ఇవ్వండి.

ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

చిత్తం. ఒకటో క్లాసునుంచి ఐదో క్లాసు దాకా పదేళ్లు చదివాను! దీనికిసాక్ష్యం సూర్యకాంతం. ఆరో క్లాసునుంచి పదో క్లాసు దాక ఎన్నాళ్లు చదివానో జ్ఞాపకంకాదు. ఏ కృష్ణమూర్తి మాష్టారినో, జగన్నాథం మేష్టారినో అడగాలి! ఇక డిగ్రీ అంటారా ? ఈ రోజుల్లో వో డిగ్రీ డిగ్రీకాదు కద !

గర్వపడడానికి అహంభావం కల్గివుండడానికి కూడా కాస్త అర్హత వుండాలి. ఏమంటారు!

బాగా చెప్పారంటాను

పాఠకుల ప్రశ్నలకు మీ బదులు మరెవరైనా సమాధానమిస్తే బాగుంటుందని పాఠకునిగా నాకుంది.

సంపాదకుల చెవిన పడేయండి మరిం కాలస్యం దేనికి !

నా ప్రశ్నలకి సమాధానలివ్వకపోతే మీస్తోమత ఎంతో అంచనా వేసుకోవలసి ఉంటుంది.

అంతేగా మరి! మీ మూడు టావుల ప్రశ్నలకి బదులిస్తే నా విజ్ఞానం పెరిగి చస్తుంది కనుకనా ?

పి.ఎమ్.ఎల్. హైదరాబాదు.

ఈ కాలంలో ఆడపిల్ల అయితేనేం, మగపిల్లాడయి తేనేం ? ఇద్దరూ ఒకటే అంటున్నారు నిజమే. కాని తల్లిదండ్రుల బాధ్యతలు స్వీకరించ వచ్చినప్పుడు తేడా కనిపించవచ్చు..

రాలిన ముత్యాలు

'......శ్రీ సోమసుందర్......

నా పాదాలు
బురదలో కూరుకు పోయివున్నా
నా హృదయం మాత్రం
హాయిగా విహరిస్తోందాకాశంలో !
కామ క్రోధాల ఆచ్ఛాదనలో
నేనెంత నికృష్టజీవిని ?
ప్రేమ మహత్త్వం వెలిగినపుడు మాత్రం
సురనదీ తీరంలో
హాయిగా ఆడుకుంటాను !

చూడండి, ముందు వర్తమానం గురించి ఆలోచించుకుని తరవాతే భవిష్యత్తు గురించి బెంగ పడాలి. నన్నడిగితే ఎప్పటికైనా కొడుకుతో సమానంగా ఏం ఇవ్వకపోయినా ఆడపిల్లకి అభిమానం చావదు పుట్టింటిమీద. అలాగే కాస్త తనదైన సంపాదన అంటూ వుంటే ఆడపిల్లలే నయం ఆదుకుంటారు. ఇక, లోకం రివాజు గురించి భయపడ్డం మొదలెడితే ఆడమగ సమానం అన్న ప్రశ్నకే చోటుండదు. రివాజులకు ఆడపిల్లలు భయపడకుండా వుండడమే కాదు, తమ మనో భావాలని చెప్పే ధైర్యం కూడా పెంపొందించుకోవాలి... లేకపోతే 'పుట్టింటికి వోసారి పంపమంటే'నే విరుచుకుపడే అల్లుళ్లు 'పుట్టిల్లు సంగతి మరిచిపో' అనే భర్తలు 'ఏం పెట్టారని ఆ ముఖంవాచి' ఇంటికొ అనడం అనే అత్తలు...వీరంతా రూపాంతరం చెందరు.

ఎస్.ఏ. ప్రొద్దుటూరు,

సంఘంలో అన్నీ తెలిసిన విద్యావంతులైన స్త్రీలే పతనం అయిపోతున్నా రెందుకు ?

విద్యా వివేకం చదువుకుంటే వస్తాయి. కాని పరిస్థితులు ఆడా మగా తేడా లేకుండా మనుషులని బానిసలుగా మారుస్తాయి.. అంచేత విద్యకీ పతనానికీ సంబంధం వుందనుకోవడం పొరపాటు

ఐ.ఎమ్. సోంపేట.

ఆడదాని కడుపున పుట్టిన మగవాడు ఆడదాన్ని బానిసగా ఎందుకు చూస్తాడు ?

ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్సువేత ! తాను సృష్టికి కారకుడైతే కాగలడుగాని సృష్టించలేడు కద !


డి.యు.ఆర్. జలుమూరు.

మీ ఆడవాళ్ల అంతులేని బాతాఖానీ ఎంత వరకు ?

సాగినంతవరకు !...అయినా, పని వున్నప్పుడు తప్పుగాని పనిలేనప్పుడు కబుర్లాడడం పెద్ద దోషంకాదు. మీ మగవారు నిజానికి ఆడాళ్లకంటే ఎక్కువ కబుర్లు చెప్పుకుంటారు.

యువతరం

"మన ప్రభుత్వం వారు చిత్రకారులకి తగిన ప్రోత్సాహము ఇవ్వటం లేదు. పత్రికలు ఇచ్చే ప్రోత్సాహమూ అంతంత మాత్రమే రచయితలకిస్తున్న ప్రోత్సాహం మాకు ఇవ్వటం లేదు" అన్నాడు టి. వి. యస్. మూర్తి. ప్రయివేటుగా బి.కామ్. పరీక్షకి వెళ్తున్న మూర్తి తాను ఫైన్ ఆర్ట్సులో మద్రాసు



ప్రభుత్వంవారి డిప్లొమా పొందానని చెప్పాడు. 25 కు పైగా అంతర్జాతీయ జాతీయ చిత్రకళా ప్రదర్శనలలో బహుమతులు' ప్రశంసా పత్రాలు అందుకున్న ఈ యువ రచయిత చిత్రకారుడు విజయవాడ లాంటి పట్టణాలలో సొంత చిత్రాల ప్రదర్శన ఇవ్వాలనుకుంటున్నానని చెప్పాడు. కాని ఎవరిదైనా ఆసరా కావాలిగా ...

ఫొటోగ్రఫీ, కథలు వ్రాయటం ఇతని హాబీలు. ఇతనికి సినిమాల మీద మోజు లేదు. ఈ మధ్యనే ఒక మాసపత్రిక మీద యితని ముఖచిత్ర రచన అచ్చయింది. కార్టూన్ల ద్వారా ఆంధ్రసచిత్ర వారపత్రిక పాఠకులకి పరిచితుడే. —మ—

క్రొత్తది!

అమృతాంజన్ లిమిటెడ్‌వారి విశిష్ఠమైన

ఆముదము

శుద్ధిచేసినది. వాసనలేనిది.

అమృతాంజన్ ఆముదము
సుప్రసిద్ధ అమృతాంజన్ కంపెనీ వారి
మరో విశిష్ఠమైన ఉత్పత్తి.

అమృతాంజన్ ఆముదము





మూడు సైజులలో లభిస్తుంది:
50 మిలి
100 మిలి
200 మిలి

OBM 3270 TG

హైదరాబాద్ నోట్ బుక్

సారస్వత వేదిక :

ఆంధ్రపత్రిక సంపాదకులు శ్రీ శివలెంక రాధాకృష్ణ అక్టోబర్ 3వ తేదీన ఆంధ్రసారస్వతపరిషత్తు ప్రాంగణంలో "సారస్వత వేదిక"కు ప్రారంభోత్సవం జరిపారు. పత్రికలు నిర్వహించడం ఎంతో కష్టంగా ఉన్నదని, మనదేశంలో నవలారచయితలకు, అందునా సినిమా నవలా రచయితలకు మాత్రమే డబ్బు ముడుతున్నదని, ఇతర ప్రక్రియలలో రచనలు సాగించేవారి ఆర్థిక పరిస్థితి తృప్తికరంగాలేదని శ్రీ రాధాకృష్ణ అన్నారు. "పాశ్చాత్య దేశాలలో కేవలం రచనా వ్యాసంగంతోనే ఆర్థిక సౌష్టవం పెంపొందించుకునే వారి సంఖ్య ఎక్కువ. వారితో పోలిస్తే మన రచయితలకు తగినంత ప్రోత్సాహంలేదు." అన్నారు. సారస్వత పరిషత్తు చేసిన సేవను ఆయన ప్రశంసిస్తూ, సారస్వత వేదిక యువరచయితలను ప్రోత్సహించగలదని ఆశిస్తున్నానన్నారు. అధ్యక్షత వహించిన శ్రీ దేవులపల్లి రామానుజరావు తమ ప్రసంగంలో సారస్వత పరిషత్తు కార్యక్రమాలలో నవ్యతకోసం సారస్వత వేదిక స్థాపన తలపెట్టామని, రచయితలు, కవులు, విమర్శకులు ఒకచోటచేరి సామరస్యంతో చర్చించుకొనే అవకాశం కలిగించడం దీని ఉద్దేశమని అన్నారు. దృక్పథం వేరైనా ఆయా రచయితల రచనలలోని సాహిత్య గుణాన్ని సహృదయతతో చూడడం ఈ వేదిక లక్ష్యమని సారస్వత వేదిక సమావేశకర్త శ్రీ కె. కె. రంగనాథాచార్యులు అన్నారు. ఈ వేదికపై చదివిన రచనలను ఆరునెలల కొకసారి గ్రంథరూపంలో ప్రచురించాలని శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి సూచించారు. లబ్ధప్రతిష్ఠులైన వారిచేత ఉపన్యాసాలు ఇప్పించాలని డాక్టర్ నాయని కృష్ణకుమారి సూచించారు. ఈ వేదిక వ్యష్టిగాను, సమిష్టిగాను సాహిత్య ప్రణాళికను రూపొందించాలని డాక్టర్ జి. వి. సుబ్రహ్మణ్యం సూచించారు. పూర్వపు పండిత సభలవలె ఈ వేదిక ఒక రచనను ప్రకటిస్తే అది ప్రామాణిక రచన అయి వుండాలనే తీరులో వేదిక కృషిసాగాలని డాక్టర్ కొత్తపల్లి సుబ్బారావు అన్నారు. డాక్టర్ ఎం. రాధాకృష్ణశర్మ, డాక్టర్ అమరేశం రాజేశ్వర శర్మ, ఇరివెంటి కృష్ణమూర్తి, ఎస్. గోపి, శ్రీమతి జ్యోతిర్మయి కొన్ని సూచనలు చేశారు. వేదిక సహాయ సమావేశకర్త శ్రీ నీలాజంగయ్య వందన సమర్పణ చేశారు. శ్రీ రామానుజరావు, శ్రీ శివలెంక రాధాకృష్ణకు సారస్వత పరిషత్తు ప్రచురణలను అందజేశారు.

శ్రీ అవధానం చంద్రశేఖర శర్మ :

కర్ణామృతం అనగానే మనకు చప్పున కృష్ణకర్ణామృతం జ్ఞాపకం వస్తుంది. కర్ణామృత కవి అనగానే కృష్ణుని బాలలీలలను వీనుల విందుగా చెప్పిన లీలాశుకుడు తప్ప మరెవ్వరూ జ్ఞాపకం రారు. కాని, మిత్రులు శ్రీ అవధానం చంద్రశేఖరశర్మ కర్ణామృత కవి అంటే బిల్హణకవి అంటున్నారు. విజయనగర చక్రవర్తి మధురా విజయాన్ని వర్ణించిన మధురావిజయమనే కావ్యాన్ని రచించిన గంగాదేవి కావ్యపీఠికలో ఒక కర్ణామృత కవిని

> మందార మంజరీ స్యంది
> మకరంద రసాబ్ధయః,
> కస్యవాహ్లాదనాయాలం
> కర్ణామృత కవేర్గిరః

అని స్తుతించింది. మందార మంజరినుంచి స్రవించే మకరందరస సముద్రాలవంటి కర్ణామృత కవి వాక్కులు ఎవరికి ఆనందం కలిగించవు ?— అని ఆమె అన్నది. బిల్హణుడు పెక్కుచోట్ల కర్ణామృతం, శ్రవణామృతం అనే ప్రయోగాలు చేశాడు. సాహిత్యమనే సముద్రాన్ని చిలకగా పుట్టిన కావ్యాన్ని రక్షించుకోండి. అమృతాన్ని దొంగిలించడానికి దైత్యులు పొంచి వున్నట్లు కావ్యార్థామృతాన్ని దొంగిలించేవారు ఎక్కువవుతున్నారు. సుమా. జాగ్రత అని బిల్హణుడు హెచ్చరించాడు.

> సాహిత్య పాథోనిధి మంథనోత్థం
> కర్ణామృతం రక్షత హే కవీంద్రాః,
> యత్తస్యదైత్యా ఇవ లుంఠనాయ
> కావ్యార్థ చోరాః ప్రగుణీ భవంతి

గంగాదేవి విజయనగర చక్రవర్తి బుక్కరాయల కోడలు, బిల్హణుడున్న పశ్చిమ చాళుక్యుల రాజధాని కల్యాణ కటకం, అతడు 11వ శతాబ్దంలో వున్నవాడు. గంగాదేవి 14వ శతాబ్దంలో వున్నది. ఆంధ్ర కన్నడ దేశాలలో బిల్హణుని రచనలు చాల వ్యాప్తిలో వున్నవి. గంగాదేవివంటి రాజకవయిత్రి బిల్హణుని బాగా అధ్యయనం చేసింది. ఆమె కావ్యంలో బిల్హణుని విక్రమాంక విజయకావ్యం అనుసరణలు, అనుకరణలు కొలవున్నాయి. కనుక ఆమె ఉద్దేశించిన కర్ణామృత కవి బిల్హణుడేనని అవధానంవారివాదం. ఈ వాదం సహేతుకమనే నాకు తోస్తుంది. అందులోను అవధానం వారివంటి కవి, పండితుడు విమర్శకుడు, సంస్కృతాంధ్రావధాని, మహావక్త వచ్చేట్లు చెబుతున్నప్పుడు సహేతుకం ఎలా కాకపోతుంది ? చంద్రశేఖరశర్మ ఇటీవల రాజధానిలో ఒక సమావేశంలో తమవాదాన్ని తెలిపారు. ఆయన కడపజిల్లాలో జన్మించారు. బరరారు వేంకటాద్రిశాస్త్రి, రాజగోపాలాచార్యులు, కైప సుబ్రహ్మణశర్మ గురువులుగా సంస్కృతాంధ్ర సాహిత్యాలు చదివి విద్వచ్ఛిరోమణులయ్యారు. జిల్లా పరిషత్తు ఉన్నత పాటశాలలో, ప్రొద్దుటూరు ఓరియంటల్ కళాశాలలో పండితులుగా ఉన్నారు. షష్టిపూర్తి చేసుకోనున్నారు. ఈయన ముద్రారాక్షసనాటకానువాదం ఎం. ఎ. కు పాఠ్య గ్రంథం. ఒక విరహి ఒకరాత్రి భావన "ప్రవాసి" ఖండకావ్యం.

గగనము పూలపందిరి
విగారపు వెన్నెల చాలు తీవలం
డు గనగ వచ్చు చుక్కలు వినూత్న
సుమంబులు మధ్య సీమలన్
నిగనిగలాడు చంద్రుడు
గణింప ప్రఫుల్ల సు మెరుగుప్పసం
డగుచడు వచ్చుతేటి జగ
మంతయు గన్నడె పూలతోటగన్

ఇలా సాగింది కావ్యం. దీనచింతామణి శతకం, మహాకవి మాతృ గుప్తుని చరితమైన కవిరాజ చూడామణి మరి రెండు కమ్మని కావ్యాలు. స్వప్న వాసవదత్త, అలంకారశేఖరం (కేశవమిశ్రుని మూలానికి అనువాదం) అనువాదాలు. దేవీ సువర్ణమాల, వీరభద్ర విజయం (రాయచోటిలోని వైదుంబరాజులనాటి వీరభద్రమూర్తి పరమ) సంస్కృత కావ్యాలు. దేవీ సువర్ణమాల అన్నవాడ కామాక్షి విలాస వర్ణన.

> కామాక్షీ సస్మితా సాంగ
> కల్లోల్లాస ముపాస్మహే,
> స్థాణోరపి యదున్మేషాత్
> సార్వజ్ఞ ముపతిష్ఠతే

అని కమ్మచ్చులాగిన కనక తంత్రిలాగ సాగుతుంది సంస్కృత కవిత.


> ననుసృష్టింపగనేల, ? ముమ్మరపు
> టజ్ఞానంబు నంద్రోయనే
> నిరూప్యేతర కర్మ బంధములివేలా?
> పుణ్యమో పాపమో
> యొసరింపన్ మది స్వర్గమో నరకమో
> లయొప్పించి జోకొట్టి యొ
> య్యన నిన్మాటుకొనంగ నేమిటికి
> అనంతా దీనచింతామణీ ?

అని దీనచింతామణి శతకం. దాదాపు 80 అవధానాలు చేశారు. సంస్కృతంలోను కొన్ని చేశారు. కొన్ని అవధానాలు ముద్రితాలు. అవధానం తెలుగువారిచేతి బిడ్డగా పెరిగిన కళ. అవధానంవారు ఉత్తర భారతంలో సంస్కృతం అవధానాలనుచేసి, కావ్యకంఠ గణపతిశాస్త్రి, పిసుపాటి చిదంబరశాస్త్రి ఉత్తర పథంలో నిలబెట్టిన తెలుగు వారిపేరును ఉజ్జ్వలం చేస్తారని ఆశిస్తున్నాను. ఆయన వీనుల విందు, భావ ప్రేరకము అయిన వక్తృత్వం నిరంతరం నిరంతరాయంగా వర్ధిల్లాలని కోరుతున్నాను.


ఉపశ్రుతి :

"ఏమిటి, కవిగారూ అట్లా మూలలో కూర్చున్నారు ?" అనడిగాను, ఒక వివాహం విందులో ఒక మారుమూలలో కూర్చున్న పద్మశ్రీ బోయి భీమన్నను చూచి "ఆంధ్రప్రదేశ్‌లో మూలమూలా మహాకవులున్నారని నిరూపించడానికే కూర్చున్నారు సుమండీ ఆయన" అని చలోక్తి విసిరారు రచయిత్రి శ్రీమతి కలువకోట సరోజినీదేవి.

— తిరుమల రామచంద్ర



యుగయుగాలుగా చరిత్ర కొన్ని
ధర్మాల పరిధులను వారసత్వంగా
ఈనాటి వరకు తీసుకొచ్చాయి.
అవి ఈనాడు దాటాలంటే
సమాజం నవ్వుతుంది.
ప్రతాప్ ఆర్ట్ ప్రొడక్షన్స్
తూర్పు పడమర
నిర్మాత
కె. రాఘవ
స్క్రీన్‌ప్లే - మాటలు - దర్శకత్వం.
దాసరి నారాయణరావు
కథ:
K. బాలచందర్
సంగీతం
రమేష్‌నాయుడు
తారకరామా
నవభారత్,
శ్రీ తారకరామా
TAARAKARAMA



హెడ్ వెంకటస్వామి

అప్పుడే భోంచేసి అగ్గిపుల్లతో పళ్లు కుట్టుకుంటున్నాడు హెడ్ వెంకటస్వామి. ఇంతలో కానిస్టేబులు కనకారావు కిళ్లీ తెచ్చి టేబులుమీద పెట్టాడు. కిళ్లీ వేసుకొని చొక్కా జేబులోంచి చార్మినార్ సిగరెట్టు పెట్టె తీసి ఒక సిగరెట్టు ముట్టించాడు. గుండెల నిండా పొగ పీల్చి వదిలాడు. ఎదురు గుండా వున్న ద్వారం లోంచి రోడ్డు మీదికి చూస్తూ ఆలోచిస్తున్నాడు.

వెంకటస్వామికి పందొమ్మిదేళ్ల సర్వీసు వుంది. ఈ పరికి అతడికి యస్. ఐ. ప్రమోషను రావలసిందే. కాని, అతడి గీత బాగు లేకో, అధికార్ల చూపు చల్లగా లేకో ఇంత వరకు ప్రమోషను రాలేదు. అతడి పందొమ్మిదేళ్ల సర్వీసులో చెప్పుకోతగ్గ ఘనకార్యాలు ఏవీ చెయ్యలేదు. అతడికి అటువంటి అవకాశాలూ రాలేదు. పై ఆఫీసర్లకి వెంకటస్వామిమీద ప్రత్యేకమయిన అభిప్రాయం ఏదీ లేదు. ఇంతకు ముందు వెంకటస్వామికి స్వేచ్ఛ ఉండేది కాదు. యస్. ఐ. క్రింద ఉండి అతడు చెప్పినట్టు చెయ్యవలసి వచ్చేది. అందులో ఏదైనా ప్రత్యేకత ఉంటే అది ఆ యస్. ఐ. కి దక్కేది. ఇప్పుడలా కాదు. వెంకటస్వామి ఆ చిన్న "అవుట్" పోలీసు స్టేషనుకు "ఇన్‌ఛార్జి". అతని క్రింద ఎలుగురు కానిస్టేబుల్లు ఉన్నారు. అతడు ఇప్పుడు ఏ పని చేసినా కొంత స్వతంత్రంగా చేయొచ్చు. మంచి కేసులు రెండు పట్టుకుంటే ఆ ఘనత తనకి దక్కుతుంది. తరువాత యస్. ఐ. ప్రమోషనూ వస్తుంది. అందుకే ప్రస్తుతం యస్. ఐ. ప్రమోషను రాకపోయినా, "అవుట్ పోలీసు స్టేషను ఇన్‌చార్జి" గా వచ్చినందుకు కొంత తృప్తిగానే ఉంది వెంకటస్వామికి.

అదొక చిన్న గ్రామం. చిన్నా పెద్దా కలిపి సుమారు ఐదువందల కొంప లుంటాయి. అది పార్వతీపురం రాయగడ రోడ్డు మీద పార్వతీపురానికి తొమ్మిదిమైళ్ల దూరంలో వుంది. గ్రామం చిన్నదైనా అది పదిహేను గిరిజన గ్రామాలకి కేంద్రం. నిజానికి అక్కడ పోలీసు స్టేషను అవసరం లేదు. కాని ఆ మధ్య నక్సలైట్ల ఉద్యమం ఆ ప్రాంతంలో ఉండటంవల్ల అక్కడ పోలీసు స్టేషను అవసరమొచ్చింది. రెండు సంవత్సరాల క్రితం దాక అక్కడ ఒక ప్రత్యేక పోలీసుదళం కూడా ఉండేది. ఆ వూరు ఒరిస్సా ఆంధ్ర సరిహద్దుల్లో వుండటంవల్ల అక్రమ రవాణా అరికట్టేందుకు కూడా అక్కడ పోలీసు స్టేషను అవసరమయింది.

పోలీసు స్టేషన్లో రెండు గదులున్నాయి. చుట్టూ వెదురు బద్దల కంచె వుంది. ముందు తాటి కమ్మలతో పందిరి వేశారు. ముందుగది కొంచెం పెద్దగది. దానివెనుక లాకప్ గది. పెద్దగది మధ్యలో ఒక టేబులు. టేబులుకి రెండు వైపులా ఒక కుర్చీ ఒక పొడుగు బెంచీ ఉన్నాయి. గదికి ఒక మూల ఒక పెద్దక్కర పెట్టె వుంది. అది "రికార్డు" బాక్సుగా వాడుతున్నారు. మరొకమూల రెండు తుపాకులు బాయ్‌నెట్లతో నిలబెట్టబడ్డాయి.

కానిస్టేబులు కనకారావు ఆ వూళ్ళో నాలుగు సంవత్సరాలుగా వుంటున్నాడు. వచ్చిన ఇన్‌ఛార్జీలందరికి కుడిభుజంలా పని చేస్తుంటాడు. అతడికి ఆ వూరు, ఆ పరిసర ప్రాంతాలు, ఆ వూరి మనుషులు కుణ్ణంగా తెలుసు.

"కనకారావ్! అలా వూళ్ళోకి వెళ్ళి చూసొద్దామా ?" ఊరిని చూడాలని అభిప్రాయంతో అన్నాడు వెంకటస్వామి.

"ఏం వూరు సార్ ! ఒక రోడ్డా, ఒక తీరా తెన్నా ఏమిటి చూస్తాం ?" పెదవి విరిచాడు కనకారావు.

"చూడ్డానికి కాదు. ఊరు స్వరూపం ఎక్కడ ఏది వుందో తెలుసుకోవాలిగదా !"

"సరే! పదండి." దారితీశాడు కనకారావు.

ఇద్దరు వెదురు కంచె దాటి బయటికి వచ్చారు. పోలీసు స్టేషనుకి ఎదురుగా చెరువు వుంది. చెరువుగట్టు దిగువున ఎడంప్రక్క నాలుగు పోలీసు క్వార్టర్సు వున్నాయి. వాటికి ఎదురుగా వెంకటస్వామి క్వార్టరు వుంది. చెరువుకి మూడు పక్కలా అడ్డదిడ్డంగా విస్తరించిన పెద్ద పెద్ద కొండలు గంభీరంగా నిలబడివున్నాయి. పోలీసు క్వార్టర్సు వెనుక నుండి సన్నని తారురోడ్డు చెరువును చుడుతూ కొండల్లోకి చొచ్చుకుపోతుంది.

ఇద్దరూ క్వార్టర్సు ప్రక్క నుండి తారురోడ్డు మీదికి వచ్చారు. రోడ్డుకి రెండుప్రక్కలా చిన్న చిన్న దుకాణాలు వున్నాయి. దుకాణాల తరువాత రోడ్డుకి ఎడంప్రక్క "బస్సు షెల్టరు" వుంది. దాన్ని పార్వతీపురం లయన్స్ క్లబ్బు మెంబరు వాళ్ళ నాన్నగారి జ్ఞాపకార్థం కట్టించాడు.

రోడ్డుమీద నడుస్తున్న క్రొత్త హేడ్‌ని జనమంతా భయభక్తులతో చూస్తున్నారు. కొంతమంది నమస్కారాలు పెడుతున్నారు. వెంకటస్వామి నమస్కారాలందుకుంటూ గంభీరంగా ముందుకు నడుస్తున్నాడు. వెంకటస్వామిది గంభీరమైన విగ్రహం. అయిదడుగుల పది అంగుళాల పొడుగు. పొడుక్కితగ్గ లావు. బలమైన శరీరం. వెడల్పాటి ముఖం. పొట్టిగా దళసరిగా కత్తిరించిన మీసాలు దట్టమైన కనుబొమలు. లోతుకుపోయి తీక్షణంగా చూసే కళ్ళు. ఎదుటివారిలో భయం, గౌరవం కలిగిస్తాయి. హేడ్ కానిస్టేబుల్ యూనిఫారమ్ మరింత గంభీరతను తెచ్చిపెట్టింది.

ఇద్దరూ నడుస్తూ బస్సు షెల్టరు దగ్గర ఆగారు. ఇంతలో రాయగడ నుండి పార్వతీపురానికి వెళ్ళే బస్సు వచ్చి ఆగింది. ఒక పాసంజరు దిగాడు. ముగ్గురు పాసంజర్లు ఎక్కారు.

"వస్తార్సార్ ?" వినయంగా అడిగాడు హేడ్ డ్రెస్‌లో వున్న వెంకటస్వామిని చూసి బస్ కండక్టరు.

వెంకటస్వామితోపాటు కనకారావు తల అడ్డంగా తిప్పారు. అంతవరకు పుట్‌బోర్డుమీద ఒక కాలు, నేలమీద ఒక కాలు వేసి నిలబడిన క్లీనరు లోపలికి ఎక్కుతూ "రైట్" అన్నాడు.

డ్రైవరు గేరు మార్చాడు.

"ఆపు !" అన్న మాట కొంచెం ముద్దగా అధికారయుతంగా వినిపించింది.

రు. 600 బహుమతి పొందిన కథ

బస్సు డ్రైవరుతోపాటు వెంకటస్వామి, కనకారావులు అటు చూశారు. గవర్నమెంటు సారా దుకాణం నుంచి అప్పుడే బయటికి వస్తున్న కాళిదాసు కనిపించాడు. బస్సు సుమారు పదిగజాలు ముందుకెళ్ళి ఆగిపోయింది.

"వాడే సార్ ! రౌడీ, కేడీ, కాళిదాసు !" చిన్నగా గొణుగుతున్నట్టుగా అన్నాడు కనకారావు.

"కాళిదాసా ? ...' ప్రశ్నార్థకంగా కనకారావు వైపు చూశాడు వెంకటస్వామి.

కాళిదాసు సారాకొట్టు నుండి బయటికి వచ్చి ప్రక్కనే వున్న కిళ్ళీకొట్టు దగ్గర నిలబడ్డాడు. ఇనపగజానికి వేలాడుతున్న రెండు చేగోడీలు తీసుకొని ఒక ముక్క నోట్లో వేసుకున్నాడు.

"రే! ఎంకటి! కిళ్ళీ కట్రా!" ముద్దగా, కటువుగా వున్నాయి మాటలు.

"ఒకటా! రెండా!" భయంగా అడిగాడు వెంకటి.

"రొండు! బీడీకట్ట ... అగ్గిపెట్టె."

వెంకటి ముఖంలో రంగులు మారాయి. దీపం పెట్టగానే యీ ముదనష్టపు యవ్. యస్. బేరం వచ్చినందుకు మనసులో తిట్టుకుంటూ పైకి నవ్వు ముఖం పెట్టుకొని రెండు కారాకిళ్ళీలు, బీడీకట్ట, అగ్గిపెట్టె అందించాడు.

అప్పటికి చేగొడీలు తినడం పూర్తిచేసి ఒక కిళ్ళీ వేసుకొని మిగతావి జేబులో వేసుకొని ప్రక్కనే వున్న చిల్లరకొట్టుకి వెళ్ళాడు.

"వాడు పెద్ద రౌడీ సార్ ! యీ ఊరేకాదు, యీ చుట్టుప్రక్కలంతా కాళిదాసంటే హడల్. వాడికి ఎవరూ ఎదురుచెప్పరు." అంతవరకూ కాళిదాసునే చూస్తున్న వెంకటస్వామితో అన్నాడు కనకారావు.

"కాళిదాసు..." గొణుక్కున్నాడు వెంకటస్వామి. ఎక్కడో పేరు విన్నట్టుంది. అవును! కాళిదాసు పెద్ద క్రిమినల్ ... జిల్లా పోలీసాఫీసులో కూడా కాళిదాసు ఫైలు వుంది. గుర్తుకొచ్చింది వెంకటస్వామికి.

"ఏరా! ఏడ్రా నీ బాబు ?" చిల్లరకొట్లో కూచున్న పన్నెండేళ్ల సాహుకారు కొడుకుని పెద్దగా అరిచినట్టు అడిగాడు.

"వస్తున్నా! నువ్వా కాళిదాసు! ఏమిటిలా వచ్చావు?" లోపల్నించి వస్తూ వినయం ఉట్టిపడేలా అడిగాడు షాహుకారు.

"ఆఁ! ... అయిదురూపాయలు కావాలి !"

ముందే ఊహించిన షాహుకారు కాళిదాసు సంగతి పూర్తిగా తెలిసినవాడవటంచేత గల్లాపెట్టెలోంచి ఒక రెండురూపాయల నోటు, మూడు ఒక రూపాయనోట్లు తీసి మళ్ళీ లెక్కపెట్టి మడిచి కాళిదాసు చేతిలో పెట్టాడు.

కొట్లోవున్న గాస్‌లైటు వెలుగులో స్పష్టంగా కనిపిస్తున్నాడు కాళిదాసు. ముడుకులమీదికి కట్టిన పంచె. ఒంటిమీద కాకీ కమీజు. భుజంమీద ఏ రంగో స్పష్టంగా చెప్పలేని తువ్వాలు. సుమారు అయిదడుగుల మూడంగుళాల పొడుగు. అంత లావు సన్నంకాని శరీరం. చప్పిడిముక్కు, పెద్ద నోరు. చిన్నచెవులు, పల్చని కనుబొమలు, మూసుకుపోతున్నట్టున్న చిన్న కళ్ళు. చూసినవాళ్ళకి అమాయకుడిలా కనిపిస్తాడు. పేరుమోసిన రౌడీ అంటే ఎవరూ నమ్మరు.

వెంకటస్వామికి అదే. అనుమానం వచ్చింది. నమ్మలేనట్టుగా కనకారావు వైపు చూశాడు.

తాగిన సారా పంటబట్టింది. తూలుతూ అడుగులువేస్తూ కనకారావుని రాసుకుంటూ అంతవరకు యింజన్ ఆన్‌చేసి వుంచిన బస్సు ఎక్కాడు కాళిదాసు.

వెంకటస్వామి అనుమానం అర్థమయింది, కనకారావుకి.

"నిజమే సార్ ! వాడు పైకి అలా కనిపిస్తాడు గాని చాలా డేంజరస్. ఎవడైనా యెదురుతిరిగితే వాడి రక్తం కళ్లచూడందే వదలడు. అందుకే వీళ్లందరికి భయం. వాడు యేది కావాలంటే అది మారుమాట్లాడకుండా యిచ్చేస్తారు. వాడికి యిష్టంవుంటే తిరిగి యిస్తాడు. లేకపోతే లేదు. అడిగే ధైర్యం యెవరికీలేదు. మీరూ చూశారుగా ?"

"ఔను!" ముక్తసరిగా అన్నాడు వెంకటస్వామి. ఆలోచిస్తున్నాడు.

"అందరూ వాడి వెనక తిట్టుకున్నవాళ్లేగాని వాడి ముందు పల్లెత్తుమాట అనరు." మళ్ళీ అన్నాడు కనకారావు.

"మరి ఊరివాళ్ళందరూ యేకమై యేదైనా చెయ్యొచ్చుగా !"

"చెయ్యవలసినవన్నీ చేశారు. వాడు దేనికీ లొంగలేదు." కనకారావు ఆ వూళ్ళో నాలుగేళ్లబట్టి వుండటంవల్ల కాళిదాసు సంగతి అతడికి బాగా తెలుసు. కాళిదాసంటే కనకారావుకి భయమే.

"ఇంతకుముందున్న మనవాళ్లంతా ఏం చేసినట్టు ?" సాలోచనగా అడిగాడు వెంకటస్వామి.

"ఏదైనా చెయ్యాలని చూసి ఏమీ చెయ్యలేక వదిలేశారు." మీరుకూడా ఏం చెయ్యలేరు – వాడి జోలికి వెళ్ళకండి అన్న భావంతో అన్నాడు కనకారావు.

"అంత గట్టివాడా !" కొంచెం ఆశ్చర్యంతో అన్నాడు వెంకటస్వామి.

"పోను పోను మీకే తెలుస్తుంది. మన ఫైళ్లనిండా వాడి ప్రతాపమే !"

"సరే! చూద్దాం!" ఆలోచిస్తూ స్టేషనుకి దారితీశాడు వెంకటస్వామి.

ఇద్దరూ స్టేషనుకి చేరుకున్నారు. హరికేన్ లాంతరు వెలిగించి టేబిలుమీద పెట్టాడు కనకారావు. గదిలో మూలగా వున్న రికార్డుబాక్సు తాళంతీసి కొన్ని ఫైల్సు తెచ్చి వెంకటస్వామి ముందు పెట్టాడు.

వెంకటస్వామి సిగరెట్టు ముట్టించి ఆలోచిస్తున్నాడు.

"ఆ ఫైళ్ళు చూడండి సార్ ! మీకే

బోధపడుతుంది.'' నిశ్శబ్దాన్ని చీలుస్తూ అన్నాడు కనకారావు.

ముందున్న ఫైళ్ళలో ఒకదాన్ని తీసి దీక్షగా చదివాడు వెంకటస్వామి.

పాలేరు రాముడు మాయం ... రెండురోజుల తరువాత రాముడి శవం బయటపడటం ... శవ పరీక్షలో హత్య అని నిరూపణ ... హంతకునికోసం గాలింపు – అనుమానంమీద కాళిదాసు అరెస్టు ... సరైన సాక్ష్యం లభించనందున కేసు ముందుకి నడవని వైనం – నిరూపణ కానందున కాళిదాసు విడుదల.

''ఇది యెలా జరిగింది ?'' కుతూహలంగా అడిగాడు వెంకటస్వామి.

కాళిదాసుకి ముందు వెనక యెవరూ లేరు. పైలావచ్చీసుగా తిరుగుతుండేవాడు. ఎవరు ఏ పని చెప్పినా చేస్తుండేవాడట. క్రమంగా ఊళ్లోవాళ్ళు కాళిదాసుని తమ స్వప్రయోజనంకోసం వాడుకుండే వారు. రెండు సారాబుడ్లు ఇచ్చి ఒక పదిరూపాయలు చేతిలో పెడితే యెంత పనైనా చేసేవాడు. ఆ విధంగా ముందు కాళిదాసు కిరాయి రౌడీ అయ్యాడు. నరసయ్యగారని యీ ఊళ్ళో పెద్ద మోతుబరి. రాముడు నరసయ్య దగ్గర పాలేరు. నరసయ్య కూతురుకి, రాముడికి అక్రమ సంబంధం వుందని అందరూ అనుకుండేవారు. అది ఒకనాడు నరసయ్య కళ్లబడింది. నరసయ్య బాగా ఆలోచించి అప్పటికే పిల్లరౌడీగా పేరుగాంచిన కాళిదాసుని సారాబుడ్లతోను, డబ్బుతోను ఆశ్రయించాడు. ఆ మర్నాడే రాముడు కనపడలేదు. ఊరి వాళ్లందరికీ ఈ విషయం తెలిసినా కళ్లతో ఎవరూ చూడలేదు. అందువల్ల కాళిదాసుతో విరోధం యిష్టంలేక యెవరూ సాక్ష్యానికి రాలేదు. కోర్టులో కేసు బుజువు కాకపోవడంతో కాళిదాసుని వదిలేశారు. అప్పటినుండి కాళిదాసుకి కోర్టులన్నా పోలీసులన్నా భయం పోయింది. తనని యెవడూ ఏం చెయ్యలేడన్న ధీమాతో విచ్చలవిడిగా తిరుగుతుండేవాడు. దాంతో అప్పటివరకు పిల్లరౌడీగా వున్న కాళిదాసు పెద్ద రౌడీ అయిపోయాడు.

అంతా విన్న వెంకటస్వామి మరొక ఫైలు అందుకున్నాడు.

కరణం వెంకట్రావుగారింట్లో చోరీ...నగలు, చీరలు, రేడియో, రెండు చేతిగడియారాలు, యెనిమిదివందల రొఖ్ఖం గల్లంతు. కేడీ కాళిదాసు మీద అనుమానం ... పోలీసు నిఘా ... పోయిన వస్తువులకై గాలింపు ... వస్తువుల ఆచూకీ తెలియక సరైన సాక్ష్యం లేక కేసు నిలచిపోవడం ... కాళిదాసు విడుదల.

మరొక ఫైలు అందుకున్నాడు వెంకటస్వామి.

ఆడదానిమీద అత్యాచారం ... బలత్కారం, నగల అపహరణ ... దీంట్లోకూడా నిందితుడు కాళిదాసే! యిందుక్కూడా సరైన సాక్ష్యాధారాలు లభించని వైనం. కాళిదాసు విడుదల.

''మనవాళ్లు సరిగ్గా ఇన్వెష్టిగేషన్ చేసుండరు! అందుకే తప్పించుకోగలిగాడు!'' అన్నాడు వెంకటస్వామి.

''లేదు సార్! యస్. పి. దొరగారు కూడా

హేడ్ వెంకటస్వామి

యిందులో కల్పించుకున్నారు. మన వాళ్లందరూ నిద్రాహారాలు మాని పని చేశారు. అయినా వాడికి వ్యతిరేకంగా ఏ సాక్ష్యం లభించలేదు. ఎంతచేసినా వాడ్ని పట్టుకొని జైలుకి పంపలేకపోయాం!'' అన్నాడు కనకారావు.

మరొక ఫైలు అందుకున్నాడు.

అందులో ఊరివాళ్లందరూ కలసి వాడి బాధలు భరించలేక జిల్లా కలెక్టరుకి, పోలీసు సూపరెంటుకి పెట్టుకున్న పిటీషను. దానిమీద యింతకుముందు వాడిమీద చాలా కేసుల్లో అనుమానంవల్ల యస్. పి. గారు విచారణకి రావటం, ఈ విషయాన్ని ముందే పసిగట్టిన కాళిదాసు యస్. పి. వచ్చిన ముందురోజు రాత్రే ఊరివాళ్లందర్ని హెచ్చరించడంవల్ల యెవరూ విచారణలో సాక్ష్యం చెప్పడానికి రాకపోవడం. దాంతో పిటీషన్లో వున్న విషయాలు బుజువు కాకపోవడం. యస్. పి. గారు ఏం చెయ్యలేక తిరిగి వెళ్లిపోవడం...

ఫైళ్లు ప్రక్కకి జరిపి కనకారావువైపు చూశాడు వెంకటస్వామి.

''అలా ఊళ్లోవాళ్లకి, మన డిపార్టుమెంటుకి కొరకరాని కొయ్య అయిపోయాడు. వాడి గురించి చెప్పాలంటే యింకా చాలావుంది సార్! వాడి సంగతి మనకెందుకు?'' అని ఆవులించాడు కనకారావు.

వెంకటస్వామి ఆలోచిస్తున్నాడు. ఇటువంటి ఖూనికోర్ని, దొంగని, రౌడీని గనుక పట్టుకుంటే తప్పకుండా తనకి యస్. ఐ. ప్రమోషను వస్తుంది. ఎలా పట్టుకోవడం? ఎలా యిరికించడం? తీవ్రంగా ఆలోచిస్తున్నాడు వెంకటస్వామి. ఉన్నవన్నీ ముగిసిన పాతకేసులే...పెండింగ్‌లో యేదీ లేదు... పోనీ క్రొత్త కేసు ఒకటి బనాయిస్తే ... బాగానే వుంటుంది. కాని యెలా? సిగరెట్టుమీద సిగరెట్టు కాల్చి ఆలోచిస్తున్నాడు. ఆలోచిస్తున్న వెంకటస్వామికి ఒక చక్కని ఆలోచన వచ్చింది.

''కనకారావ్!...''ఉత్సాహంతో అరచినట్టుగా పిలిచాడు.

కునికిపాట్లు పడుతున్న కనకారావు తుళ్లిపడ్డాడు.

''రేపు పొద్దున్న కిళ్లీకొట్టు వెంకటిని, ఆ షాహుకార్ని స్టేషనుకి తీసుకురా!...''

ముందు ఆశ్చర్యపోయినా తరువాత పోలీసుబుర్ర కాబట్టి అర్థం చేసుకున్నాడు కనకారావు.

''ఎందుకు సార్? ఆ కాళిగాడిమీద కేసు బనాయించడానికేనా?...''

అవునన్నట్టు తలూపాడు వెంకటస్వామి.

''వాడి జోలి మనకెందుకు సార్?... వాడి సంగతి పూర్తిగా మీకు తెలియదు. వాడితో వ్యవహారం నిప్పుతో చెలగాటం!...''

కోపంగా చూశాడు వెంకటస్వామి.

''ఇంత పిరికివాడివి నీకు పోలీసు ఉద్యోగం ఎవడిచ్చాడయ్యా?'' కసిరినట్టు అన్నాడు వెంకటస్వామి.

''లేదు సార్! నా మాట వినండి. మీ మంచి కోరి చెపుతున్నాను. మునపు మీలాగే అప్పారావుగారని మీకు తెలుసనుకుంటాను యిక్కడ ఇన్‌చార్జీగా ఉండేవారు. అతడు మీలాగే వీడ్ని ఏదో ఒకటి చెయ్యాలని ప్రయత్నించాడు. ముందే పసిగట్టిన కాళిగాడు ఆయన ఒక్కడూ ఉండే సమయం చూసి చావగొట్టేడు. దాంతో ఆయన మంచమెక్కి పది రోజులదాకా లేవలేదు. తరువాత చేసేదిలేక అవమానాన్ని భరించలేక ట్రాన్స్‌ఫరు చేయించుకున్నాడు.

వెంకటస్వామి ముఖం ఆవేశంతో కందగడ్డలా తయారయింది. వెంకటస్వామి పిరికివాడు కాదు. యస్. ఐ. ప్రమోషను కళ్లముందు మెదుల్తుంది. పిడికిళ్లు బిగుసుకుపోయాయి. వాడ్ని ఎలాగైనా పట్టుకొని యస్. ఐ. ప్రమోషను పొందాలన్న దృఢ నిశ్చయం ఏర్పడింది.

''కనకారావ్! నువ్వు జవానువి. నేను యిన్‌ఛార్జి. నేను చెప్పినట్టు చెయ్యి'' దృఢంగా అన్నాడు వెంకటస్వామి.

''అలాగే తీసుకొస్తాను సార్!'' అని మనసులోనే ఖర్మ అనుకున్నాడు కనకారావు.

మర్నాడు పొద్దున్నే కిళ్లీకొట్టు వెంకటి, షాహుకారు వచ్చి వంగి వంగి దండాలు పెట్టి నిలబడ్డారు. వెంకటస్వామి వైపు ఎందుకు పిలిపించాడో తెలియక భయంతో చూస్తున్నారు.

''కూర్చోండి!'' పొడుగు బెంచీ చూపించి సౌమ్యంగా అన్నాడు వెంకటస్వామి.

ముందు ఊరి విషయాలు, వ్యాపార విషయాలు అడిగాడు, సూటిగా అసలు విషయంలోకి దిగకుండా వాళ్లలో భయాన్ని పోగొట్టడానికి. దానికి వాళ్లు తోచిన సమాధానాలు చెప్పారు. వాళ్ల నోటితో వాళ్లే కాళిదాసుని గురించి చెప్పేటట్టు కొన్ని ప్రశ్నలు డొంకతిరుగుడుగా అడిగాడు. వాళ్లు మాత్రం కాళిదాసు ఊసే తేలేదు.

''చూడండీ! నిన్న మీ యిద్దరి దగ్గరికి ఒకడు వచ్చి, నీ దగ్గర కిళ్లీలు, బీడీకట్ట, అగ్గిపెట్టె తీసుకున్నాడు. నీ దగ్గర అయిదు రూపాయలు తీసుకున్నాడు కదా!'' వాడెవడు?... అని వెంకటివైపు షాహుకారు వైపు చూసి తెలియనట్టు అడిగాడు.

ఆచారాలు

ఆచారాలు కురిపిస్తున్నాయి
అలజడుల జడివానలు
చేస్తున్నాయి దాహోదం
అన్యాయాలకు అపోహలకు
ఆచారాల చీకటి ముసుగుల్లో
దాగివున్న సమాజానికి
ఎప్పుడు వస్తుంది సమ సమాజ వెలుగు?
నవనాగరికులనే అగ్రగణ్యులు
వింత మనస్తత్వాలతో
వేలెత్తి చూపిస్తూ వెక్కిరిస్తుంటే
ఎప్పుడు వస్తుంది సమ సమాజ వెలుగు?
అపరాధాలు చేయకున్నా
తమపై మోపిన అవమానాలను
భరించలేక
గుండెల్లో మండే వ్యథలతో
అభివృద్ధి పథంలో ముందుకు పోలేక

ఇదేదో గట్టి చిక్కుల్లో పడబోతున్నామని చెప్పడానికి సందేహించారు.

"ఫరవాలేదు! చెప్పండి!" సాధ్యమైనంత సౌమ్యంగా అడిగాడు.

"వాడా!... వాడు... కాళిదాసండి."

"వాడు తిరిగి మీకు తీసుకున్న డబ్బు యివ్వడు కదూ?"—

"అట్టే లేదండి! యిచ్చేస్తాడు" యిద్దరూ నసిగారు.

"లేదు! యివ్వడు — మీరు అడగనూ లేరు — అవునా?"

హెడ్‌గారికి విషయమంతా తెలుసులా ఉంది. ముందుకెళ్తే నుయ్యి, వెనుక్కొస్తే గొయ్యిలా ఉంది వాళ్ల పరిస్థితి. మౌనం వహించారు.

"అవును! నాకంతా తెలుసు!" వాడంటే మీ కెందుకంత భయం?..."

వాళ్లు సమాధానం చెప్పలేదు.

"మరేం ఫరవాలేదు, నిన్న జరిగినది ఒక రిపోర్టు రాసి యివ్వండి. వాడి సంగతి నేను చూస్తాను." అనునయంగా, దృఢంగా అన్నాడు వెంకటస్వామి.

ఉలిక్కిపడ్డారు యిద్దరూ. ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. వాళ్ల కళ్ళల్లో భయం స్పష్టంగా కనిపిస్తుంది.

"ఎందుకు భయం? అందరూ అలా ఊరుకుంటే వాడిని పంపేదెవరు? మేము, మా డిపార్టుమెంటు ఉండి ఏం లాభం?"

దానికి సమాధానం చెప్పలేదు.

"రిపోర్టు యిస్తారా? యివ్వరా?" కొంచెం కటువుగా అడిగాడు.

"క్షమించండి బాబూ! ఆ పని మావల్ల కాదు. పిల్లా పాపల్తో ఉన్నాం. వాడిమీద రిపోర్టు యిచ్చి మా ప్రాణంమీదికి తెచ్చుకోలేము. ఎలా జరిగితే అలా జరుగుతుంది. మీరు మమ్మల్ని యిరుకుల్లో పెట్టకండి" ప్రాధేయపడుతూ అన్నారు.

"నా మాట నమ్మండి! మీరు రిపోర్టు యిచ్చినట్టు మూడో కంటికి తెలియనివ్వను. మీరు రిపోర్టు యిచ్చిన మరుక్షణం వాణ్ణి లాకప్‌లో ఉంచి పార్వతీపురం పంపేస్తాను. వాడిమీద పాత కేసులు ఉన్నాయికదా! దీంతో అవి అన్నీ కెలికి ఊరికి వాడి పీడ లేకుండా చేస్తాను."

"మీరేం చెప్పినా చేస్తాంగాని వాడిమీద రిపోర్టు మాత్రం యివ్వం. మా మానాన్ని మమ్మల్ని ఉండనివ్వండి" అన్నారు యిద్దరూ ఏక కంఠంతో.

వెంకటస్వామి ఎన్ని విధాలో నచ్చచెప్పాడు. కాని వాళ్లు ససేమిరా వినలేదు. వెంకటస్వామి విసిగిపోయి ఆలోచనలో పడ్డాడు. అదను చూసి యిద్దరూ శలవు పుచ్చుకున్నారు.

"చూశారా సార్! నేను చెప్తే నమ్మలేదు. వాడంటే ఊళ్లోవాళ్లందరికి సింహస్వప్నం, వాడి ఎదురుగా నిలబడలేనివాళ్లు వాడిమీద రిపోర్టు యిస్తారా?" అంతవరకు మౌనంగా వింటున్న కనకారావు అన్నాడు.

రిపోర్టు లేందే ఏం చెయ్యలేడు. ఊళ్లో వాళ్లెవరూ వాడిమీద రిపోర్టు యివ్వరు. వాణ్ణి ఎలా పట్టుకోవటం, మరి తన యస్. ఐ. ప్రమోషను సంగతి ఏమిటి?... ఆలోచిస్తున్నాడు వెంకటస్వామి. ఏ దారి కనపడటంలేదు.

రోజులు గడిచిపోతున్నాయి. రాత్రింపగళ్లు కాళిదాసును గురించే ఆలోచిస్తున్నాడు వెంకటస్వామి. ఎలాగైనా కాళిదాసుని జైలుకి పంపి యస్. ఐ. ప్రమోషన్ కొట్టేద్దామని ఎన్నో విధాల ఆలోచిస్తున్నాడు.

ఆ రోజు పేపరు చదువుతున్నాడు వెంకటస్వామి. ఇంతలో పార్వతీపురం నుండి ఒక కానిస్టేబులు వచ్చి ఒక కవరు యిచ్చాడు. అది పార్వతీపురం తాలూకా యస్. ఐ. దగ్గర్నుండి వచ్చింది. కవరు విప్పి చూశాడు. పార్వతీపురంలో ఒక సైకిలు పోయినట్టు, అది కాళిదాసే దొంగిలించాడని అనుమానంగా ఉందని ఆ సైకిలు గుర్తులు యిచ్చి ఎంక్వయిరీ చెయ్యమని ఉంది.

కొండంత ఉత్సాహం వచ్చింది వెంకటస్వామికి. వెదకబోయిన తీగ కాలికి తగిలినట్లయింది. తుపాకీకి తగిలించి ఉన్న బాయ్‌నెట్ తీసి మొల్లో దోపుకున్నాడు. కనకారావుని పిల్చి స్టేషను బయటికి వచ్చాడు.

"రౌడీ కాళిగాడి యిల్లెక్కడ?" అడిగాడు వెంకటస్వామి.

"ఎందుకు సార్?" వణుకుతున్నాడు కనకారావు.

"పద ముందు!" గర్జించాడు వెంకటస్వామి.

తనకు దగ్గిరపడిందనుకున్నాడు కనకారావు. ఏదో చెప్పబోయి వెంకటస్వామి ముఖంలోకి చూశాడు. ఆ ముఖంలోని తీక్షణతకి తట్టుకోలేక ముఖం ప్రక్కకి తిప్పి దేవుడిమీద భారం వేసి ముందుకు దారితీశాడు కనకారావు.

కాళిదాసు యిల్లు తాటికమ్మలతో నెయ్యబడి ఒంటరిగా ఉంది యింటి ముందు పెద్ద చింత చెట్టు ఉంది. యిద్దరూ యింటి దగ్గరికి వచ్చారు. యింటి తలుపు గొళ్లెం వేసి ఉంది. అరుగుమీద సైకిలు స్టాండు వేసి ఉంది. జేబులోంచి కాయితం తీసి అందులో గుర్తులు ఈ సైకిలు గుర్తులు పోల్చి చూశాడు వెంకటస్వామి. రెండూ సరిపోయాయి.

"కనకారావ్! సైకిలు పట్టుకో" ఆజ్ఞాపించాడు.

పాముని చూసినట్టు సైకిల్ని చూశాడు కనకారావు. వణుకుతున్న చేతుల్తో సైకిల్ని పట్టుకున్నాడు. సైకిల్ని నడిపించుకు తెచ్చి స్టేషన్లో పెట్టాడు. ఆ తరువాత ఓ కొండంత భారం తగ్గినట్టనిపించింది కనకారావుకి. మధ్య దార్లో కాళిదాసు కనబడనందుకు సంతోషించాడు.

సాయంత్రం పావు తక్కువ ఏడు గంటలయింది. మత్తుగా తాగి తూలుతూ పోలీసు స్టేషనుకి వచ్చాడు కాళిదాసు. హరికేన్ లాంతరు వెలుగులో కాళిదాసు మొల్లో మెరుస్తున్న చురకత్తిని చూసిన కనకారావు గుండె దడ దడ కొట్టుకొంది. వెంకటస్వామి మాత్రం తొణకలేదు, బెణకలేదు. స్థిమితంగా కుర్చీలో కూచున్నాడు.

"రే! ఎవ్వడ్రా నా సైకిలు యిక్కడ తెచ్చి పెట్టాడు?" సైకిల్ని వెంకటస్వామిని మార్చి మార్చి చూస్తూ అన్నాడు కాళిదాసు.

"నేనే!" గంభీరంగా అన్నాడు వెంకటస్వామి.

"ఎందుకు బే తెచ్చావు?"

"మర్యాదగా మాట్లాడు, అది నీది కాదు గనుక! నీవు దొంగిలించావు గనుక!"

"దొంగలాడ్డమే నా పని, కొనడం నా కలవాటు లేదు."

"నీలాటివాళ్లను వదలడం నాకూ అలవాటు లేదు."

పెంకు అదిరిపోయేలా నవ్వాడు కాళిదాసు.

"నీలాటోళ్ని శానామందిని సూశాను!" సైకిలు తీసికెల్తాను. ఏటి సేత్తావో సేస్కో!" అంటూ సైకిలువైపు నడిచాడు కాళిదాసు.

"ఆగు! సైకిలుమీద చెయ్యి వేశావా పళ్ళు రాల్తాయి."

"రే! నోర్ముయ్ నా కొడకా! యిదిగోరా... సెయ్యేసేను — దమ్ముంటే రారా!"

వెంకటస్వామిలో ఆవేశం ముంచుకొచ్చింది. ఒక్కుదుటన లేచి కాళిదాసుమీద పడ్డాడు. అప్పటికే చురకత్తి తీసి రడీగా పట్టుకున్న కాళిదాసు విసురుగా కత్తితో పొడిచాడు. అది సరిగ్గా వెంకటస్వామి డొక్కల్లో దిగవలసిందే. కాని చేత్తో అడ్డుకోవటం వల్ల మోచేతిలో దిగబడిపోయింది.

"తెలిసిందిరా నా కొడకా!" కాళిదాసంటే ఏటో."

వెంకటస్వామిలో అహం దెబ్బతింది. ఒకప్రక్క యస్. ఐ. ప్రమోషను...మరొక ప్రక్క ప్రాణం... అభిమానం తలెత్తింది. ఛీ!... ఒక రౌడీ వెధవకి జడిసి పిరికిపందలా ఊరుకోవడమా?... పోలీసన్న పేరుకే నామోషి. పౌరుషం పరవళ్లు త్రొక్కింది. ఎదురుగా మూలగా నిలబెట్టిన తుపాకీవైపు కదిలాడు వెంకటస్వామి. అది గ్రహించాడు కాళిదాసు. వెంటనే మళ్లీ కత్తి విసిరాడు. ఈసారి వీపుకి కుడిప్రక్క భుజంలో దిగింది కత్తి. సుళ్ళున రక్తం చిమ్మింది. రక్తాన్ని చూసిన వెంకటస్వామి కళ్ళు రక్తంకన్నా ఎరుపెక్కాయి. ముందుకు తిరిగాడు.

— శ్యామల తారారెడ్డి

అన్యాయాల అడవిలో నిలువలేక
అక్రమాల ఆచారాల బంధంలో
బ్రతకలేక చావలేక
నలిగిపోతున్న అమాయకులు
ఆచారాలు చేసే అన్యాయాలకు
బలి అవుతున్నారు గొర్రెల్లా
మన మతం ఎన్నడూ
మన సోదరుల్ని
నీచంగా చూడమని
కాలితో రాయమని చెప్పలేదు.
స్వంత లాభాలకు
ఆచారాలను అడ్డుపెట్టుకొనే
గోముఖ వ్యాఘ్రాలను
బ్రతుకులు బట్టబయలు చేయకుంటే
మరి ఎలా వస్తుంది సమానత్వం
మనిషి మనిషిగా మరెలా మనగలడు?

మళ్లా కత్తి విసిరాడు. ఈసారి గుండెల్లో దిగవలసిన కత్తి ప్రక్కకి జరగడంతో ఎడం దండలో దిగింది.

రక్తం ధారాపాతంగా కారిపోతుంది. బట్టలన్నీ రక్తమయం అయిపోయాయి. ఆ సన్నని హరికేన్ లాంతరు వెలుగులో వెంకటస్వామి ఆకారం భయంకరంగా కనిపిస్తుంది. అది చూసిన కనకారావు చలిజ్వరం వచ్చినవాడిలా వణికిపోతున్నాడు. అరవాలంటే మూలుగు తప్ప గొంతు పెగలడంలేదు.

అంత బాధనూ ఓర్చుకుంటున్నాడు వెంకటస్వామి. లాభం లేదు. సమయం మించిపోతుంది. ఏదో ఒకటి చెయ్యాలి. ప్రాణం పోయినా కాళిగాడ్ని వదలకూడదు. మళ్లీ కాళిదాసు కత్తిని గొంతుక్కి గురిపెట్టాడు. కత్తి విసిరేలోగా పక్కకి తప్పుకొని బలాన్నంతా కూడదీసుకొని బూటుకాలితో చాచి డొక్కలో తన్నాడు వెంకటస్వామి. ఆ దెబ్బతో పెద్దగా మూలిగి తూలి సైకిల్ని గుద్ది కింద పడ్డాడు. కాళిదాసు మీద సైకిలు పడింది. చేతిలోంచి కత్తి తుళ్లిపోయింది. సైకిలు మీద పడటంతో వెంటనే లేవలేకపోయాడు కాళిదాసు. ఆ అదను చూసి గెడ్డం క్రింది కసిదీరా తన్నాడు. నోట్లోనుండి గుక్కెడు రక్తం వచ్చింది. లేవబోతున్న కాళిదాసు ముఖంమీద ఫెడీలుమని మళ్లీ తన్నాడు. ఈసారి కళ్లముందు మెరుపు మెరిసినట్లు అనిపించి తల వేలాడేశాడు కాళిదాసు. స్పృహపోయింది.

"కనకారావ్!" పిల్చాడు వెంకటస్వామి నీర్సంగా. రక్తం ధారాపాతంగా కారిపోతుంది. కళ్లు మూసుకుపోతున్నట్టనిపించింది.

"ముందు వాడికి బేడీలు తగిలించి లాకప్ రూములోకి ఈడ్చి తలుపెయ్యి."

కళ్ళు మూతలు పడుతున్నాయి, శరీరం తూలిపోతుంది. యిక నిలబడలేకపోయాడు వెంకటస్వామి. బెంచీమీద కూర్చోబోతూ క్రింద పడిపోయాడు. గదంతా రక్తమయం అయిపోయింది. రక్తంలో వెంకటస్వామి తేలుతున్నట్టనిపించింది కనకారావుకి. ఆ దృశ్యం చూస్తున్న కనకారావుకి కడుపు తరుక్కుపోయింది. కళ్ళు చెమర్చాయి. వెంటనే కర్తవ్యం గుర్తుకు వచ్చి ఒక కానిస్టేబుల్ని సైకిలుమీద హుటాహుటిని పార్వతీపురం పంపాడు. ఊర్లో ఉన్న ఆర్. యం. పి. డాక్టరికి కబురుపెట్టి ప్రథమ చికిత్స చేయించాడు. ఊరి జనమంతా వచ్చి చేరారు. అందరూ వెంకటస్వామి సాహసాన్ని మెచ్చుకున్నారు. ఊరికి కాళిదాసు పీడ వదిలినందుకు సంతోషించారు. వెంకటస్వామికి ప్రాణం నిలపమని భగవంతుడ్ని ప్రార్థించారు.

గంటంపావులో పార్వతీపురం నుండి పోలీసు వేను వచ్చి ఆగింది. అందులోంచి ఒక సి. ఐ. యస్. ఐ. ఆరుగురు కానిస్టేబుల్లు, ఒక డాక్టరు దిగారు.

డాక్టరు వెంకటస్వామిని పరీక్షించి రెండు యింజక్షన్లు యిచ్చి "ప్రాణ భయం లేదు! కాని చాలా రక్తం పోయింది. కోలుకోడానికి చాలా కైము పడుతుంది" అన్నాడు.

వెంకటస్వామికి ప్రాణ భయం లేదనగానే ఊళ్లోవాళ్ళందరు ముఖ్యంగా కనకారావు సంతోషించాడు.

వెంకటస్వామిని పార్వతీపురం గవర్నమెంటు ఆసుపత్రిలో జాయిన్ చేసారు. వెంకటస్వామికి రెండు రోజులు తరువాత తెలివి వచ్చింది. కళ్ళు విప్పగానే ముందు కనకారావు కనిపించాడు.

"సార్! మీరు గొప్ప ధైర్యం చేశారు, ఆఫీసర్లు ఊరి జనమంతా గొప్పగా చెప్పుకుంటున్నారు. మీకు తప్పకుండా ఈ దెబ్బతో యస్. ఐ. ప్రామోషను వస్తుందంటున్నారు సి. ఐ. గారు."

ఆ మాట వినగానే వెంకటస్వామి ముఖంమీద చిరునవ్వు వెలిగింది.

"సార్! మిమ్మల్ని చూడ్డానికి రేపు యస్. పి. దొరగారు వస్తున్నారట."

నిజమా అన్నట్టు చూశాడు వెంకటస్వామి.

తృప్తిగా కళ్ళు మూసుకున్నాడు. తనకు తప్పకుండా యస్. ఐ. ప్రామోషను వస్తుంది.

మర్నాడు యస్. పి. వచ్చి వెంకటస్వామిని చూశాడు. శ్రద్ధగా చూడమని డాక్టరుకి చెప్పాడు. ఏది కావలిస్తే అది వెంటనే ఏర్పాటు చెయ్యమని క్రింది ఆఫీసర్లని హెచ్చరించాడు. వెంకటస్వామిని యెంతగానో అభినందించాడు. స్ట్రాంగుగా యస్. ఐ. ప్రామోషనుకి రికమెండు చేస్తానన్నాడు. దాంతో వెంకటస్వామికి కొండంత ఉత్సాహం వచ్చింది.

"తమ దయ సార్!" గొంతు చాలా నీర్సంగా వుంది.

"మరేం ఫరవాలేదు. ధైర్యంగా, సంతోషంగా వుండు. మన డిపార్టుమెంటు అంతా నీతరుపున వుంది." అని ధైర్యం చెప్పి, యస్. పి. వెళ్లిపోయాడు.

నెలరోజులు ఆసుపత్రిలో వుండి కోలుకొని డిశ్చార్జి అయ్యాడు వెంకటస్వామి. ఆ తరువాత మరొక నెల యింటిదగ్గరే వుండి విశ్రాంతి తీసుకొని తరువాత డ్యూటీలో జాయిన్ అయ్యాడు. ఈ రెండు నెలలు యెంతో ఆత్రుతగా యెదురు చూశాడు ప్రమోషను వస్తుందేమోనని. కానీ ఏ కబురు తెలియలేదు. అలా మరొక నెల గడిచిపోయింది. వెంకటస్వామిలో నిరుత్సాహం చోటు చేసుకుంది. మధ్య మధ్య కనకారావు తప్పకుండా ప్రామోషను వస్తుందని ధైర్యం చెపుతునేవున్నాడు. అయినా వెంకటస్వామిలో ఆశ సన్నగిల్లిపోతుంది. తను ప్రాణాలకు తెగించి పడ్డ యింతా శ్రమా ఫలితంలేకుండా పోయినందుకు యెంతో విచారించాడు వెంకటస్వామి.

మోచేతిమీద గాయపు మచ్చని చూస్తూ కూచున్నాడు వెంకటస్వామి. ఇంతలో పరుగు నడకమీద వచ్చిన కనకారావు గోధుమరంగులో వున్న చిన్న కవరు అందించాడు.

"ఐ. జి నుండి సార్! తప్పకుండా ప్రమోషనే!" సంతోషంగా అన్నాడు కనకారావు.

ఒణుకుతున్న చేతుల్తో కవరు విప్పాడు వెంకటస్వామి. అందులో అరఠావు పావుఠావు కాయితాలు రెండు వున్నాయి. ముందు అరఠావు కాయితం తీసి చదవసాగాడు వెంకటస్వామి.

"డియర్ వెంకటస్వామి!" చదువుతున్న వెంకటస్వామి ముఖం చాటంత అయింది. కనకారావు ఆత్రుతగా వెంకటస్వామి ముఖంలోకి చూస్తున్నాడు.

అది వెంకటస్వామి ప్రాణాలకు సైతం లెక్కచేయకుండా తన విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తించి పోలీసు డిపార్టుమెంటు పేరు ప్రతిష్టలు నిలబెట్టినందుకు ఐ. జి. దగ్గర్నుండి వచ్చిన ప్రశంసాపత్రము.

రెండో కాగితాన్ని తప్పకుండా ప్రమోషనుదే అయివుంటుందని చదవసాగాడు వెంకటస్వామి. చదువుతున్న వెంకటస్వామి ముఖంలో రంగులు మారడం కనకారావు గమనిస్తునేవున్నాడు. అంతా చదివిన వెంకటస్వామి ముఖంలో కత్తివేటుకు నెత్తురు లేకుండా పోయింది. చేతిలోంచి జారిపోతున్న కాగితాన్ని అందుకున్నాడు కనకారావు. కూడబలుక్కుని చదవసాగాడు.

వెంకటస్వామి డ్యూటీలో చూపిన అసమాన ధైర్యసాహసాలకు మెచ్చి అతడి సేవకి ప్రతిఫలంగా పోలీసు డిపార్టుమెంటు వెంకటస్వామికి అక్షరాలా యాభై రూపాయల నగదు బహుమతి నివ్వడానికి సంతోషిస్తుంది.

కుర్చీలో జారగిలపడిన వెంకటస్వామి ముఖంలోకి చూడలేక బయటికి వెళిపోయాడు కనకారావు. ●

ర చ యి త ల కు వి జ్ఞ ప్తి

★ ఆంధ్ర సచిత్ర వార పత్రికలో ప్రచురణకు పరిశీలనార్థం మా కార్యాలయానికి చాలా ఎక్కువ సంఖ్యలో రచనలు, బొమ్మలు వస్తూంటాయి. నిబంధనలు పాటించి రచయితలు మాతో సహకరిస్తే తప్ప – ఆయా రచనల వైనం వారికి తెలియజేయడం సాధ్యం కాదని మేము పదే పదే విజ్ఞప్తి చేయటానికి కారణంకూడా అదే.

మా కార్యాలయానికి స్వయంగా వచ్చి రచనలు, కార్టూన్‌లు అందజేసేవారుకూడా పరిశీలనానంతరం వాటి వైనం తెలుసుకునేటందుకు తమ రచనలతో పాటు స్వంత చిరునామాగల స్టాంపు అతికించిన కవరు వుంచడం అవసరం. రచనపై అంగీకారం కాని, అనంగీకారంకాని ఆయా రచయితలకు తెలుపటానికి కనీసం ఆరు వారాలు పట్టవచ్చును. అది కూడా పోస్టు ద్వారా తెలియజేయడమే సాధ్యం.


★ రచనలతోగాక, విడిగ స్టాంపులు పంపడం, స్వయంగా వచ్చి రచనలు, కార్టూన్‌లు యివ్వమని కోరడం చాలామంది చేస్తుంటారు. ఇది చాలా యిబ్బంది కలిగించుతుంటుంది కనుక – తమ రచనతో లేదా బొమ్మలతో స్వంత చిరునామా, హామీ పత్రం మున్నగునవి, జత చేసి యివ్వడం లేక పంపడం చాలా అవసరం.

★ కార్టూన్‌లు పంపేవారు వారికి తిరస్కరింపబడిన కార్టూన్‌లు తిరిగి కావాలనుకుంటే స్వంత చిరునామాగల స్టాంపు లతికించిన కవరు జత చేసి తీరాలి. —సం.

ఆడుతూ పాడుతూ ఆనందంగా గడిపే ఈ రోజుల్లో మీ మొటిమలు, పొక్కుల నుంచి నివారణోపాయాన్ని వెతుకుతూనే ఉంటారా...లేక తక్షణం వాటి నుంచి విముక్తి పొందుతారా ?

రక్త దోషాంతక్

మొటిమలు మరియు పొక్కుల మూలకారణాన్ని తొలిగించే అమోఘమైన అంతర చికిత్స



పరిశుద్ధమైన ఆరోగ్యమైన రక్తం నిర్మలమైన, నిష్కళంకమైన ముఖ వర్చస్సు నిస్తుంది. రక్తంలో దోషం మొటిమలు మరియు పొక్కులకు కారణమౌతుంది. రక్తంలో దోషానికి కారణమేమిటి ? విషసంబంధమైన పదార్థాలు, అధికంగా పిత్తము మరియు ప్రాణవాయువు లోపము అన్నీ రక్త దోషానికి దారి తీస్తాయి. రక్త దోషాంతక్‌లో విష సంబంధమైన పదార్థాలను నిర్ధారణగా నిర్మూలించగల నాలుగు మూలికల రసమున్నది. ఇది లివరును ఉత్తేజ పరచి ఊపిరి తిత్తులపై చక్కగా పని చేస్తుంది. కేవలం పరిశుద్ధమైన రక్తము మాత్రమే మీ శరీరములో ప్రవహించేటట్లు చేస్తుంది.

రక్త దోషాంతక్ మీ శరీరములో 3 విధాలుగా పనిచేసి మొటిమలను, పొక్కులను నిర్మూలించి మీ ముఖం కళకళలాడుతూ ఉండేటట్లు చేస్తుంది. రక్త దోషాంతక్ కేవలం 20 రోజులు వాడి మీ మొటిమలు మరియు పొక్కులపై ఎంత అమోఘంగా పని చేస్తుందో మీరే గమనించండి.

మంచి రుచికరమైనది



"పొక్కులు మరియు మొటిమలు హాయిగా ఆనందంగా ఉండవలసిన నా జీవితాన్ని ఒక పీడకలగా తయారు చేసినాయి" అంటున్నారు ఇంగ్లండులోని బెడ్‌ఫోర్డ్‌షైర్ వనిత శ్రీమతి క్రిన్ పటేల్.



"నేను ఇంచుమించు అన్నీ వాడి చూపాను...లోషన్లు, క్రీములు, సబ్బులు. నేను భారత దేశానికి వచ్చినప్పుడు, ఒకరు రక్త దోషాంతక్ వాడమని సలహా ఇచ్చారు. ఇప్పుడు నా ముఖం చూడండి...క్రిందటి ఆరు మాసాలుగా ఒక్క మొటిమ కూడా లేదు"

రక్త దోషాంతక్

ఆఫాలి ఫార్మస్యూటికల్స్ లి.
ఆపజె గ్రూప్ ఎంటర్‌ప్రైజ్
199, చర్చ్‌గేట్ రిక్లమేషన్,
బొంబాయి-400 020.

CMAP - 3-244

సినిమా విశేషాలు

శోభన్, సుధల ప్రణయం

పోలీసు అధికారుల కన్నుగప్పి, తన ప్రేయసి దగ్గర కొచ్చాడు, శోభన్. తన ప్రేయుడ్ని చూడగానే, జయసుధ ఒళ్లంతా పింగారభావనతో పరవశించింది.

'రాణీ! మనం యిలా కలుసుకోగలగటం యెంత ఆనందంగా వుందో' అన్నాడు హీ-మాన్.

"అవును రాజా! మనల్ని యిక ఏ పరిస్థితి వేరుచేయలేదు. ఈ అనుభూతి, ఈ ఆనందం కోటిజన్మల వరకు యిలాగే వుండిపోతే యెంత బావుంటుంది" అన్నది గ్లామర్‌క్వీన్.

ఇద్దరూ మధుర క్షణాలను వృధా చెయ్యలేక పోయారు. మాటలతో సరిపెట్టుకోలేక, ఆనంద పారవశ్యంతో పాడసాగారు. ఆడసాగారు. ఎలాగో తెలుసా?

"కోటి జన్మల ఆనందం
శతకోటి జన్మల అనుబంధం
నేను నీవై వెలిశాము
నేడు మళ్లీ కలిశాము" అంటూ ప్రణయ సామ్రాజ్యాన్ని అనుభవించారు. ప్రేక్షకులను ఆకర్షించే యీ ఆనంద సన్నివేశం మారుతీ ప్రొడక్షన్స్ వారి "రాజా" వర్ణ చిత్రంలో ప్రత్యేకతను బడసియున్నది.

శోభన్ నటన అద్వితీయంగా వుందని రాయాలని యీ రచయిత అభిప్రాయపడుతూ వుంటే, అద్భుతంగా చేశారాయన అని యీ కలం బలపరుస్తూ వుంది. నవరసభరితమైన "రాజా" పాత్ర శోభన్ నట జీవితంలో మరపురానిదిగా నిల్చిపోతుంది.

భారీ చిత్రాల్ని నిర్మించే కొద్దిమందిలో ఎ. ఎల్. కుమార్‌గారు ఒకరని మరొకసారి "రాజా" చిత్రం నిరూపిస్తుంది.

చక్రవర్తి సంగీతం

ఈమధ్య విడుదలయిన చిత్రాల సంగీతానికి, "రాజా" చిత్రంలోని సంగీతానికి యెంతో తేడా కనిపిస్తుంది. చక్రవర్తికి కీర్తి తెచ్చిపెట్టగలదు "రాజా" చిత్రం.

"జ్యోతి" దర్శకుడు రాఘవేంద్రరావుగారికి ఖ్యాతిని ఆర్జించిపెట్టగలదు "రాజా" చిత్రం. శోభన్‌కు "రాజా" హిట్ చిత్రం కాగలదు. లక్ష్మి ఫిలింస్ విడుదల.

చరిత్ర హీనులు

వసూళ్ల దర్శకుడు బాపయ్య, తమిళ రచయిత బాలమురుగన్ రాసిచ్చిన కథకు "చరిత్ర హీనులు" అని పేరు పెట్టి, సంగీతాన్ని చక్రవర్తికి అప్పగించారు. ఈ చిత్రానికి మాటలు వ్రాసే పనిని మద్రాసు విశ్వవిద్యాలయంలో తెలుగు ఉపన్యాసకులుగా వుంటున్న పి. గంగాధరరావుగారు స్వీకరించారు.


"చరిత్ర హీనులు" చిత్రంలో, జమున, జయసుధ, జగ్గయ్య, సత్యనారాయణ, రావు గోపాలరావు ప్రధాన పాత్రలను పోషించగలరని, నవంబర్ నుంచి షూటింగు వుంటుందని దర్శకుడు బాపయ్య చెప్పారు. ఈ చిత్ర నిర్మాణ నిర్వహణ కార్యక్రమాన్ని జరిపే బాధ్యతను వెంచు రామయ్య, సుబ్బారావులు తీసుకున్నారు.

బాపయ్యకు మరో హిందీ చిత్రం

సురేష్ రామానాయుడుగారు బాపయ్యకు "సోగ్గాడు" హిందీ చిత్రాన్ని యిచ్చిన వేళావిశేషము, మరొక పెద్ద నిర్మాత (బొంబాయి) అదే పనిని చెయ్యడానికి నిర్ణయించారు.

'జరుగుతున్న కథ'లో దేవదాసు, సుమిత్ర





'పిడుగుల అనుబంధం' సెట్‌లో లక్ష్మీదీపక్, జయసుధ

"సోగ్గాడు" చిత్రం రష్ చూచిన జితేంద్ర, రేఖ మున్నగువారు బాపయ్యను ఘనంగా అభినందించారు.

తెలుగు చిత్ర సంగీతానికి తీసిపోని విధంగా ఎల్. పి. తమ ప్రతాపాన్ని ప్రదర్శించిన నిజాన్ని యీ విలేఖరి విన్నాడు. (మూడు పాటలు విన్నాను.) బాపయ్యకు భవిష్యత్తు బలేగా వుండగలదు, యిటు తెలుగు... అటు హిందీ రంగాలలో.

బాలోత్సాహం!

కృషితో పెరుగుతున్న బాలసుబ్రమణ్యం "చక్రధారి" చిత్రంలో తను మిస్ అయినందుకు, కొంత బాధపడ్డారు. ఆ చిత్రంలోని పాటలు పాడే అదృష్టం తనకు రానందుకు బాధపడడానికి కారణం కూడా వివరించారు.

"ప్రతి పాట ఒక మణిపూస. కన్నడం, తమిళం పాటలు శ్రోతలను విపరీతంగా ఆకట్టుకున్నాయి. సంగీతం సులక్షణంగా, సుమధురంగా వుంది. అలాంటి మంచి చిత్రంలో పాడాలని కోరడంలో తప్పులేదుగా", అన్నారు బాలు.

"నటసామ్రాట్" నాగేశ్వరరావుగారికి ఎప్పుడు పాడబోతున్నారు అని వేలాది శ్రోతలు వేస్తున్న ప్రశ్నలకు సమాధానం సరిగ్గా చెప్పలేని బాలు యిప్పుడు ఆనందోత్సాహంతో చెపుతున్నారు.

"జగపతి వారి బంగారుబొమ్మలు, ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ వారి కొత్త చిత్రం"లో అక్కినేనిగారికి బాలసుబ్రమణ్యం పాడగలరన్న వార్త బాలున్ని అభిమానించే అందరికీ ఆనందాన్ని యిచ్చేదిగా వుండగలదు.


స్నేహ ధర్మం!

తెలిసిన మంచివాడుగా బాలసుబ్రమణ్యంగారిని అందరూ అభిమానిస్తారు. మంచి గాయకుడుగా సంగీత దర్శకులు అంగీకరిస్తారు. మంచి మిత్రుడుగా స్నేహితులు ప్రేమిస్తారు.


స్నేహితుల కోసం ఏదేని చెయ్యడానికి వెనుకాడని బాలసుబ్రమణ్యం, మంచితనంతో అందరినీ ఆకర్షిస్తూ, తలలో నాల్కగా వుంటున్నారు.

మిత్రుల కోసం బాలు ఒక మంచి పనికి నడుం కట్టారు. శ్రీచరణచిత్ర అనెడి నూతన చిత్రనిర్మాణ సంస్థ ఏర్పడడానికి బాలు ముఖ్యత్వం వహించారు. బాలు ప్రోత్సాహబలంతో, వెలసిన శ్రీ చరణ చిత్రను గంగాధర్, రాజశేఖరరెడ్డి స్థాపించారు.

పెరిగే ప్రతి దశలోనూ శరీరానికి కావాలి
కాల్షియం-శాండోజ్®





స్విట్జర్‌లాండ్‌లోని శాండోజ్ వారిచే రూపొందించబడిన ప్రపంచంలోని అత్యుత్తమమైన కాల్షియం.
కాల్షియం, గర్భంలోని శిశువు ప్రథమ దశలోనే పాప పళ్ళలోనూ, ఎముకలలోనూ చేరు కోవటం మొదలెడుతుంది. పుట్టబోయే శిశువుకు శీఘ్రగతిలో ఎక్కువగా కాల్షియం కావాలి. అందుకే, మీకు మామూలు కన్న రెండు రెట్లు కాల్షియం కావాలి. మీరు తొందర గానే కాల్షియం-శాండోజ్ తీసు కోవటం మొదలెట్టండి.



పాప ఎముకలు, పళ్ళూ పటిష్టత కోసం కాల్షియం లభించేది పాలిచ్చి పెంచే తల్లి ద్వారానే. ఆమెకు మామూలుకన్న మూడు రెట్లు కాల్షియం అవసరం.

పెరిగే పాపకు పటిష్టమైన ఎముకలూ, గట్టి పళ్ళ కోసం కాల్షియం ముఖ్యావసరం. అందుకే, పెద్ద వాళ్ళ కన్న, పాపకు కాల్షియం ఎక్కువగా కావాలి!





కాల్షియం ప్రతి దశలోనూ, ప్రతి వయసులోనూ, శరీరానికి కీలకమైన అవసరం. మరి కాల్షియం-శాండోజ్‌లో, కాల్షియం ఉత్తమోత్తమైన రూపంలో ఉంది. రోజుకు రెండు సార్లు, రెండు లేదా మూడు రుచిగల, రాస్ప్ చెరీ-వాసన గల కాల్షియం-శాండోజ్ బిళ్ళలు, మీకు అవసరమైన కాల్షియం యిస్తాయి. దానితో బాటే విటమిన్ సి, డి మరియు బి₁₂.

శాండోజ్‌ను విశ్వసించండి-ప్రపంచమంతటిలో కాల్షియం తయారీలో అగ్రగాములు.

SANDOZ

కాల్షియం-శాండోజ్®
బిళ్ళలు ప్రతి రోజూ ప్రతి వారికీ

dCA/CS/15 F TEL.

సినిమా...

రొమాంటిక్ రోల్

ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్‌వారి కొత్త చిత్రంలో అక్కినేనిది రొమాంటిక్ రోల్ మాత్రమే గాకుండా, సింపతిటిక్ రోల్ కూడా అని, దర్శకుడు తాతినేని రామారావుగారు చెప్పారు.

"మంచి మనిషి" ఎ. వి. సుబ్బారావుగారు నిర్మిస్తున్న యీ వర్ణచిత్రం నవయుగ ద్వారా విడుదలవుతుంది. అక్టోబర్ 18న యీ చిత్రం తాలుకు మొదటి పాట రికార్డు చెయ్యబడింది.

"చక్రధారి" ఎలా వచ్చింది

లక్ష్మీ ఫిలిం కంబైన్స్ ఈస్ట్‌మన్ కలర్‌లో నిర్మిస్తున్న "చక్రధారి" అక్టోబరు ఆఖరుకు పూర్తయ్యింది. ఈ భక్తి చిత్రాన్ని అక్టోబర్ పదిన మదరాసులో కొందరు చూశారు. (కన్నడం చూచినవాళ్లే) అందరిదీ ఒకే మాట. "అక్కినేని యాజ్ సుపర్బ్, వాణిశ్రీ యాజ్ వెరీగుడ్, సంగీతం మధుర మధురంగా వుంది. ఛాయాగ్రహణం చక్కగా వుంది."

అక్కినేని పోషించిన కొన్ని మరపురాని పాత్రల లిస్టులో "చక్రధారి" ఒకటి అని రూఢిగా చెప్పొచ్చు. జి. కె. వెంకటేష్‌కు యీ చిత్రం అసూహ్యమైన స్థానాన్ని ఆర్జించిపెడుతుంది.



'ముత్యాల పల్లకి'లో రోజారమణి

బంగారు బొమ్మలు

"నటసామ్రాట్" నాగేశ్వరరావుగారు, "గ్లామర్ క్వీన్" మంజుల మధుర మనోహరమైన పాత్రలు పోషిస్తున్న జగపతివారి "బంగారు బొమ్మలు" వర్ణచిత్రం నవంబర్ 15 నుంచి అన్నపూర్ణా స్టుడియోస్‌లో ఆరంభమవుతుంది. ఈ చిత్రానికి ఆచార్య ఆత్రేయ రచన్ను, మహదేవన్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు.

అన్ని రసాలు వున్న కథ

"బంగారు బొమ్మలు" వర్ణచిత్రంలో ప్రేక్షకులు ఆశించే అన్ని రసాలు వున్నాయి. ప్రజలకు కావలసినదేమిటో కథకుడు రాజేంద్రప్రసాద్‌గారికి ఎంత బాగా తెలుసో, చిత్రాన్ని జనరంజకంగా రూపొందించడం ఆయనకు అంత బాగా తెలుసు. అందుకనే జగపతి సంస్థ నిర్మించే చిత్రాన్ని ప్రేక్షకులు ప్రత్యేకమైన ప్రేమతో చూస్తారు.

ప్రతి నెలా పక్షం రోజులు నవంబర్ నుంచి "బంగారు బొమ్మలు" వర్ణచిత్రం సింగారించుకుంటుంది. ఇటీవల ఆంధ్రదేశంలోని పలు ప్రాంతాల అందాలను శ్రీ రాజేంద్రప్రసాద్ (అవుట్‌డోర్ కోసం) చూసివచ్చారు.

"దసరా బుల్లోడు" చిత్రం ద్వారా వుత్తమశ్రేణి దర్శకుడుగా నిరూపించుకున్న రాజేంద్రప్రసాద్ గారు "బంగారు బొమ్మలు" వర్ణచిత్రాన్ని మరొక మధుర కావ్యంగా రూపొందించడంతో విజయం పొందగలరు. ఈ కాస్ట్‌లీ వర్ణచిత్రాన్ని అన్నపూర్ణా ఫిలింస్ విడుదల చేస్తారు.

పి. ఏ. పి. లో సమానబలం

ప్రజలకు నచ్చే చిత్రాలను నిర్మించే మరొక సంస్థ ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ దాదాపు అన్ని చిత్రాలకు ప్రేక్షకాదరణలభించింది. (ఒకటి, రెండుతప్ప.)

అక్టోబరు యిరవై తొమ్మిదిన పి. ఏ. పి. కొత్త చిత్రం (వర్ణ చిత్రం) అన్నపూర్ణా స్టుడియోస్‌లో ప్రారంభం.

ఈ చిత్రానికి తమిళ రచయిత బాలమురుగన్ కథ వ్రాశారు. మాటలకు ఆచార్య ఆత్రేయ, సంగీతానికి చలపతిరావు కర్తలు.


అగ్రద్వయానికి (అక్కినేని... వాణిశ్రీలకు) సమాన బలం వున్న పాత్రలు యీ చిత్రంలో లభించాయి.

'తొలిరేయి గడిచింది'లో జయచిత్ర, మురళీమోహన్



'రాజా'లో శోభన్, జయసుధ





'మనస్సాక్షి'లో కృష్ణ, కొత్తనటి లలిత

"చక్రధారి" చిత్రం విజయవంతం అవడానికి మరొక బలవత్తరమయిన కారణంకూడా వుంది. ముగ్గురు విజేతలున్నారు. అక్కినేని ... వాణిశ్రీ... విక్టరీగార్ల కాంబినేషన్‌లో మంచే జరుగుతుంది.

నిర్మాత ఎస్. అనురాధాదేవిగారికి, సమర్పకురాలు కృష్ణవేణిగారికి, పూర్ణా పిక్చర్స్ వారికి "చక్రధారి" చిత్రం తీపిని తినిపిస్తుంది.

క్లయిమాక్స్ పాట

"చక్రధారి" చిత్రంలో ఆచార్య ఆత్రేయ వ్రాసిన క్లయిమాక్స్ పాట మళ్లీ మళ్లీ వినాలని పిస్తుంది.

"ఎక్కడున్నావు, ప్రభూ" అనెడి ఆ పాటకు అక్కినేని అభినయం అద్భుతం.

సాంఘికాలను చూచి ... చూచి విసుగెత్తిన ప్రేక్షకులకు "చక్రధారి" రిలీఫ్ కాగలదు.

కొత్త చిత్రాల పూజలు

విజయదశమి రోజున ఆర్ట్ ఫిలింస్ వారి "ఊరుమ్మడి బ్రతుకులు" చిత్రానికి సాంగ్ రికార్డింగ్ జరిగింది. చలం కథానాయకుడుగా నటిస్తున్న యీ ప్రయోగాత్మక చిత్రానికి బి. ఎస్. నారాయణ దర్శకుడు.

"అదేరోజున మారుతీ కంబైన్స్ వారి ఆఫీసులో కొత్త చిత్రం తాలుకు పూజ, లోకేశ్వరీ ఆర్ట్ పిక్చర్స్ వారి "అగ్నిజ్వాలలు" చిత్రానికి వారి ఆఫీసులో పూజ, సృజనా వారి కొత్త చిత్రానికి వారి ఆఫీసులో పూజ, శ్రీ లలితా మూవీస్ వారి "ఇదెక్కడి న్యాయం" చిత్రానికి హైద్రాబాద్ సారథీలో పూజ, అన్నపూర్ణా పిక్చర్స్ వారి "ప్రేమలేఖలు" చిత్రానికి పూజ", జరిగింది.

ఇంకా కొత్త ఆఫీసులు కొన్ని అదేరోజున వెలిశాయి. కొందరు సాంగ్ కంపోజింగ్ జరిపారు. మరికొందరు కొత్త చిత్రాలకు నాంది పలికారు.

శోభన్ అగ్నిజ్వాల!

ఉత్తమ చిత్రాలను నిర్మించే సంస్థ లోకేశ్వరీ ఆర్ట్ పిక్చర్స్ అని తొలి ప్రయత్నమే నిరూపించింది. (నవలా చిత్రం నిర్మించారు.)

విలువ గల చిత్రాలను నిర్మించే విశ్వేశ్వరరావు గారి ఆశీర్వాదం, సలహా సహకారం వున్న సంస్థను (లోకేశ్వరీ) ఎ. కె. వి. ప్రసాద్ అధినేత.

ఈ సంస్థ తలపెట్టిన ద్వితీయ చిత్రం "అగ్నిజ్వాల" భారీ వర్ణచిత్రంగా నిర్మింపబడుతోంది.



'అదృష్టవంతురాలు'లో చలం, ప్రభ

హీ-మాన్, అగ్రనటి ప్రధాన జంటగా నటిస్తున్న యీ నవ్యత వున్న వర్ణ చిత్రంలో రామకృష్ణ, సంగీత, సత్యనారాయణ, అల్లు రామలింగయ్య ముఖ్య పాత్రధారులని తెలిసింది.

"అగ్నిజ్వాల" చిత్రానికి గోపీ రచన్ను, చక్రవర్తి సంగీతాన్ని, జి. కె. రాము ఛాయాగ్రహణాన్ని, కృష్ణారావు శిల్పాన్ని నిర్వహిస్తున్నారు. కె. రాధాకృష్ణగారి ఆధ్వర్యంలో జరిగే యీ చిత్రం దర్శకుడు సి. ఎస్. రావుగారికి "హిట్" అయ్యేదిగా వుండగలదు.

ఫిబ్రవరి నుంచి "గడుసు పిల్లోడు"

శ్రీ రామకృష్ణ ఆర్ట్స్ (రామకృష్ణారెడ్డి) తలపెట్టిన "గడుసు పిల్లోడు" వర్ణచిత్రం షూటింగు ఫిబ్రవరి నుంచి ప్రారంభం అవుతుందని, విశ్వసనీయంగా తెలిసింది. ఈ చిత్రానికి వసూళ్ల బాపయ్య దర్శకుడు. ఈ చిత్రానికి బాలమురుగన్ కథ సృష్టించ, ఆచార్య ఆత్రేయ సంభాషణలను సమకూర్చారు. సంగీతానికి మహదేవన్, ఛాయాగ్రహణానికి విన్సెంట్ ఆధిపత్యం వహిస్తున్నారు.

"గడుసు పిల్లోడు" వర్ణచిత్రంలో శోభన్‌బాబు తండ్రిగా, తనయుడుగా రెండు పాత్రలను పోషిస్తున్నారు. (తాసిల్దారుగారి అమ్మాయి తరువాత) శోభన్‌కు భార్యగా, బాబుకు తల్లిగా జమున నటిస్తుంది. బాబుకు జవరాలుగా ఒక హిందీ నటి వుండగలదని తెలుస్తోంది. సహాయ పాత్రలను సత్యనారాయణ, అల్లు రామలింగయ్య పోషించగలరు.

లక్ష్మి ద్వారా "గడుసు పిల్లోడు" విడుదల అవుతాడు.

సినిమా

శ్రీధరను ఆకర్షించిన కథ

విజయదశమి పర్వదినాన అయిదారు చిత్రాల ముహూర్తాలు జరిగాయి. వాటిలో ఒకటి సి. పి. ఆర్. ప్రొడక్షన్స్ వారి చిత్రం.

ప్రసాద్ స్టుడియోలో ఆత్మీయుల నడుమ, నిరాడంబరంగా జరిగిన ఆ చిత్ర ప్రారంభంలో యీ విలేఖరి కూడా పాల్గొన్నాడు.

మొదటి షాటు కథానాయిక "కవిత" మీద చిత్రీకరించారు, దర్శకుడు శ్రీధర్.

చాలాకాలం తరువాత శ్రీధర్‌గారు ఒక తెలుగు చిత్రాన్ని దర్శకుడుగా అంగీకరించారు. ఏదేని ప్రత్యేక కారణం వుంటేనేగాని, ఆయన అంత యీజీగా అంగీకరించరు అని యీ రచయితకు బాగా తెలుసు.

'వాట్ మేడ్ యూ టు డూ దిస్ పిక్చర్ శ్రీధర్ సార్ ?' అని నేను ప్రశ్నించాను.

"ది స్టోరీ ... ది స్టోరీ. వన్ అండ్ ది వోన్లీ స్టోరీ", అన్నారాయన.

'మంచికి మరో పేరు'లో రామారావు, జయమాలిని



అదే కథను తమిళంలో తను తీయనున్నట్టు శ్రీధర్ చెప్పారు.

శ్రీ లక్ష్మి ప్రొడక్షన్స్ అధినేత ఎ. పూర్ణచంద్రరావుగారు తన మిత్రుడు పి. సి. రెడ్డి కోసం యీ కొత్త ప్రయత్నాన్ని తలపెట్టారు. ఆయన ఒక మంచి పని చేశారుకూడా.

పెరిగే స్టార్లను ఎంపిక చెయ్యకుండా, కొత్తవాళ్లను (కొందరు కాస్త అనుభవం ఉన్నవాళ్లు) ఎన్నుకున్నారు.

హీరో పాత్రకు చక్రపాణి, హీరోయిన్ పాత్రకు కవిత, మరో హీరో పాత్రకు రాంబాబు, మరో హీరోయిన్ పాత్రకు భవానీ, మరో రెండు పాత్రలకు విజయరాజా, ప్రసాద్‌బాబుగార్లను ఎంపిక చేశారు. అందరినీ శ్రీధర్‌గారు వుత్తమంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నారు.

సరికొత్త కథావిధానం వున్న సి. పి. ఆర్, ప్రొడక్షన్స్‌కు గణేష్‌పాత్రో సంభాషణలను, మహదేవన్ సంగీతాన్ని, బాలకృష్ణన్ ఛాయను, జి. వి. సుబ్బారావు శిల్పాన్ని నిర్వహిస్తున్నారు.

ప్రతిభకు గుర్తింపు

ప్రతిభ వున్నవాళ్లు, పైకొచ్చేది తథ్యము అని చెప్పడానికి ఎన్నో సంఘటనలు వున్నాయి. ఇప్పుడు ప్రకాశిస్తున్న అందరూ ఒకనాడు మరొకరిచేత పరిచయం చెయ్యబడినవాళ్లే.

కొందరు త్వరగా అదృష్టవంతు లవుతారు. మరి కొందరు ఆలస్యంగా అదృష్టవంతు లవుతారు.

అలా ప్రతిభ వుండి, ఆలస్యంగా అంతస్తును అందుకున్న అనుభవజ్ఞుడే మిస్టర్ శేఖర్.

మారుతీ అధినేత కుమార్‌గారికి శేఖర్ ప్రతిభ మీద ప్రగాఢ నమ్మకం ఏర్పడిన కారణంగా, ఆయన్ను దర్శకుడుగా ఎంపిక చేశారు.

మారుతీ కంబైన్స్ ఈస్ట్‌మన్ కలర్‌లో నిర్మిస్తున్న (శేఖర్ దర్శకత్వంతో) చిత్రంలో వాణిశ్రీ... జయసుధ ప్రధాన పాత్రలను పోషిస్తున్నారు. "రెబల్ స్టార్" కృష్ణంరాజు కథానాయకుడుగా నటించ, జగ్గయ్య, సత్యనారాయణ సహ పాత్రలను ధరిస్తున్నారు.

శేఖర్ సంపద

ఒకటిన్నర దశాబ్దంగా చిత్ర పరిశ్రమలో శేఖర్ సంపాదించినది ఒక్కటుంది. అదే "మంచితనం" అందరినీ ఆకర్షించే మనుష్యులు అరుదుగా వుంటారు, సినిమా రంగంలో. కలుషభరితమైన చిత్ర చదరంగంలో, "మంచివాడు" అని ముద్రించబడడం శేఖర్ వంటి వుత్తముడికే సాధ్యమవుతుంది.

అడగ్గానే అగ్రనటి, వినగానే జయసుధ, చెప్పగానే కృష్ణంరాజు శేఖర్‌ను అభినందించి, ఆనందించారు.

తనకు యింత పెద్ద అవకాశాన్ని యిచ్చిన నిర్మాత కుమార్‌గారికి పత్రికా ముఖంగా శేఖర్ కృతజ్ఞతలు ప్రకటిస్తున్నారు.

శేఖర్‌కు బలాన్ని చేకూర్చడానికి ఆచార్య ఆత్రేయ, స్వామి, చక్రవర్తి ప్రోత్సాహపడుతున్నారు

ఇప్పుడున్న పేర్గాంచిన దర్శకులకు ఏమాత్రం తీసికట్టు కాడు శేఖర్. ఈ నిజాన్ని ప్రేక్షకులు (చిత్రం విడుదలనంతరం) వొప్పుకుంటారు.

తెలుగులో అర్జున్ పండిట్

హృషికేష్ ముఖర్జీ దర్శకత్వంలో హిందీలో విజయదుందుభి మ్రోగించిన "అర్జున్ పండిట్" చిత్రాన్ని దక్షిణదేశ భాషల్లో నిర్మించే హక్కును ఏ. పూర్ణచంద్రరావుగారు (శ్రీ లక్ష్మి ప్రొడక్షన్) కొన్నారు.

డిశంబర్ నుంచి షూటింగ్ ప్రారంభమయ్యే యీ చిత్రానికి తాతినేని రామారావు దర్శకుడు. ఈ చిత్రం శ్రీ సుధా ఫిలింస్ బ్యానరుపై నిర్మింపబడుతుంది.

అనురూపాకు బాబూరావు

రామవిజేత సోదరుల్లో ఒకరైన కె. బాబూరావు అనురూపా వీరయ్యగారు నిర్మించే చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అనురూపా వారి యీ చిత్రం షూటింగ్ జనవరి నుంచి వుంటుంది.

ప్రస్తుతం రామవిజేత నిర్మిస్తున్న "లంబాడోళ్ల రాందాసు" (కలర్) చిత్రం అక్టోబర్ 10 నుంచి జరిగే ఫైనల్ షెడ్యూల్‌తో పూర్తవుతుంది. ఈ చిత్రంలో మొత్తం ఏడు పాట లున్నాయి. అందులో హోలీ పండుగకు సంబంధంచిన పాటొకటుంది. ఈ పాట చిత్రీకరణ కోసం విశాఖ ప్రాంతంలో ఓ వూరునే నిర్మించ సమకట్టారు అన్నదమ్ములు బాబూరావు (దర్శకుడు), ప్రభాకర్ (నిర్మాత). ఖం, అదిలాబాద్ మున్నగు ప్రాంతాల నుంచి దాదాపు 200 మంది కుటుంబాలను యీ హోలీ పాట చిత్రీకరణకోసం పిలిపించడానికి నిర్ణయించారు.

డా. కొర్రపాటి గంగాధరరావు వ్రాసిన యీ నవలా చిత్రానికి పినిసెట్టి మాటలను, రాజేశ్వరరావు సంగీతాన్ని, బాలుమహేంద్ర కెమెరాను సమకూరుస్తున్నారు.

చలం, జగ్గయ్య, ప్రభాకరరెడ్డి, రావు గోపాలరావు, అల్లురామలింగయ్య, మిక్కిలినేని, నరసింహరాజు, రోజారమణి, జయలక్ష్మి, ఝాన్సీ, పండరీబాయి ముఖ్య పాత్రధారులైన యీ చిత్రం లక్ష్మి ద్వారా నవంబర్‌లో విడుదలౌతుంది.

మీకు తెలుసా ?

"స్వర్గం—నరకం, రాధమ్మ పెళ్లి" చిత్రాలను అందించిన శ్రీ లక్ష్మినరసింహా ఫిలింస్ అధినేతలు మావుళ్లయ్య...రామతారకం ... భాస్కరరావుగార్లు యీతూరి హనుమాన్‌ప్రసాద్‌ను దర్శకుడుగా ఎంపిక చేశారు.

ప్రముఖ హాస్యనటుడు అల్లురామలింగయ్యగారికి ఆత్మీయుడు, ఆంతరంగికుడు అయిన హరిహర భాస్కరరావుగారి నిర్వహణలో, కోడూరి కౌసల్యాదేవిగారి నవల "పసుపుతాడు"ను నిర్మాత టి. నరసింహారావు చలనచిత్రంగా రూపొందిస్తూ, దర్శకత్వాన్ని మహిళా దర్శకురాలు విజయనిర్మలకు అప్పగించారు.

ఒకటిన్నర దశాబ్దం తరువాత అక్కినేని చిత్రాన్ని పూర్ణా పిక్చర్స్ వారు (చక్రధారి) విడుదల చేస్తున్నారు. — శ్రీనివాస్

సీరియల్

డాక్టర్ వనిత

గంటి వెంకటరమణ

(గత సంచిక తరువాయి)

యామిని చెప్పిన మాట విని నిర్ఘాంతపోయాడు.

అతను వారం పది రోజుల్లో లండన్ వెళ్లిపోతున్నాడు. ఎంత విసుక్కున్నా, యామినికి ఎన్ని ఆజ్ఞలు జారీ చేసినా అతను వెళ్లిపోతున్నాడంటే ఆమెకు కన్నీళ్ళు ఆగాయి కాదు. రావు ఒక క్షణం చిత్రంగా చూసి 'ఆశ్చర్యం నాకోసం నువ్వు ఏడుస్తావుకూడానా ?' అని అడిగాడు.

'ఆఫ్‌కోర్స్' ఆ మాట యామిని పెదవుల మధ్య ఆపేసింది. క్రింద వున్న అయ్యంగార్ల పిల్లలతో ఆడుకునే కల్పకం యింగ్లీషు మాట్లాడడం నేర్పిందని చెప్పలేదు యామిని. ఆమెకు మాట్లాడడమంటే యిష్టమే అయినా పరీక్ష కోసం, క్వాలిఫికేషన్ కోసం చదివే పట్టుదలా, దీక్షతో కూడిన చదువులంటే అసలు యిష్టంలేదు.

'నేను వెళ్లిపోతున్నాను' రావు అన్నాడు.

'నేనుకూడా వస్తాను' యామిని అంది.

'హుం' రావు నవ్వి 'యిదేం పిల్లకాలువవైపు షికారనుకున్నావా ఏమిటి? నేను ఎఫ్.ఆర్. సి. యస్. చదివేందుకు వెడుతున్నాను. నువ్వూ నా మాట లక్ష్యపెట్టి చదివి వుంటే నిన్ను తప్పకుండా తీసుకు వెళ్లేవాడిని. కానీ నువ్వు... నువ్వు వచ్చేందుకు అర్హతలు పోగొట్టుకున్నావు' అన్నాడు.

యామిని మాట్లాడలేదు.

ఆ తరువాత ఆమె పుట్టింటికీ, అతను లండన్ వెళ్లిపోవడం జరిగింది.

నరహరికి పెళ్లి అయింది. భార్య కాపురానికి కూడా వచ్చింది. ఈ నాలుగేళ్ళల్లో రావు భార్యని పుట్టింటికి పంపలేదు. పుట్టింటికి చేరిన యామినిని శ్రీదేవి చిన్న చూపు చూసేది. ఆమె పట్ల నిర్లక్ష్యంగా ప్రవర్తించేది.

యామిని అన్ని అవస్థలను జీర్ణం చేసుకుంది. భర్త వుత్తరం రాయడు. అతను రాయబోయే వుత్తరానికి ఎదురుచూడడం ఆమె మానదు.

యామిని జరిగిన సంగతులన్నీ తండ్రికి చెప్పింది. ఆయన కాలమే తీర్పు చెబుతుందని తాత్కాలికంగా సరిపెట్టుకున్నాడు.

యామిని కలలు కన్న వుత్తరం వచ్చింది. రావు రాసిన వుత్తరం అది. అది వుత్తరం కాదు కఠిన శాసనం. 'నువ్వు నాకు అవసరం లేదు. అవసరం లేని నీ గురించి చివరి ఆలోచన ఏమిటంటే నేను చేసుకోబోయే ఈ వివాహానికి నువ్వు ప్రతిబంధకం కాకూడదు' ఆమె తన యిష్టాన్ని అంగీకరిస్తూ రావు పెళ్లికి అనుమతి పత్రం రాసి పోస్ట్ చేసింది.

రావు ఫొటో పంపాడు. భార్య ఎలా వుండాలన్నది యామినికి అర్థం కావాలనే వుద్దేశ్యంతోనే అయివుంటుంది.

రావు పక్కన వున్న ఆమె నీలికళ్ళతో, ఎర్రని పెదవులతో, బాబ్డ్ హెయిర్‌తో, తొడలు కనిపించే గౌనులో... యామిని ఆ మనిషిని తదేకంగా చూసి 'నావల్ల కాదు' అనుకుంది.

వనిత పేరు శ్రీదేవి పెట్టింది. ఆ పిల్లను తన పిల్లలతో సరిగా చూసింది...

వనిత గతాన్ని తలుచుకుంది. తాత తన తల్లి జీవితాన్ని కళ్ళకి కట్టినట్టు చెప్పేవాడు. యామిని తన గురించి ఏ దాపరికమూ లేకుండా మనసు విప్పి ఆయనకే చెప్పుకుందన్నమాట.

ఇప్పుడు గోకుల్ అమెరికా వెడతానంటే తాతగారికి ఏ కారణంవల్ల అయిష్టం కలిగిందో కూడా అర్థంకాసాగింది. తాతగారు ఎన్ని చదివినా ఏం లాభం? ఆయన పూర్తిగా విధినీ, కర్మసిద్ధాంతాన్నీ మరిచిపోయారు. 'బుద్ధిః కర్మానుసారణే' అన్న సంగతి ఆయన యీ సమయంలో ఎలా మరిచిపోయారో నిశితంగా ఆలోచిస్తే తనకి అర్థం అవుతుందిగానీ గోకుల్‌కి ఏమవసరం యివన్నీ తర్కించుకునేందుకు ?

గోకుల్ అమెరికా వెళ్ళడం తన యిష్టానిష్టాలతో ముడివేయడం వనితకి నచ్చలేదు. ఆమె గాంధీకి వుత్తరం వ్రాయాలని నిశ్చయించుకుంది. ఆ తరువాత నిద్రలోకి జారిపోయింది.

*　　*　　*

'సూర్యుడు నెత్తిమీదికి వచ్చాక యిప్పుడా మొహం కడుక్కోవడం !' గోకుల్ తువ్వాలుతో జుట్టు తొత్తుకుంటూ వనితని చూసి అన్నాడు.

వనిత తల ఎత్తింది. అతను సూర్యనమస్కారాలు చేస్తున్నాడు.

ఆమెకి ఆశ్చర్యంగా వుంది. ఈ మనిషి యిలాగే అమెరికా వెళ్లినా హిందూ ధర్మాన్ని విస్మరించకుండావుంటే హైందవ జాతికి మేలిమి వజ్రంలా ప్రకాశిస్తాడు అనుకుంది. అతను కాస్సేపు పైకి ఎగ్రబాకే సూర్యభగవానుడివైపు దృష్టిని సారించి మనసారా నమస్కరించి 'యింత ఆలస్యంగా లేస్తే నేను వూరుకునేదిలేదు.' అన్నాడు గంభీరంగా.

వనిత మరోసారి ఆశ్చర్యపోయింది. అతను తీసుకున్న అధికారం యివాళ శ్రవణేంద్రియాలకి కొత్తగా సోకుతోంది. అందులో వున్న ఆత్మీయతా అధికారానికి వనిత క్షణం ముగ్ధురాలైంది. మరుక్షణం ఆమెకి రాత్రి తను చేసుకున్న నిర్ణయం గుర్తుకువచ్చింది. ఆమె నవ్వి 'రోజూ యింత ఆలశ్యంగా లేస్తే నా డ్యూటీ ఎవరు చేస్తారు బావా ! యిన్నాళ్ళకి యింటికి వచ్చాను కనుక విశ్రాంతి తీసుకున్నాను.' అని 'అమ్మా కాఫీ !' అంటూ వంటింట్లోకి వెళ్లింది. యామిని తలారా స్నానంచేసి వంట పనిలో నిమగ్నురాలైపోయింది. ఆమెవైపు రెప్పవేయకుండా చూడసాగింది వనిత. నలభై యేళ్ళయినా లేవామెకు. నల్లని వెంట్రుకలు మోకాళ్ళకి తగులుతున్నాయి. అక్కడ పెద్ద ముడి వేసింది. చిక్కుతీయని తల వెంట్రుకలమీద అక్కడక్కడ కుంకుడుకాయల పిప్పి వుంది. 'కాఫీ అమ్మా !' వనిత పిలుపుకి ఆమె పరధ్యానం వదిలిపోయింది. కాఫీ యిచ్చి పీటవేసి 'కూర్చో' అంది.

వనిత కూర్చునే ఆలోచిస్తోంది. ఈ జీవితంలో యిలాంటి ప్రాణులకి సుఖం ఎలా వుంటుందో ఎలా తెలుస్తుంది. మూడు పంక్తులా వాళ్ళ నొసటను భగవంతుడు వ్రాసిన రాతలేనా యివి ?

వనిత మరోసారి తండ్రిని తలుచుకుంది. ఆమె అతని ఫొటోలు పేపర్లో పడినప్పుడల్లా కత్తిరించి దాచి వుంచుకుంటుంది. అటువంటి పేపర్ కటింగ్సన్నిటినీ ఆల్బమ్‌గా తయారు చేసుకుంది. ఆయన ప్రఖ్యాతిగాంచిన ఐ స్పెషలిస్ట్. ప్రతి ఏడాదీ భారతదేశం వస్తాడు. వచ్చినప్పుడు స్వగ్రామం వెడతాడు. అటువంటి సమయంలో తనూ వెళ్లి ఆయన్ని చూడాలి అనుకుంటుంది. కానీ వెంటనే ఆమెకి తల్లి జ్ఞాపకం వస్తుంది. తల్లిపట్ల ఆయన చేసిన నిరాదరణకి తను అంత తేలికగా క్షమించడానికి వీలులేదు అనుకుంటుంది. తాత్కాలికంగా తండ్రిని చూడాలన్న కోరికను దూరం చేసుకుంది.

కాఫీ తాగుతూంటే శ్రీదేవి వచ్చింది. అప్పటికి యింటిల్లిపాది స్నానాలూ అయిపోయాయి. తాతగారు పూజామందిరంలో గంట వాయిస్తున్నారు. నరహరి బావిలో నీళ్ళు తోడి చెట్లకు పోస్తున్నాడు. బావిలో చేద వేసి లాగినప్పుడల్లా గిలక శబ్దం కిర్రుమంటోంది. నరహరి ఎన్నో ఏళ్ళుగా చెట్లకు నీళ్ళు తనే పోస్తున్నాడు. ఆ పోసేది అతనే అని వనిత గ్రహించింది.

'ఇవాళ సినిమాకు వెడదాం' శ్రీదేవి అంది.

'అమ్మ కూడా వస్తుందటా'

శ్రీదేవి ఆమెవైపు చూసి 'నేను రావద్దన్నానా యిప్పుడు' అంది కొద్దిగా నిష్ఠూరంగా.

'ఛ! నేను కూడా ఆ అర్థంతో అనలేదు. కానీ అమ్మని కూడా తీసుకువెళ్లాలనుంది. అందుకు నీతో చెప్పాను అంతే.'

శ్రీదేవి మాట్లాడలేదు.

ఆమెకు ఎందువల్లనో యామినిని భర్త వదిలేసినందుకు తమతో సరిగా చూడాలంటే యిష్టం వుండదు. భోజనాలూ, నిద్రా, టిఫిన్, కాఫీ యివన్నీ అయేసరికి సాయంత్రం అయింది. దీపక్‌తో

జరిగిన కథ 4 : తల్లి యామినిని చూడ్డానికి ఢిల్లీ నుంచి హైదరాబాద్ వచ్చిన డాక్టర్ వనితకి రైల్లో తారసపడ్డ ఎమ్. కె. గాంధీ తన అందంతో ఆమె హృదయంలో తిష్టవేస్తాడు. తనను ఎంతో ప్రేమగా చూచే మేనమామ భార్య శ్రీదేవి భర్త పరిత్యక్త అయిన తన తల్లిపట్ల నిర్దాక్షిణ్యంగా వుండటం బాధిస్తుంది వనితని. శ్రీదేవి నరహరిల రెండో కొడుకు గోకుల్ ఇంజనీర్. తనను పెళ్లాడమని గోకుల్ అనటంతో గాంధీ గుర్తుకొచ్చి ఎటూ నిర్ణయించుకోలేక పోతుంది వనిత. గతంలో... యామిని కిష్టం లేకపోయినా భగవన్నారాయణరావుతో వివాహం జరిపిస్తాడు తండ్రి వేణుగోపాల్. పాశ్చాత్య నాగరికతపై మోజున్న భర్త కోపతాపాలకి హడలిపోతుంది యామిని. తన మాటే నెగ్గాలనే రావ్ మనస్తత్వానికి ఎదురు తిరగాలనుకుంటుంది యామిని.

సినిమాకి వెళ్ళేందుకు శ్రీదేవి మనసులో ఏమనుకుందో కానీ వనిత తల్లిని బలవంతంగా బయలుదేరదీసి వెళ్ళే సమయానికి ఆమె కూడా సిద్ధం అయింది.

సినిమా ప్రారంభం అయింది. ముందు న్యూస్ రీల్ చూపిస్తున్నారు. డాక్టర్ల కాన్ఫరెన్స్... డాక్టర్ రావు లండన్ నుంచి రావడం బొంబాయి నుంచి బేగంపేట విమానాశ్రయానికి స్వాగతం పలికేందుకు వెళ్ళిన అతి ముఖ్యులూ...ఇవన్నీ రీలు తిరుగుతోంది. వనిత దిగ్భ్రాంతురాలైంది.

యామిని అప్పటికే బయటికి వెళ్ళిపోయింది. తల్లికోసం వనిత హాల్లోంచి వచ్చేసింది. శ్రీదేవి విసుక్కుంటూనే లేచింది. ఆమెకు తల్లీకూతుళ్ళు ఆవిధంగా వెళ్ళిపోవడం ఎందుకు జరిగిందో అర్థంకాలేదు. ఆటో మాట్లాడాక వనిత యామిని వైపు చూసింది. ఎర్రబడిన ఆమె కళ్ళల్లోంచి ఏ క్షణానైనా కన్నీరు మున్నీరుగా. కురవవచ్చు. ఇంటికి చేరుకున్నాక యామిని పని చేసేందుకు నడుం బిగించలేదు. మంచంమీద పడుకుని దుఃఖాన్నాపుకుంటూ శూన్యంలోకి చూస్తూండిపోయింది.

శ్రీదేవికి వనిత జరిగింది చెప్పింది. శ్రీదేవి విచిత్రంగా చూసింది. భర్త వదిలేశాడంటే ఏ సామాన్యుడో అనుకుంది. డాక్టరనీ లండన్‌లో వుంటున్నాడనీ ఆమెకు కొంతవరకూ తెలుసు. కానీ అతనింత అందగాడనీ, పేరు ప్రఖ్యాతులున్నవాడనీ మాత్రం సినిమాలో న్యూస్ రీల్ చూసేవరకూ తెలియదు.

వనిత భయపడ్డట్లు యామిని ఆమెను ఏమీ అనలేదు. కాస్సేపు కూర్చుని అలసట తీరిన తరువాత తన పనిలో తను మునిగిపోయింది.

గోకుల్ లైబ్రరీ నుంచి వచ్చి యింట్లో సినిమాకి వెళ్ళినవాళ్ళంతా వుండిపోవడంతో ఆశ్చర్యంగా వనిత దగ్గరకి వచ్చాడు. వనిత యీజీ ఛెయిర్‌లో పడుకుని ఆలోచిస్తోంది. అతనుకూడా తనకోసం ఓ కుర్చీ తెచ్చుకుని ఆమె పక్కనే వేసుకుని.

'చెప్పు యింట్లో అందరూ వచ్చేశారేం ? సినిమా బాగులేదా ?' అని అడిగాడు.

'సినిమావరకు ఎక్కడ ? న్యూస్ రీల్ చూస్తూనే వచ్చేశాం.'

'ఆదేం ?'

'మా నాన్న వచ్చిన సంగతి చూపిస్తున్నారు. అమ్మ వచ్చేసింది. ఇంక మేమూ వుండలేకపోయాం.'

'ఎప్పుడూ వుండే పేచీకేకదా. ఇవాళ కొత్తదేంకాదు. సినిమా చూడకుండా మధ్యలో వచ్చేశారట. నాన్‌సెన్స్ ! నేను ఒప్పుకోను. ఆయన నిక్షేపరాయుడిలా వున్నాడు. మధ్యలో అత్తయ్యా, నువ్వూ దేనికీ అతనికోసం కలవరించడం.'

'ఏదీ అన్నంత సులభంకాదు బావా అలవాటు చేసుకోవడం. మా అమ్మ అతన్ని ఎంత ద్వేషించిందో అంతకు రెట్టింపు ప్రేమించింది.'

'ఇదే సిద్ధాంతం.'

'ఫరెగ్జాంపుల్. బంతిని కోపంగా విసిరేస్తాం. అది రెట్టించిన వేగంతో మన దగ్గరకే వస్తుంది. మా నాన్న విసిరేసిన బంతి ఆమె...'

'సో ప్రేమ మీ నాన్నకి వుండాలి.'

'కాదు. నేను పరధ్యానంగా అన్నాను. మా అమ్మ విసిరిన బంతి...'

'ఏమిటో నీ ఉపమానం అతుక్కోవడంలేదు.



'వ్యక్తుల్నికాదు మనుషుల్నిబట్టి ఆలోచించు. తెలుస్తుంది.'

'నువ్వు కవితలల్లుతావు. కథలు రాస్తావు. నీ భాష వేరుగా వుంటుంది.'

'పోనీలే దానికేంగానీ నువ్వు అమెరికా వెళ్ళడం నాకు యిష్టమే బావా !'

గోకుల్ ఎగిరి గంతు వేసినంత పనిచేశాడు. 'అయితే నువ్వు యిప్పుడే వెళ్ళి యీ సంగతి తాత గారికి చెప్పు.'

'నేనా'

'ఆఁ... నువ్వు చెబితేనే ఆయన వింటారు. ప్లీజ్ మా వనిత బంగారు తల్లి' గోకుల్ పరవశంతో వనిత మొహాన్ని చేతుల్లోకి తీసుకున్నాడు. వనిత చటుక్కున లేచి విలుచుని తాతగారి గదివైపు నడిచింది.

ఆయన వనిత చెప్పింది పూర్తిగా విని 'నీ యిష్టం నేను కాదనను తల్లీ. నువ్వూ వాడూ క్షేమంగా వుంటే అంతేచాలు...' అని నవ్వారు.

వనిత ఏదో చెప్పబోయింది. ఆయన వినిపించుకునే స్థితిలో లేరు. 'నరహరీ ఓయ్ నరసింహస్వామీ' అని పిలిచారు.

పిలుపు విని నరహరి తండ్రి గదిలోకి వచ్చేశాడు.

'వనితకి గోకుల్ అమెరికా వెళ్ళడం యిష్టమే నట. ఈ విషయం శ్రీరంగకి రాసి పాస్‌పోర్ట్‌లు వీసాలు రెండేసి ఏర్పాటు చేయమను. అయ్యో నా మతి. వాడేం చెబుతాడో అది తెలుసుకుని వనితా గోకుల్ పెళ్లి ఏర్పాట్లు చేయి. మూఢం రాకుండా మూడు ముళ్ళూ వేయించే ఏర్పాట్లు కూడా చేయించు. అన్నీ నిమిషాలమీద జరిగిపోవాలి' ఆయన తను ఖంగారుపడుతూ నరహరిని ఖంగారు పెట్టసాగారు.

నరహరి వనిత వైపు చూశాడు. ఆమె మావయ్యా 'చిన్న మాట' అంది. వేణుగోపాల్‌గారు కలుగజేసుకుని తరువాత చెప్పచ్చులే ముందు చిక్కడపల్లి శాస్త్రులగారింటికి వెళ్లనీయ్' అన్నారు. ఆయన మాట శిలాక్షరాలకన్నా పదునైనవి.

వనిత నిస్సహాయంగా బయటికి వచ్చేసింది. గాంధీకి తను రాయదలుచుకున్న విషయాలన్నిటినీ ఒంటరిగా వున్నప్పుడల్లా పదే పదే తలుచుకునేది. యిప్పుడామెకు అతని గురించి ఆలోచించాలన్నా భయంగా వుంది. గోకుల్ చిన్నగా నవ్వి 'థాంక్స్' అన్నాడు.

శ్రీదేవి పరుగున వచ్చి 'బంగారు తల్లి' అంది వనితని దగ్గరకి తీసుకుని.

ఎప్పుడూ యిక్కడే పెరిగి యిక్కడే తిరిగిన తనపట్ల యింటిల్లిపాదీ చూపుతున్న ఆదరణకి వనిత మనసు కృతజ్ఞతతో నిండిపోయింది. ఆమె కళ్ళల్లో ఆనందభాష్పాలు చోటు చేసుకున్నాయి. 'అత్తా నీకు నేనంటే ఎందు కంత యిది ?' అంది.

శ్రీదేవి కొద్దిగా చిరాకుగా 'నాకేం తెలీదు నువ్వు నాకు కోడలివి కావాలనుకున్నాను అంతే !' అంది. యామిని గదిలోంచి బయటికి వచ్చింది.

శ్రీదేవి ఆమె వైపు ఆప్యాయంగా చూస్తూ 'నీ కూతురికి పెళ్లమ్మా యామినీ ?' అంది.

'పెళ్లా ? పెళ్లికొడుకు ఎవరు ?' అమాయకంగా అడిగింది.

'భలేదానివే. పెళ్లికొడుకంటే ఎక్కడో ఆకాశంలోంచి వూడిపడాలా ఏమిటి గోకుల్ అమ్మా నీకు అల్లుడు ?'

'గోకులా' యామిని అతివేగంగా వచ్చి శ్రీదేవి పాదాలముందు కూర్చుండిపోయింది. ఆమె కాళ్ళమీద చేతులు వుంచి 'వదినా నువ్వు వనితని ఎంత ప్రేమగా చూసినా ఇంత దయతలుస్తావనుకోలేదు. నీ ఋణం ఎన్ని జన్మలకైనా తీర్చుకోగలనా ?' అంది. యామిని ఆ తరువాత మాట్లాడలేదు. శ్రీదేవి అక్కడే కూర్చుని యామినివైపు చూస్తూండి పోయింది. రెండు కాళ్ళమీద చేతులుంచుకుని వాటిమీద గడ్డాన్ని ఆన్చి ఏదో ఆలోచిస్తోంది యామిని. ఆమెకు బహుశా భర్తని చూడాలని వుండివుంటుంది.

పెళ్ళికి ఏర్పాట్లన్నీ జరుగుతున్నాయి. యామినికి క్షణం తీరికలేదు. శ్రీదేవి బజారు

పనులు చేస్తోంది. నరహరి కొడుకుని పిలుస్తున్నాడు కోడలితోసహా రమ్మని. అతను ఆ ప్రయత్నంమీద వున్నాడు. గోకుల్ తనకీ, వనితకీ కావలసిన బట్టలు తీసుకునేందుకు వనితనీ తల్లినీ వెంటబెట్టుకుని తిరుగుతున్నాడు. వేణుగోపాల్‌గారు మంచంమీద కూర్చుని సంబరపడిపోతున్నారు.

యామిని ఆవేళ ఆయన గుమ్మందగ్గర నిలుచుని చాలాకాలం తరువాత తండ్రితో ముఖ్య విషయం మాట్లాడుతోంది. ఆయన శ్రద్ధగా వింటున్నారు. 'పెళ్లి చేయిస్తున్నావు బాగానేవుంది. కన్యాదానం చేసేందుకైనా ఆయన్ని ఒక్కసారి పిలిపించు నాన్నా ! ఈ ముక్తికోసమే చాలామంది తపించిపోతారుకదా !'

ఆయన కూతురివైపు జాలిగా చూశారు. 'నువ్వు పిచ్చిదానివమ్మా ! మద్యం, నీచూ అన్నీ మరిగిన మీ ఆయనకి యిటువంటి నమ్మకా లుంటాయని నేను అనుకోను. అతను చాలా దుర్మార్గుడమ్మా ! కనీసం నువ్వేమయ్యావో నన్న ఆలోచనైనా లేదే. నీ డబ్బుతో ఇంతవాడయ్యాడే ఆ విశ్వాసం అయినా వుందా ? నీ భ్రమ అతను వస్తాడనేది. కాళ్ళు కడిగేందుకు శ్రీరంగ వున్నాడు.' యామిని చీరకొంగుతో కళ్ళు తుడుచుకుంటూ వెళ్లిపోయింది.

వేణుగోపాల్ మనసులో ఆవేదన సెగలూ, పొగలూగా మారి శరీరమంతా వ్యాపించసాగింది.

వనితకి గోకుల్ ఎన్నో విషయాలు తను అమెరికాలో చేయబోయేవి చెబుతున్నాడు. వనిత అతనివైపు చూస్తూ శ్రద్ధగా వింటోంది. అతను ఎవరూ చూడకుండా వనిత రెండు చేతులూ పట్టుకుని 'వనితా ! నా వనితా !' అంటూ గుండెలకి చేర్చుకున్నాడు. వనిత తెల్లబోయింది. ఆమె మొహంలో ప్రోత్సహించే మార్పు ఏదీ రాకపోగా అతను అవమానంతో తల దించుకుని 'ఐయామ్ సారీ వనితా !' అన్నాడు. వనిత ప్రస్తుతం లాంగ్‌లీవ్ పెట్టింది. వనిత చిన్నగా నవ్వి 'నువ్వు మరీ యింత ఆలోచించడంలేదంటే ఆశ్చర్యంగా వుంది. పోన్లే.' అంది.

గోకుల్ క్రమశిక్షణలో పెరిగినవాడే. అతనికి తల్లీ తండ్రీ, మేనత్తా తాతగారు ఎన్నోరకాలుగా మంచి చెడులను గురించి చెప్పారు. అతనికి స్త్రీ పట్ల, వారి సంబంధ బాంధవ్యాలపట్ల ఆలోచన కలిగేదికాదు. వనితతో వివాహం అనగానే అతనిలో అనుకోని కలవరం బయలుదేరింది. నాదే అన్న భావనతో స్వతంత్రం తీసుకోవడం జరిగింది. అంతే...

శ్రీరంగ భార్య మేనకతో వచ్చాడు. మేనక చాలా అందగత్తె. అమెరికానుంచి వచ్చిన మేనక అందంగా జుట్టుని మెడవరకూ కత్తిరించుకుంది. మెడలో మంగళసూత్రం లేదు. సన్నటి గొలుసు మాత్రం వుంది. ఆమె అతి నాజూకుగా వుంది. బరువు ఎక్కువగావున్న బట్టలు వేయలేనట్లు సన్నటి బట్టలు వేసుకుంది

వనిత పెళ్లి సమయం దగ్గరపడింది. యామిని మరోసారి తండ్రి గదిలోకి వెళ్లి అంది. 'నాన్నా ఆ శ్రీరంగ భార్య అంత ఎబ్బెట్టుగా వుంది. మనలా చీరకట్టు కట్టుకుని కన్యాదానం చేయగలదా.'

వేణుగోపాలంగారు నవ్వారు. 'ఏ పిచ్చిగానీ కట్టులో ఏముంది ? అన్నీ సర్దుకుపోవాలి.'

యామిని తల ఎత్తి ఆశ్చర్యంగా చూసింది. సర్దుకుపోవాలి... పేలవంగా నవ్వుకుంది.

పెళ్లి అట్టహాసంగా జరిగింది. శ్రీరంగ తమ్ముడినీ, మరదల్నీ తీసుకుని అమెరికా వెళ్లి పోయాడు. వనిత తల్లివైపు జాలిగా చూసింది ఆఖరి క్షణం వరకూ. అమెరికా వెళ్లి... లండన్ వెళ్లి తండ్రిని కలుసుకుని... తండ్రి జీవితం ఎలా వుందో ఒక్కసారి చూసి... వనిత కోరికలు అవి.

వనిత వినువీధిలో విమానంలో భర్త, బంధువులతో తేలిపోతూ ఎగిరిపోతోంది. ఆమెకి ఒక్కసారి గాంధీ జ్ఞాపకం వచ్చాడు. స్నేహం తాలూకు తీపి గుర్తులు కదిలాయి. ఆమె అరమోడ్పు కనులతో గోకుల్‌ని అనుకుని కూర్చుంది.

[ఇంకా వుంది]

సింథాల్ టాయ్‌లెట్ పౌడర్
తాజాగావుంచే ఒక విశిష్టమైన ఫార్ములా తో

చమట దుర్గంధాన్ని శక్తివంతంగా
అరికడుతుంది...రోజంతా
మీకు పూల తోట వంటి
తాజాదనాన్ని ఇస్తుంది.



సింథాల్-ఇండియాలోని ఒకేఒక చర్మదుర్గంధ నివారిణి టాల్క్

Interpub/CTP/4/76 R TEL.

మన సినిమాలలో తెనుఁగు భాష

— సి.వి. సూర్యనారాయణమూర్తి

మంచి సినిమాను దృశ్యకావ్యంగా వర్ణిస్తుంటాం. అంటే కొన్ని కావ్య లక్షణాలను సంతరించుకున్న సినిమా కావ్యం కంటే అధికమైనదన్నమాట. దృశ్యమైనది కావటమే దీని ఆధిక్యత. అందుకే ప్రజా జీవితం మీద దీని ప్రభావం చాల ప్రబలంగా వుంటుంది.

భాష దృష్ట్యా సినిమా రచనలో రెండు విభాగాలున్నాయి. మొదటిది వచన రచన — పాత్రల సంభాషణల రూపంలో వుండేవి. రెండోది కవిత్వం— అంటే పాటలూ, పద్యాలూను. రెంటిని గురించీ విడివిడిగా పరిశీలిద్దాం.

సంభాషణలు :

సినిమాల కథా విషయాన్నిబట్టి వాటిని పౌరాణిక, జానపద, చారిత్రక, సాంఘికాలుగా నాలుగు రకాలుగా విభజించవచ్చు. సినిమా రాకముందు నాటక రచన చేసిన రచయితలు పురాణ, చారిత్రక పాత్రలకూ, వాటి సంభాషణలకూ, ఒక ఒరవడిని కూర్చడం జరిగింది. ఉదాహరణకు రాముడు, కృష్ణుడు, జానపద, చారిత్రకాలలోని రాజులూ, వగైరా పాత్రలన్నీ తెలుగులోని గ్రాంధిక భాషను మాట్లాడుతాయి. ఆ తరువాత వచ్చిన సినిమాలలోకూడా ఇంచుమించు అదే పద్ధతిలో సంభాషణలు రచించబడుతున్నాయి. పాత్రలన్నీ ఆశుకవిత్వం చెపుతున్న ధోరణిలో మాట్లాడుతూ, పాటలు, పద్యాలు, చదువుతాయి. రసపోషణకి కవిత్వం అత్యంత దోహదకారి కావడంచేత ప్రేక్షకులు యీ కళాస్వరూపాలను (సినిమాలు) ఎబ్బెట్టు లేకుండా ఆనందించగలుగుతున్నారు. ఆ పాత్రలు నిజంగా ఏ భాషలో మాట్లాడేవన్న ప్రశంస రాదు.

ఈ గ్రాంధిక భాష ప్రజల భాషా జ్ఞానంపై ఏదైనా ప్రభావం కలిగివుందా అని ఆలోచిస్తే అది సందేహాస్పదమే. ఎక్కువ భాషా జ్ఞానం లేని ప్రేక్షకుడు ఆ గ్రాంధిక భాషను పుస్తకరూపంగా చదివి అర్థం చేసుకోలేనివాడయినా, సినిమాలో సన్నివేశ చిత్రీకరణ యందలి దర్శకత్వపు ప్రతిభ వలన సినిమాను పూర్తిగా అర్థం చేసుకోగలుగుతాడు. అందుకనే ఆ భాషను గురించి పట్టించుకోవలసిన అవసరం అతని కెంతమాత్రం వుండదు. ఇక ఆ సంభాషణల స్వారస్యాన్ని తన భాషా పాటవంవల్ల ఆస్వాదించగల ప్రేక్షకుడు అంతగా నేర్చుకోవలసినదేదీ అందులో వుండదు. భాషాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని రచయితలు సినిమా సంభాషణలు రాయడం మొదలుపెడితే అవి ఆర్థికంగా అపజయం పొందే ప్రమాదం వుంది. ఉదాహరణకు, ఆమధ్య వచ్చిన 'ఏకవీర' చిత్రం సాహిత్య దృష్ట్యా కళాత్మక విలువలదృష్ట్యా చక్కటి రూపకావ్యమై భాసించింది. కాని, సామాన్య ప్రేక్షకుడి స్థాయిని మించి ఉండటంవల్ల ఆర్థికంగా గొప్ప విజయాన్ని సాధించలేకపోయింది. అయితే, అంతటి స్థాయి సాహిత్యం కలిగి ఉన్న 'సంపూర్ణ రామాయణం' అద్భుత విజయం సాధించింది. ఆ కథతో ప్రజలకు గల సాన్నిహిత్యం, అనుబంధం అందుకు కారణాలు. అందుకే సాహిత్యపు విలువల దృష్ట్యా సినిమాలలో భాషను అంచనా వేయడం అనవసరమనిపిస్తుంది.

ఇక సాంఘిక చిత్రాల విషయానికొస్తే, వాటిలో సామాన్యంగా శిష్ట వ్యావహారిక భాష ఉపయోగించబడుతుంది. (పాత్రల స్వభావాన్నిబట్టి అక్కడక్కడ గ్రామ్యం, ప్రాంతీయమైన 'యాస' వాడినా) ఇది అర్థమయేందుకు ఏ ఇబ్బందీ లేదు. సినిమాలలో వినడంవరకే తప్ప ఎవరూ ఆ భాషను ఉపయోగించే ప్రయత్నం చేయరు. అందుకే మూడు దశాబ్దాల సినిమా ప్రభావం మన ప్రాంతీయ 'యాస' భాషలను ఎంతమాత్రం మార్చలేదు.

మరైతే మన సినిమాల్లో ఉపయోగించే తెలుగు భాష ఏ రకం ప్రయోజనాలు కలిగిఉంది? అటువంటివాటిలో కొన్ని ఉదహరిస్తాను.

వివిధ సందర్భాలలో మన సంభాషణల్లో సినిమా ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. ఉదాహరణకు, ఎవరైనా కొత్తవారిని పరిచయం చేసుకోవడంలోనో, సంతోషాన్నీ విచారాన్నీ వ్యక్తం చేయడంలోనో 'సినిమా టిక్' సంభాషణలు అనుకోకుండా దొర్లుతాయి. మరీ కొన్ని సినిమాలలో సంభాషణలు ఎంత 'స్టీరియో టైప్'గా ఉంటున్నాయంటే, ఒక పాత్ర ఏం పలుకుతుందో చిన్న పిల్లవాడుకూడా చెప్పేయగలుగుతున్నాడు.

హాస్య ప్రపంచం :

సినిమా భాష ప్రభావం ఇతరత్రా ఎలా ఉన్నా ప్రజల మానసికోల్లాసాని కవసరమైన హాస్యరసాన్ని కుమ్మరించడంలో అంతటి సాధనం మరోటి లేదు. ప్రజల్లో హాస్య దృష్టిని పెంపొందించడానికీ, వ్యంగ్య, ద్వంద్వార్థ గర్భితమైన మాటలు అర్థం చేసుకోడానికీ, సినిమా సంభాషణలు దోహదం చేస్తున్నాయి. ఎన్నో ఊతపదాలను 'పాప్యులర్' చేయడం సినిమాల ప్రత్యేకత. ఉదా : డింగరీ, అమ్మ్యామ్మ్యా, గురూ, హలా, వగైరా.


పాటలు :

సినిమా ఏ రకమైనా, పాటల విషయంలో మాత్రం అందమైన పదాల పొందిక, భావ అమరిక, స్వరకూర్పు, ప్రధాన విషయాలు. ప్రజాదరణ పొందిన పాటలవల్ల చక్కటి నుడికారం జవానికి అలవడుతుంది. పాట అర్థమవకపోయినా పాడుకోవడానికి ఆటంకం లేదుగదా! అయితే ఈమధ్య వచ్చే పాటల సాహిత్య స్థాయి దిగజారుతూందన్న వాదు వినవస్తోంది. దీన్నిగురించి ఆఖరున ప్రస్తావిస్తాను.

రచనా దోషాలు, ఉచ్చారణా దోషాలు :

వ్యాకరణరీత్యా చూస్తే సినిమాల్లో వాడే భాషలో అనేక లోపాలుండవచ్చు. యధేచ్ఛగా ఇంగ్లీషు పదాల వాడకం, కొన్ని దుస్సంధులు, పాత్రోచితంకాని పదాలు వాడటం వంటివి అందులో కొన్ని. వీటికితోడు వివిధ భాషలకు చెందిన నటీనటుల ఉచ్చారణా దోషాలు మరికొన్ని. ఇవి అంతగా పట్టించుకోదగ్గవికావు. సన్నివేశానికీ, పాత్రకూ తగిన భాష వాడినంతవరకూ రచయిత లోపం లేనట్లే.

ఈమధ్య సినిమా పాటల్లో సాహిత్య స్థాయి కొంత దిగజారుతోంది. కావాలని కొన్ని రెచ్చగొట్టే పదాలను (మగసిరి, కసి, వంపులు, పొంగులు వగైరా) వాడటం, ఎక్కువగా ద్వంద్వార్థాలను స్ఫురించేటట్లు రాయడం మామూలైంది. ఇవి తొందరగా ప్రజలలో 'పాప్యులర్' అయినా, యువతీ యువకుల బలహీనతలు రెచ్చగొట్టడమే వీటి ప్రయోజనం. సభ్య ప్రపంచం కించపడే ఇటువంటి ప్రయత్నాలు మానేస్తే మన తెలుగు సినీ కవుల భావగరిమ, భాషాపటిమ, తెలుగుతల్లికి కవితా కిరీటాలే. ●




మీ తల్లి ఇచ్చిన సలహాను నమ్మండి
మీ పాప ఏడ్చినపుడు,
మీ అమ్మమ్మ చెప్పినట్లుగానే,
వుడ్‌వార్డ్స్ గ్రైప్ వాటర్
వాడమని చెప్పుతుంది.
100 ఏళ్లుగా మాతృలోకం విశ్వసించినది
IMPORTANT TO MOTHERS
WOODWARD'S CELEBRATED
"GRIPE WATER"
INFANTS' PRESERVATIVE,
FOR THE DISORDERS OF CHILDREN VIZ:
SHAKE THE BOTTLE BEFORE OPENING
Alcohol Content (Dehydrated) 4.96% v/v

క్షయ

(7 వ పేజీ తరువాయి)

ఇతరులు చదవటం కూడదు.

7. రోగి ఇంట్లో 20 ఏళ్ళవాళ్ళందరికీ బి. సి. జి. టీకాలు వేయించాలి.

ఈ సందర్భంలో ఒక విషయం గురించి చెప్పవలసి వుంది బాలెంతలకి పోషక పదార్థాలు లేని కారపుపొడి, చారుతో అన్నం పెట్టడం మంచిదికాదు! బాలింతలకి కూడా వేరయిన ఆహారం ఇవ్వాలి.

దేశంలో క్షయని అరికట్టటానికి ఎన్నో పథకాలు వేశారు. వేస్తున్నారు. ఇంకా వెయ్యాలి. జనంలో ఈ రోగానికి సంబంధించిన విజ్ఞానం పెరగటం అవసరం.



"ఛీ. ఛీ చదువుకున్న ఆడదాన్ని పెళ్లి చేసుకోవడమంత బుద్ధి పొరపాటు మరొకటి లేదు"

"కావచ్చు, నేనూ అనుకుంటున్నాను రాయిని చూసి రత్నమనుకుని మోసపోయానేమోనని."

"అయితే ఏం చేస్తా విప్పుడు?"

"నాకు తోచినట్లు చేస్తాను."

"సరే! నీ యిష్టం వచ్చినప్పుడురా. నీ కా యింట్లో ఎప్పుడూ స్థానముంటుందని మాత్రం మరిచిపోకు. నే నింక రాను వెడుతున్నా"నని రమేష్ గబగబా వెళ్ళిపోయాడు.

అంతవరకూ ధైర్యంగా మాట్లాడిన ఇందిర చేతుల్లో మొహం దాచుకుని ఏడవ సాగింది.

ఇంతలో కాఫీ గ్లాసుతో అన్నపూర్ణమ్మ గారు ప్రవేశించింది. 'ఏడమ్మా అల్లుడూ?' 'వెళ్లిపోయారమ్మా' అని బావురుమంది.

"ఇదేమిటే? కాఫీ అయినా తాగకుండా వెళ్లిపోయాడా? పోనీలే ఏడవకు. ఇంకా బాలెంతరాలవు. పరిస్థితులవే చక్కబడతాయి" అని కూతుర్ని సముదాయించింది.

ఇందిర గతాన్ని తలుచుకుంటూ అలా ఉండిపోయింది.

* * *

లాయరు శ్రీనివాసరావుగార్కి ఇందిర ప్రథమ కుమార్తె. ఆమె తరువాత ఒక అమ్మాయి, అబ్బాయి ఉన్నారు. ఆయన మంచి పలుకుబడి కలవాడు. తొలి సంతానమని ఇందిరను ఎంతో గారాబంగా చూచుకుంటూ దానికి తగ్గ భయ భక్తులతో ఎ మ్మే. చదివించేరు. ఫస్టు క్లాసులో ఎ మ్మే. ప్యాసయిన ఆమెకు తొందరలోనే స్టేట్ బ్యాంక్‌లో ఉద్యోగం వచ్చింది. తల్లి తండ్రులు నీకెందుకమ్మా ఉద్యోగం అంటున్నా వినకుండా సరదాని అణచిపెట్టుకోలేక ఉద్యోగంలో ప్రవేశించింది.

శ్రీనివాసరావుగారి రెండవ అమ్మాయి పద్మ యింటర్ చదువుతోంది. అబ్బాయి పదవతరగతి చదువుతున్నాడు. తమకన్న గొప్ప సంబంధం చేయాలని ఆయన ఇందిరకు సంబంధాలు వెతుకుతున్నారు. ఎవర్ని చూసినా ఇందిరకు నచ్చటంలేదు. ఎవరో మహారాణిపేటలో ఒక అబ్బాయి ఉన్నాడని చెపితే చూసిరావాలని బయల్దేరేరు.

* * *

కె. రాఘవయ్య అన్న బోర్డు చూసి లోపలకు వచ్చేరు శ్రీనివాసరావుగారు. హాల్లో పేపరు చూసుకుంటున్న రాఘవయ్యగారు ఎవరావచ్చేది అని చూస్తున్నారు.

తనే పరిచయం చేసుకున్నారు. "నేను శ్రీనివాసరావును ఎడ్వకేటు. మేము ద్వారకా నగరంలో ఉంటున్నాము. నాకిద్దరమ్మాయిలు ఒక అబ్బాయి ఉన్నారు. పెద్దమ్మాయి ఇందిర. ఎమ్మే ఫస్టు క్లాసులో ప్యాసై స్టేట్‌బ్యాంకులో ప్రొబేషనరీ ఆఫీసరుగా పని చేస్తోంది. ఆమెకీ సంవత్సరము పెళ్ళిచేయాలనుకుంటున్నాము. మీ అబ్బాయి ఉన్నాడని తెలిసింది. ఉన్నఊళ్లోనే అయితే కళ్లముందుంటారని ఇలా వచ్చేను."

ఎంతసేపూ కుమారుని వివాహమే దృష్టిలోఉన్న కామాక్షమ్మ ఈ మాటలు వినగానే తనే స్వయంగా కలిపి కాఫీతో ప్రవేశించింది.

"చూడు కామాక్షీ! ఈయన ఏపనిమీద వచ్చారో విన్నట్లున్నావు. నీవూ. నీ కొడుకు ఆలోచించుకుని జవాబు చెప్పండి" అని తెలివిగా తనకేం సంబంధం లేనట్లు తప్పుకున్నారు రాఘవయ్యగారు.

ఆమె మొహం చూసిన శ్రీనివాసరావుగారు ధైర్యంతో "ఏమంటారమ్మా మీ కేమీలోటు చెయ్యను. నాకు కూడా ఇదే మొదటి కార్యం కనుక పెళ్లి మీ స్తోమతకు తగ్గట్లుగానే చేస్తాను" అన్నారు.

పెద్దకథ ప్రారంభం!

వ్యక్తిత్వం లేని వ్యక్తి

"దానికేముందండి మా కున్న వాడు ఒక్కడే కొడుకు. మా సరదా మాత్రం ఇంకె వరివల్ల తీరుతుంది ? అబ్బాయి చాలా నెమ్మదస్థుడు. మా అబ్బాయని మేం చెప్పు కోవడంకాదు. మా అమ్మాయికి 30 వేలు కట్నమిచ్చి పెళ్ళి చేసేము అబ్బాయికూడ ఇంచుమించు అలాగే తీసుకోవాలనుకుంటు న్నాము." అని అసలు సమస్య పరిష్కారం చేసింది. "ఆడపిల్ల ఒక్కగానొకత్తె, దాని ముద్దు ముచ్చట ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు తీరుతుంది చెప్పండి ? అందుచేత ఆడపడుచు లాంచనాలు అవీ బాగానే ఉండాలి."

"అలాగేనమ్మా కట్నం పాతిక వేలు ఇవ్వగలను. అత్తగార్కి, ఆడపడుచుకు మర్యాద బాగానే జరుపుతాను. ఇంతకీ అబ్బాయిని కనుక్కోవద్దూ ?"

"పరవాలేదు అన్నయ్యగారూ! వాడు మా మాట కెప్పుడు ఎదురు చెప్పడు. మీరేమీ ఆలోచించక్కర్లేదు."

"అయితే చూడటానికెప్పుడు వస్తారు ? బాగారూ! ఎల్లుండి దశమి బుధవారం బాగుంది. మధ్యాహ్నం రెండున్నర దాటేక రండి" అన్నారు లక్కడే ఎదురుగా ఉన్న కేలెండర్ చూసి "ఇంక నేను వెళ్ళివస్తానండి" అని లేచి తృప్తిగా వెళ్ళేరు.

* * *

మంచినీళ్ళిచ్చి "ఏమన్నారు ? చూడటా నికి వస్తామన్నారా ? కుర్రవాణ్ణి చూశారా? ఎలా ఉన్నాడు?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది అన్నపూర్ణమ్మ.

"ముందు కాస్త కాఫీ తీసుకురా. తీరిగ్గా నీకు సమాధానాలు చెప్తాను." కాఫీ తాగుతూ మొదలుపెట్టేరు. "ఆయన ఇదివరకు బిజినెస్ చేసేవారు. బాగా లాభాలు వచ్చేయి. ఒక కొడుకు, ఒక కూతురు. కూతురుకు పెళ్ళి చేసేరు ముప్పైవేలు కట్నమిచ్చి. ఆమె హైదరాబాదులో ఉంటోందిట. అతను డాక్టరట. అబ్బాయిని చూడలేదనుకో. వాళ్ళ మాట వింటాడట. అతను కోరమాండల్‌లో ఒక ఆఫీసరు. పాతికవేలు కట్నమిస్తానన్నాను. అత్తగారికి, ఆడపడుచుకు. మర్యాదలన్నీ ఘనంగా చేయాలట, ఎల్లుండి వస్తున్నారు చూడటానికి" అన్నాడు.

"ఇంతకీ ఆస్తిపాస్తుల సంగతేమిటి ?"

"ఈ ఊళ్ళోనే రెండిళ్ళున్నాయి. భూములున్నాయి, మన మీద పైచెయ్యే."

"నా కప్పుడే పెళ్ళేమిటమ్మా ?" అని విసిగింది ఇందిర.

"చాల్లే పాతికేళ్ళు వస్తున్నాయి." అంది తల్లి.

* * *

కాళ్ళు కడుక్కొని భోజనానికి కూర్చున్న కొడుకుతో ఎలా మాట్లాడాలి? ఏం చెపితే ఏం విరుచుకు పడతాడో ఎల్లాగరా భగవంతుడా అని దండం పెట్టుకుంది. ఉన్న విషయాల్లో ఎంత నెమ్మదో, పెళ్ళి పేరు చెపితే అంత కోపం. ఎంత ప్రయత్నించినా ఆమెకు మాట రావటంలేదు.

'బాబూ !'

'ఏమ్మా ?'

'అహ ఏంలేదూ...'

"ఏమిటమ్మా నీ సందేహం ఏదో అడగా లనుకుంటున్నావు ?"

"అదే నీ పెళ్ళిసంగతి ఏమాలోచించేవు ? నట్టింట మహాలక్ష్మిలా కోడలు తిరుగు తుంటే చూసుకొనే అదృష్టంలేదామాకు?"

"అబ్బబ్బ! ఎప్పుడూ నా పెళ్ళితప్ప రెండోధ్యాసేలేదానీకు. నలభై ఏళ్ళు వస్తున్న ఆడపిల్లలే ఉండగా లేనిది ముప్పయ్యేళ్ళయినా నిండని నాగురించి అంత తొందరెందుకు ?" అని కసురుకున్నాడు.


"సరేలే నాయనా ఒక కన్ను కన్నుకాదు ఒక కొడుకు కొడుకుకాదు అని ఊరికే అన్నారా ? నీయిష్టం వచ్చినప్పుడు చేసుకో ఒక్క ఆడదాన్ని ఇంట్లో వున్నాను. ముచ్చటగా కోడలితోను, మనుమలతోను గడిపే అదృష్టం లేదనుకుంటా. పోనీ శాంతయినా వచ్చి పదిరోజులుంటుందేమో అంటే అల్లుడంటకన్న తిక్కశంకరయ్య నాల్గురోజుల్లోనే ఏదో మునిగిపోయినట్లు తీసికెళ్ళి పోతాడు. ఏంచేస్తాం ? నాకాయన, ఆయనకునేనూ. ఏ సరదా తీరకుండా ఇలానే హరీమంటాం" అంటూ రాగాలు తీసింది.

ఆమె కన్నీళ్ళకు కరిగిపోయిన రమేష్ "అమ్మా ! మీ యిష్టం వచ్చిన సంబంధం చూడండి" అంటూ చెయ్యి కడుక్కొని వెళ్ళిపోయాడు. అతని వెనుకే గదిలోకి వెళ్ళి "అబ్బాయి ! ద్వారకా నగరంలో శ్రీనివాస రావుగారట లాయరు. వారి పెద్దమ్మాయికి పెళ్ళి చేయాలనుకుంటున్నారుట. పాతికవేలు కట్నం ఇస్తాను. మీకు తగ్గట్లుగా పెళ్ళి చేస్తాను. బుధవారం రండి చూడటానికి అని చెప్పి వెళ్ళారు." అంది.

అంతా సిద్ధం చేసుకొనే నాతో చెప్పిందన్నమాట అనుకున్నాడు.

"అమ్మా కట్నం తీసుకోవద్దు."

"అదేమిటి కట్నం లేకుండా పెళ్ళి చేసు కుంటే నలుగురూ నవ్వుతారు. వాళ్ళని ముక్కుపిండి వసూలు చేయడం లేదుగా. వాళ్ళిస్తామన్నప్పుడు తీసుకోవడానికేం. మాకు సరదా మాత్రం ఎలా తీరుతుంది?" కాదన లేక పోయాడు రమేష్.



వ్యక్తిత్వం లేని వ్యక్తి

పెళ్ళిచూపుల తంతు బాగానే ముగిసింది: ముందు కొంచెం బెట్టు చేసినా పిల్లనుకూడ గానే ముఖం విప్పారిందతనికి. చదువు, అందము ఉంది. బుద్ధిమంతురాలిలాగే కన్పిస్తోంది. ఎందుకింకా ఆలోచించడం. అనవసరంగా పెద్దవాళ్ళను బాధ పెట్టకూడదనుకున్నాడు. వాళ్ళడగ్గానే సరేనని ఒప్పుకున్నాడు. అదనుచూసి కొడుకు మూడ్ చెదిరిపోకుండా ముహూర్తం కూడా పెట్టించేసింది కామాక్షమ్మ.

ఇన్నాళ్ళకి అందరికి నచ్చిన సంబంధం వచ్చింది. కూతురు ముఖంలో కనిపించిన సంతృప్తికి ఆనందపడ్డారు తల్లిదండ్రులు. ఇందిర ఇంకా అతని మాటలనే నెమరవేసుకుంటోంది. ఎంత చక్కగా చెప్పేడు తనకి కట్నం తీసుకోవటం ఇష్టం లేదుట. పెద్దవాళ్ళను నిరాశ పరచడం ఇష్టంలేక ఒప్పుకున్నాడట. ఆడపిల్లగల వాళ్ళని పీల్చి పిప్పి చేయకుండా వాళ్ళకు కలిగినది ఇస్తే లీసుకోవటం తప్పుకాదుట. తను మాత్రం ఏం చెప్పింది తండ్రికి కట్నంవద్దు అన్న కుర్రాణ్ణే నేను చేసుకోను.ఇచ్చినది తీసుకుని-పేచీపెట్టని వాళ్ళయితేనే చేసుకుంటాను. తన స్నేహితురాలు సుగుణకి నిరుడీ రోజుల్లోనే పెళ్ళయ్యింది. కట్నం వద్దు నాకు పిల్లే ప్రధానం అని చేసుకున్నారు. ఇప్పుడు కట్నం లేకుండా నేను గొబట్టి చేసుకున్నాను. లేకపోతే నీమొహానికి ఎవరొస్తారు అని నిముష నిముషానికి అంపపుకోత కోస్తున్నారు ఆదర్శం పేరుతో ఆమెను నరక యాతన పెట్టి బానిస పిల్లలాగా చూస్తున్నారు. దానితో కట్నం వద్దు అన్న వాళ్ల సంబంధం చేసుకోకూడదనుకుంది.

* * *

బీచ్‌లో కూర్చున్న రమేష్‌ని మూర్తి కలిసేడు.

"హల్లో మూర్తి ఏం కనిపించడం మానేశావ్ ?"

"నీవేదో ఊహాలోకంలో ఉన్నావు. పైగా నన్ను కనిపించడం లేదంటున్నావు. మొన్ననే కదయ్యా మన మిరువురం జగదాంబ (థియేటర్) దర్శనం చేసుకున్నాము."

"ఔను. మరిచిపోయాను. సరే నీ కొక శుభవార్త చెప్పాలి."

"అబ్బ! చాల తొందరగా చెపుతున్నావు. అదంతా నాకు తెలుసు కాని, ముహూర్తం ఎప్పుడో చెప్పు." అన్నాడు నవ్వుతూ.

"మార్చి రెండు: కానీ నీకెలా తెలుసు ?" ఆశ్చర్యంగా ప్రశ్నించేడు ?

"అదే స్నేహంలో ఉన్న మహత్యం. నువ్వింకా చెప్పాలనుకున్నావు అది వెంటనే నాకు తెలిసిపోయింది ఇంతకీ ఎట్లా ఉంటుంది మా చెల్లెమ్మ ?"

"బాగానే ఉంటుంది ఎమ్మే ప్యాసై స్టేట్‌బ్యాంకులో ప్రొబేషనరీ ఫీసరుగా ఉంది. కానీ' మావాళ్ల కోసం కట్నం తీసుకోవలసి వస్తోంది. ఆమె కూడ ఊరికే చేసుకుంటానన్నఅబ్బాయినాకువద్దు అంటోందిట"

"భలే విచిత్రంగా ఉంది. అంతా కట్నం ఇవ్వము అంటుంటే ఆవిడ ఇస్తాననడం: అయితే ఇంకా జాబ్ చేయనిస్తావా ?"

"ఆమె యిష్టం" అంటూ లేచేడు. ఇంటికి వస్తూ ఆలోచించ సాగేడు. పెళ్ళి కుదిరినప్పటినుండి అయ్యే వరకు రోజులు లెక్కపెట్టుకుంటున్నట్లు, ఎంతో ఆరాట పడుతున్నట్లు, ఎన్నో రకాలుగా వ్రాస్తారు. కానీ నాలో అలాంటి వేమీ లేవే. అంతందమయిన అమ్మాయి నాలో ఏం సంచలనం కలిగించలేదేమిటి? అంటే ఆమెను హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నానా? అనుకుంటూ గుమ్మంలోకి వచ్చి లోపల కూర్చున్న పరంధామయ్యను చూసేసరికి తన ఆలోచనలకి అడ్డుకట్ట పడింది. అతను రమేష్‌కి మేనమామ. శకునికి మారుపేరు పరంధామయ్య. అగ్గిపుల్ల లేకుండానే పతిచోట మంట పెట్టగలడు. ఎన్నో సంసారాలు విచ్ఛిన్నమైపోవడానికి, మనుషుల్లో వున్న మానవత్వం నశింపజేయడానికి అతనిలాంటి వాళ్లే కారణం.

పరంధామయ్యకు శారద అని ఒక కుమార్తె ఉంది. ఆమెను ఇదివరలో రమేష్‌కి చేసుకోమని అడిగితే వద్దన్నాడు. దానితో గుమ్మం ఎక్కడం మానేశాడు. మళ్లీ ఇప్పుడెందుకొచ్చేడో అనుకున్నాడు రమేష్. పెళ్ళి దగ్గర పడటంతో ఎవరి పనులలో వాళ్లున్నారు. అయన పాచిక పారలేదు.

* * *

"పందిట్లో పెళ్లగుచున్నాది,
కను విందగుచున్నాది"

అంటున్నారు బ్యాండు వాళ్లు, బ్రాహ్మణుల మంత్రోచ్చారణలలోను. వధూవరులు

చేసుకున్న వాగ్దానాలతోను పెళ్ళి తంతు పూర్తయింది. చదివింపు లవుతున్నాయి. ఇంతలో ఎవరో ఊదేరు. శాంత మొగుడు అలిగేడు వెళ్ళిపోతున్నాడని. కామాక్షమ్మ ముక్కుచీదుతూ పరుగుతీసింది విడిదిలోకి.

"అత్తగారూ! నేను వెళ్ళిపోతున్నాను. మీ హడావుడి అయ్యాక పంపించండి శాంతను." అన్నాడు బేగ్‌లో బట్టలు సర్దుకుంటూ.

"ఏమిటి నాయనా ఏమైంది?" ఆదుర్దాగా అడిగింది.

"ఏంలేదు నాకుండాలనిలేదు. పెళ్లయి పోయిందిగా. ఇంకెందుకు?" ఏదో అనబో తున్న తల్లిని శాంత వచ్చి వారించింది.

"అమ్మా! ఆయనకు మీరిచ్చిన నూట పదహార్లు చాలలేదట ఇప్పుడు టెరీకాటన్ ప్యాంటు, షర్టు పెడితే ఉంటారట" అంది.

"దానికేం నాయనా అలాగే ఇస్తారు. ఈమాత్రం దానికి మనలో మనం గలాభా పడ్డమేమిటి" అంటూ అపుచేసింది.

తరువాత అసలు విషయం తెలిసింది. అసలేం జరిగిందంటే విడిదిలో శాంత పిల్లను పడుక్కోపెట్టటానికి వచ్చింది. అక్కడ ఆమె భర్త సురేష్, మూర్తి, ఇంకా రమేష్ స్నేహితులు కలిసి పేకాడు కుంటున్నారు. కట్నాలు, పెళ్ళిళ్ళు, చదువులు అన్నీ చెప్పు కుంటూ మాటల్లోనికి ఇందిరను కూడ దొర్లించేరు. చదువు, అందము ఉన్న ఇందిర మీద సురేష్‌కి ఈర్ష్య కలిగింది. వాళ్ళు చక్కని సంబంధాన్ని ఏరుకున్నారు. సెకండ్ ఫారం చదివిన శాంతను నాకంటగట్టారు. డబ్బు చూసి మావాళ్ళు ఒప్పుకున్నారు. నాకిప్పుడు టెరీకాటన్ ప్యాంటు, షర్టు పెడితే ఉంటాను, లేకపోతే వెళ్ళిపోతానని అల్లుడి బెట్టు చూపిస్తూ అర్థంలేని పేచీ పెట్టాడా డాక్టరు.

పెళ్ళివారికి అమర్యాదేమీ జరగకుండా సక్రమంగా అన్నీ నెరవేర్చారు శ్రీనివాసరావు దంపతులు. అత్తగారికి అడపడుచుకు కూడ వెయ్యినూటపదహార్లిచ్చేరు. పద్మ చలాకీ అల్లరితోను, చిలిపి మాటలతోను బావగార్ని ఒక ఆట ఆడించింది.

* * *

కుడి కాలుతో పసుపు కుంకుమలతో ఆ యింట్లో అడుగు పెట్టింది ఇందిర. రెండే ళ్లలోనే పరిస్థితంతా అర్థం చేసుకుంది.

వ్యక్తిత్వం లేని వ్యక్తి

యంత్రాల్లా, చివరి పనులు వాళ్ళవే. మమ తానురాగాలు తక్కువ. అహంభావా లెక్కువ.

"ఇందిరా నీవు వుద్యోగం చేయడానికి వీల్లేదు" అత్తగారి ఆజ్ఞ.

"అమ్మాయి నీవు మగవాళ్ళతో కలిసి అలా మాట్లాడ కూడదు. గౌరవమైన ఇంటి ఆడవాళ్ళ లక్షణం కాదు" మామగారి ఆంక్ష.

"ఇందిరా నీ ఇష్టం తోస్తే అలా చెయ్యి. నేనేం చెప్పను? ఇటు ఉద్యోగంమీద నీకున్న సరదాని అణచలేను. అటు పెద్దవాళ్ల వెది రించలేను" భర్త అసమర్థత.

ఆమెకు ఇల్లొక రణరంగంలా వుంది. ఏం చేయడానికి తోచలేదు, ముందు ఇష్టపడిన వాళ్ళు ఇప్పుడు ఉద్యోగం మానేయమనడ మేమిటో ఆమెకు అర్థం కావటం లేదు. ఎట్లాగయినా ఒకసారి మూర్తిగారిని కలుసు కోవాలి. అనుకుంది. తను వచ్చిన కొత్తలో అతనితో పరిచయం అయింది. అతను మంచి మంచి సలహా లిస్తూంటాడు.

ఆరోజు భర్త ఇంటికి వస్తూనే "ఇందూ ఎవరో వచ్చారు చూడు" అని పిలిచేడు. అతనితో వున్న ఇంకో వ్యక్తిని చూసి గ్రీంకు కలిపి తెచ్చింది వారిద్దరికీ. అతను ఇందిరకు నమస్కరించేడు. ఆమె ప్రతి నమస్కారం చేసింది.

"ఇతను నా బెస్టు ఫ్రెండు మూర్తి అని"

"ఈమె నా మిసెస్ నీకు తెలుసుగా" అని పరస్పరం పరిచయం చేసాడు రమేష్.

'అందగత్తె, చదువుకున్నది, మమత కలిసి అన్ని సలక్షణాలు కలిగిన యువతినే ఎన్నుకున్నాడు రమేష్ అదృష్టవంతుడు' అనుకున్నాడు మూర్తి.

అతనిని చూడగానే 'మంచివాడు' అన్న భావం కలిగింది ఆమెకు. అప్పుడప్పుడు రమేష్‌తో వస్తూండడంవల్ల అందరికీ అత వంటే చనువేర్పడింది. రాను రాను మూర్తి ఆ యింట్లో ఒక వ్యక్తిగా కలిసిపోయాడు.

"ఏమిటే నీ పొగరు చెప్తుంటే వినిపించ టలేదా? కలిగినింటి దానవు నీకెందుకమ్మ ఉద్యోగం పట్టుకు ప్రేలాడడానికి? ఇంట్లో ఒక్కదాన్ని ఉన్నాను, కాస్త తోడుగా ఉండి ఏదైనా సహాయం చేద్దామని లేదా?" అత్త గారి దులపరింపుతో ఈ లోకంలోకి వచ్చింది.

"ఏమిటి మీరేం పని చేయాలి? నేను మీకు సహాయం చెయ్యడానికి. వంటమనిషుంది, పని మనుషులున్నారు. ఇంట్లో కూర్చుని ఏం చెయ్యాలి? అంతా ఉద్యోగాల కోసం ఏగపడుతుంటే ఉన్న ఉద్యోగం మానుకో మంటారేమిటి?" అని మొదటిసారిగా కొంచెం ఘాటుగా చెప్పింది సమాధానం.

"సర్లే నిన్నని ప్రయోజనం ఏమిటి? వంశం, సాంప్రదాయం చూడకుండా కళ్ళు మూసుకుపోయి చేసుకున్నాం. ఆడపిల్లను ఉంచవలసిన హద్దులో ఉంచడం చేతకాక పోయాక కనడం దేనికి?" అంటూ వియ్యాల వారిని స్తోత్రం మొదలు పెట్టింది.

"ఏమిటే తెల్లవారకుండా మొదలు పెట్టేవు. నిత్యం గొడవదేనికి? అమ్మాయి సంగతి నేను చూస్తాను నువ్వు కాస్త నోరు మూసుకో" అంటున్న మామగార్ని చూసి ఊసడించుకుంది. భార్య మాటలకు మద్దతిస్తూ ఆడంగిలా కబుర్లు చెప్పడం ఆమెకి ఇష్టం ఉండదు. వీళ్ళందరి అనుమానానికి భయపడటం దేనికి? నాభర్త నన్ను నమ్ము తున్నప్పుడు అనుకుని గోళ్ళు తొడుక్కుని డ్యూటికి బయల్దేరింది.

* * *

"ఏమిటో నాకంతా అయోమయంగా ఉంది మూర్తిగారూ! ఇంట్లో పరిస్థితి చూస్తున్నారుగా. అన్నింటికీ మీ స్నేహితుడు మన్నుతిన్న పాములా నోరు మూసుకునే ఉంటారు" అంది సాయంత్రం బ్యాంకు పనిమీద వెళ్ళిన మూర్తితో.

"చూడండి ఇందిరా! కాస్త ఓర్పు చూపించండి. పెద్దవాళ్ళు చాదస్తంగా అన్నారని వదిలెయ్యండి సీరియస్‌గా తీసుకో కండి. రమేష్ అంటారా అతను స్వతహాగా మితభాషి గట్టిగా మాట్లాడలేడు. అతని స్వభావం అంతే."

"ఏమిటో అడుగడుగునా మీ ధైర్యమే లేకపోతే ఎలా ఉండేదాన్నో అన్పిస్తుంది."

ఇదివరకు ఒకసారి, "మూర్తిగారూ! అమ్మాయిని ఉద్యోగం మానేయమంటున్నాం. వినటంలేదు మీరయినా చెప్పిచూడండి అన్నారు" రాఘవయ్యగారు.

"ఇంటిగుట్టు లంకకిచేటు అని మీ ఇంటి విషయాలు మీరు చూసుకోవాలి కాని నాలాటి వాళ్ళు మధ్యలో రాకూడదండి. ఇలాగంటు న్నానని ఏమీ అనుకోకండి" అన్నాడు మూర్తి.

అది ఇప్పుడు గుర్తుకొచ్చింది. "ఇందిరా మీరు కొన్నాళ్ళు శలవుపెట్టి ఇంట్లో మానేశానని చెప్పండి పరిస్థితి ఎలా ఉంటుందో?" అన్నాడు ఆలోచనగా.

ఇందిర తెల్లబోయింది. "మీరూ అలాగే అంటున్నారా? నేను ఉద్యోగమే మానేస్తే అసలు బ్రతకనివ్వరు: ఏంచేసినా వీళ్లచేతిలోనే ఉంటానని. అనవసరంగా లీవు పాడుచేసు కోవడం. నా భవిష్యత్తు ఎటూ కాకుండా పోతుంది. అందుకే మానాన్నని కట్నం వద్దన్న పెళ్ళికొడుకుని నేను చేసుకోను అని చెప్పాను. కట్నం తీసుకున్నా వీళ్ళ ప్రవర్తన ఇలాగే ఉంది. ఇంక బ్యాంకు క్లోజ్‌చేసే స్తారు. వెళ్ళిపోవాలి ఆలస్యమయితే ఇంట్లో లంకాదహనమయి పోతుంది" అంది ఇందిర వాచీ చూసుకుని,

(ఇంకా ఉంది)

కట్నం వద్దన్న యింజనీర్

అతని వయుస్సు 27 సంవత్సరాలు. ఇంజనీరింగులో అతను పట్టభద్రుడు. దీనికి తోడు మంచి జీతంపై మద్రాసు లోని ఒక ప్రఖ్యాత సంస్థలో ఉద్యోగం కూడా వుంది.

ఇన్ని అర్హతలు, హంగులు వున్న యువకుడు కోరుకుంటే లక్ష రూపా యల కట్నం సులువుగా లభిస్తుంది. అంత కట్నం ఇస్తామంటూ అనేకులు అతని వెంట బడ్డారు కూడా. ఆదర్శా లలో దృఢ విశ్వాసం గల ఈ యువకుని పేరు ఎస్. ఎమ్. కుమార్. కట్నం పుచ్చుకొనడం ఒక దురాచారమని అతని ప్రగాఢ విశ్వాసం. ఆ నమ్మకం ప్రకా రమే అతను నడుచుకున్నాడు. తనకు నచ్చిన యువతిని కానీ కట్నం లేకుండా ఇటీవలే అతను పెళ్ళి చేసుకున్నాడు. వధువు పేరు భానుమతి.

మద్రాసు యూత్ అసోసియేషన్, క్షేత్రప్రచార విభాగంవారు ఇటీవల జరిగిన ఒక చర్చాగోష్ఠి సందర్భంగా ఆదర్శ ప్రాయంగా వ్యవహరించినందుకు ఈయనకు మద్రాసు గవర్నరు ఒక మెమొంటోను బహూకరించారు.

బస్సుల్లో గొడుగులు వేసుకోడానికి విజ్ఞప్తి!

హైదరాబాదు సిటీ బస్సులలో ప్రయాణించే వారు వర్షాల వల్ల బస్సులో వున్నప్పటికీ తడిసి ముద్దయిపోతున్నారనీ, యిలా జరగడానికి కేవలం బస్సుల టాపులు చిల్లులు పడిపోవటమేననీ, గనుక కనీసం బస్సులలో గొడుగులు వేసుకునే సౌకర్యాన్నియినా కలుగజేయాలని ఒక పత్రికా ప్రతినిధుల సమావేశంలో ఓ విలేఖరి ఆర్. టి. సి. జనరల్ మేనేజరుకు సూచించారట.

కృష్ణమీనన్ వస్తువుల వేలం

స్వర్గీయ క్రిష్ణమీనన్ వీలునామా ప్రకారం ఆయన వస్తువులన్నీ వేలం వేస్తే బోలెడ్డబ్బొచ్చిందట. దంతపు పిడి వున్న చేతికర్ర 22 వేలు పలికిందట. మామూలు చేతి కర్రలొక్కొక్కటీ ఎనిమిది వందలు పలికాయట. ఇదంతా దేశసేవకు సంబంధించిన కార్యకలాపాలకు ఖర్చు చేయాలని ఆయన 'వీలునామా' అన్నదట. ★

వారఫలం


5-11-1976 శుక్రవారం మొదలు
11-11-1976 గురువారం వరకు

మేషం: వృత్తి వ్యాపారాలు బాగుంటాయి. పోటీవారితో గౌరవం లభిస్తుంది. మీ ఆలోచనలు ఫలిస్తాయి. ప్రయోజనం గల సంభాషణలను జరుపగలరు. ప్రయాణాలు ఫలిస్తాయి. మిత్రులకు సహాయం చేస్తారు. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. విలాస వస్తువులు కొంటారు.

వృషభం: వృత్తిలో యెవరినీ విశేషంగా నమ్మడం తగదు. ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది. వారం మధ్యలో ఉద్యోగంలో గౌరవం బాగుంటుంది. వ్యాపారంలో ఆదాయం పెరుగుతుంది. నూతన వ్యవహారాలు బాగుంటాయి. స్త్రీలకు: ఆరోగ్యం బాగుండదు. శుభకార్యాల విషయంలో అనుకూలత లభిస్తుంది.

మిథునం:— మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. సాహసిక వ్యవహారాలు బాగుంటాయి. వారం మధ్యలో వ్యతిరేకమైన వార్తలను వింటారు. విలువైన వస్తువులు పోవచ్చును. వారం ఆఖరులో అన్ని వ్యవహారాలు తిరిగి బాగుంటాయి. స్త్రీలకు— కుటుంబ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. వినోదకాలక్షేపాల్లో పాల్గొంటారు.

కర్కాటకం:— స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. సజ్జన సాంగత్యం లభిస్తుంది. వ్యాపారంలో ఆదాయం బాగుంటుంది. విద్యా వైజ్ఞానిక రంగాల్లో



ఖ్యాతి లభిస్తుంది. వారం ఆఖరులో చేజిక్కిన అవకాశాలు కూడా జారిపోవచ్చును. స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. అధిక వ్యయం జరుగుతుంది.

సింహం — అనుకూలమైన వార్తలను వింటారు రావలసిన డబ్బు అందుతుంది. ప్రయోజనంగల పరిచయాలు యేర్పడతాయి. ఉద్యోగంలో గౌరవం బాగుంటుంది. సాహసిక వ్యవహారాలు లాభిస్తాయి. స్త్రీలకు— పుణ్య కార్యాలు చేస్తారు. సాహిత్యకళా రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

కన్య:— మీ ప్రయత్నాలకు ఆటంకాలు వస్తాయి. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది.



వారం మధ్యలో ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. ప్రయాణం ద్వారా కార్యసాధన చేయగలరు. స్త్రీలకు: ఆరోగ్యం బాగుండదు. సంతోషకరమైన సమాచారం అందుతుంది.

తుల:— మీ ఆలోచనలు ఫలిస్తాయి వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కలుసుకొంటారు. వారం మధ్యలో అనవసరమైన వ్యయం చేస్తారు. సాహసిక వ్యవహారాల్లో నష్టం వస్తుంది. వారం ఆఖరులో మీ కార్యక్రమాలు బాగుంటాయి. స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. బంధువుల చికాకులు యేర్పడతాయి.

వృశ్చికం:— మీ కార్యక్రమాలకు మార్పులు వస్తాయి. వ్యాపారంలో పోటీవారి పోటీ పెరుగుతుంది. రావలసిన డబ్బు అందుతుంది. ప్రయోజనం గల సంభాషణలను జరుపగలరు.. వారం ఆఖరులో శ్రమకు గురికాగలరు. స్త్రీలకు: ఆరోగ్యం బాగుంటుంది. ప్రయాణాలు వాయిదాపడతాయి.

ధనుస్సు:— వ్యాపారంలో ఆదాయం బాగుంటుంది. మిత్రుల సహాయం లభిస్తుంది. అనవసరమైన సందేహాలు కలుగుతాయి. రాజకీయ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. సాంఘిక కార్యక్రమాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. స్త్రీలకు: కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. విలాస వస్తువులు కొంటారు.

మకరం:— మీ మంచితనమే మీకు యిబ్బంది కలిగిస్తుంది. ఉద్యోగంలో గౌరవం బాగుంటుంది. సాహసిక వ్యవహారాలు లాభిస్తాయి. సాహిత్య కళారంగాల్లో మీ కృషి రాణిస్తుంది. పోటీవారితో వాదప్రతివాదాలు తగవు. స్త్రీలకు: పుణ్యకార్యాలు చేస్తారు. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి.

కుంభం:— అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి. మిత్రులకు సహాయం చేస్తారు. పోటీవారిలో గౌరవం లభిస్తుంది. స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. వ్యాపారంలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. స్త్రీలకు: వినోదకాలక్షేపాల్లో పాల్గొంటారు. దైవ కార్యాలు నెరవేరతాయి.

మీనం:— మీ శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. వృత్తిలో పోటీవారి పోటీ తగ్గుతుంది. రాజకీయ వ్యవహారాలు బాగుంటాయి. వారం ఆఖరులో అన్ని వ్యవహారాల్లోను ఫలితం సామాన్యంగా ఉంటుంది. స్త్రీలకు: ఆరోగ్యం బాగుంటుంది. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

— మహేష్

సామాన్యుని సణుగుడు

"వానలు కురవాలి..."

వానల్లు కురవాలి

వరిచేలు పండాలి బుడుగో బుడుగో

అంటూ పిల్లలు పాటలు పాడుతూవుంటే — అది పాత పాట. యిప్పుడు నదుల మీద ప్రాజెక్టులు రిజర్వాయర్‌లు ఎన్నో వచ్చేసాయి. కొత్త కొత్త సేద్యపద్ధతులు వచ్చేశాయి. తెల్లారిందగ్గర్నించి ఎరువులు ఏకరవు పెడుతూనే వుంటుంది ఆకాశవాణి. ఇక ఆకాశం మీద నుంచి ఒక్క చుక్క నీరు రాలనంత మాత్రాన 'అప్‌సెట్' కానక్కర లేదు అని నా లాంటి సామాన్య ప్రాణి అనుకుంటే అది తప్పు.

యజ్ఞాలు చేసి, కప్ప కావిళ్లు వేసి ఎన్ని చేసినా మంత్రాలకు చినుకులు రాలవు అనే హేతువాదులూ వున్నారు...అయ్యో అయ్యో! పాపం పెరిగి పోయిందీ దేశంలో కావున యింద్రుడు ఆగ్రహించాడు అనే వెర్రి అమాయకులూ వున్నారు... అయితే మంత్రుల ప్రకటనలకి మాత్రం " మాన్ సూన్ " "సూన్"గా వచ్చేస్తుందా ? రావడంలేదే ?

ఇప్పుడు పరిస్థితి ఏమిటంటే హోరున జోరున వానలు కురిసి, వాగులు, దొరువులు, మెట్టభూముల గోతులు, గతకలు తడిసి, హాయిగ ప్రాణం పోసుకోవలసిన తరుణం రానూ వచ్చింది పోనూ పోయింది. కాని వాన చుక్కలు పడలేదు — శ్రావణ భాద్రపదాలు పోయాయి — వానలు రాకుండానే పోయాయి. ఎండాకాలం ఎండలు ఎప్పుడో పోవలసినవి యింకా ప్రతాపం చూపెడుతున్నాయి ...

దక్షిణాది ధాన్యాగారం వరిబియ్యానికి పరప్రసాది అయిన ఆంధ్రదేశంలో రైతుకు నిరాశతో నోరెండి పోతున్నది...ప్రాజెక్టులున్నా, రిజర్వాయర్‌లున్నా, నేల బావులున్నా, గొట్టాల బావులున్నా — లేదా లిఫ్ట్ యిరిగేషన్ వున్నా ఎన్నివున్నా పిడికెడుమీద యేదైనా పెడితేనే అది స్వయంపాకం అన్నట్లు వానలు కురవాలి—వరి చేలు పండాలి... ప్రత్తి గింజలు నాటాలి... పుగనాట్లు వేయాలి లేదా ... కృత్రిమంగా వానలు కురిపించాలి.

కాని కృత్రిమంగా వానలెలా కురుస్తాయి. కృత్రిమంగా వుకారు మేఘాలు చేయవచ్చును. అపార్థాల కారు మబ్బులు చేసి జాత్యహంకారాన్ని రెచ్చగొట్టవచ్చును గాని మన దేశం లాంటి కర్మభూమిలో కృత్రిమ మేఘాలు తయారుచేయటం ఎట్లాగా ? అన్నది సమస్యేయింకా ...

కొంచెం వాన పడితే చాలు పోయినేడాది పండిన పంట, గోదాములేక రోడ్ల ప్రక్కన దాచుకున్నాం — కాని అది లేకనే యిప్పుడు ప్రభుత్వ యంత్రాంగం కూడా కదిలిపోయేటంత ఆందోళన చెందుతున్నామిప్పుడు.

నిజమే అందరికీ తెలుసు భూమిలో నీళ్ళున్నాయి. మ్యునిసిపాలిటీ పంపులు అందని యిండ్ల వాళ్ళకు కూడా తెల్సు: బోర్ పంపులు వేసుకుని కాలక్షేపం చేయాలని. కాని భూమాత పొట్ట చీల్చుకుని బంగారంలాంటి పంట కావాలి అంటే— ఆ భూగర్భం నుంచే జలాలు తీసి పై పారని తడపాలి ... దాని కోసం 'రిగ్గులం'టే ఆ రిగ్గులతో గొట్టపు బావులు త్రవ్విస్తే రైతుకి లాభసాటిగా వున్నా లేకపోయినా, డొక్కాడేటంత వరకు రెక్కాడించ గలుగుతాడు...లేదా పశు గ్రాసం కూడా లేకుండా అల్లాడిపోతాడు షెడ్యూల్డు; వెనుకబడ్డ తరగతులు అని కాదు ఎందరు బడుగు రైతులున్నారో వాళ్ల పొలాల్లో 'రిగ్గులు' భగీరథ యత్నం ప్రారంభించే కార్యక్రమం ఒకటి దేశవ్యాప్తంగా చేపట్టాలి.

"రైతు మీదా బ్యాంకు మీదా గాక కేవలం దేశ సౌభాగ్య ప్రాతిపదిక మీద యీ కార్యక్రమం చేపడితే కొంతలో కొంత అనావృష్టి కాలంలో – 'ఆర్తనాదాల' దాకా మనం వెళ్ళనక్కరలేదు ...

అప్పుడే వానలు లేవు అన్న ఆందోళన ఏలినవారి నుంచి, రైతులనుంచీ కూడా వ్యక్తమవుతోంది. తాత్కాలికమైన ఉపశమనాలు వుంటాయి . కానీ "సైంటిఫిగ్గా" ఆలోచించాలి. అట్లా ఆలోచించినప్పుడు — యిప్పుడు 'భాక్రా' నంగల్, నాగార్జున సాగరాలు వర్ధిల్లిన రీతి మున్ముందు ఏదైన యితర జలాధార మార్గాలు', కూడా వెల్లడైతే అదనుకు రాని వానల వల్ల పూర్తి నష్టం రాకుండా కాపాడే అవకాశం మనకి వుంటుంది... సో'' సైంటిస్టులు ఆలోచించాలి.. భూమిలో నుంచి నీళ్ళు తీసే మార్గం పేదరైతుల పొలాలకికూడా చూపించాలి ... అది శాశ్వత ప్రాతిపదికమీద జరగాలి. [వీరాజీ]

శాస్త్రజ్ఞుల ఆశ్చర్యం!

అమెరికా శాస్త్రజ్ఞులిన్నాళ్ళ అంగారకగ్రహములో కంపనాలుంటాయని, నెలకోసారి పెద్దవి, రోజూ చిన్నచిన్నవీ యీ కంపనాలుంటాయనీ అనుకునేవారట. తీరా వారిప్పుడు అంగారక గ్రహంలోకి పంపిన వైకింగ్—2 సెప్టెంబరు 3వ తేదీ నుంచి యీ నాటి (28 తేదీ) వరకూ ఏ విధమైన కంపనాలూ చూపించలేదట. కంపనం యో వైష్ణవమాయయో అవటానికి శాస్త్రజ్ఞులాశ్చర్యపోతున్నారట.

గోతాంలో శవం!

గుంటూరు రైల్వే ప్లాట్‌ఫారమ్ మీద నో గోనెసంచి మూట వున్నదట. ఆ మూటకు ఎవరూ సొంతదారులు లేకపోవడం వల్ల అటలాగే వుండవే గాక, దాంట్లోంచి దుర్వాసన రావడారంభించేసరికి విప్పి చూస్తే అందులోనుంచి లోపలగోనె స్త్రీ శవం అస్థిపంజరంగా వున్నదట, లంగా, బాడీ మాత్రమే శవం మీద వున్నాయట. ఈ శవం ఎవరు, ఎందుకు ఎవరిచే యిలా. . అనే ప్రశ్నలకు పోలీసు సమాధానాలు వెతుకుతున్నారట.

వెండిలో బంగారం!

ప్రొద్దుటూరులో సెంట్రల్ ఎక్సయిజు శాఖ వారు వెండిని శుద్ధి చేసే ఓ పరిశ్రమ మీద విరుచుకుపడితే శ్రమ లేకుండా ఆరువేల అయిదు వందల రూపాయల కిమ్మత్తు చేసే 166 గ్రాముల బంగారం దొరికిందట.

పాలిథిన్ సంచిలో తిరుపతి లడ్డు

తిరుపతిలో కల్తీ లడ్డూల అమ్మకాన్ని అరికట్టడానికిపుడుంచీ దేవస్థానం ముద్ర వేయబడిన "పాలిథిన్ సంచులలో సీలు చేసి, యీ లడ్డూలనమ్ముతారట. అసలు లడ్డూలకంతలేసి క్యూలు లేకుండానూ యాసంగా దొరికేఏర్పాటు చేస్తే కల్తీ లడ్డూలమ్మక మన్న మాటే వుండదు కదా!

లెక్కల్లో తికమక — ఆస్తి జప్తు!

కాకినాడలో ఓ నిమ్మకాయల వ్యాపారికి చెందిన అయిదు లక్షల ఆస్తిని, తికమక లెక్కలున్నాయని, జప్తు చేశారట.

ఎకరానికి రూపాయి!

తమిళనాడులో పంట పొలాల మీద వివాదాల ద్వారా మందు చల్లించిన సందర్భంలో ఎకరం ఒక్కింటికి రూపాయి లెక్కన అనాటి ముఖ్యమంత్రి కరుణానిధి పుచ్చుకున్నారనీ, ఆ లెక్కగా ఆయనకయిదు లక్షలు ముట్టాయని సర్కారియా కమిషను ఎదుట ఓ సాక్ష్యం వచ్చిందట.

ఆత్మహత్యకి అసలు కారణం?

తనకొడుకు ఆత్మహత్య చేసుకుంటాడని పసిగట్టి పూనాలో డాక్టరు ప్రతాప్ అనే ఆయన కొడుకును వేయి కళ్ళతో కాపాడుతూ వచ్చినా, ఆయనకొడుక్కు ఏ వుపాయమూ తోచక, రైలు పట్టాల వైపు పరిగెత్తాడట. కూడా తండ్రి పరుగెత్తినా, ఎదురొస్తున్న రైలు ఆకుర్రాణ్ణి మాత్రం మట్టుపెట్టిందట.

చెట్లు నాటితే మార్కులు!

విద్యార్థులు గనుక చెట్లను విరివిగా నాటితే (వనమహాత్మ్యం వల్ల) వారికి పరీక్షలో కొన్ని మార్కులు కలుపబడతాయని ఢిల్లీ నగర లెఫ్టినెంట్ గవర్నరువాచ:

ఆర్నెల్ల నుంచి పనిలేకున్నా నెలనెలా జీతం!

లక్నోలో ఓ పోలీసు స్టేషనుకు సంబంధించిన సబ్ ఇనస్పెక్టరాయన గత ఆరు నెలలుగా పనిచేసి ఏమీ లేదట. కానీ, ఆయనకు మాత్రం నెలనెలా జీతం ముట్టుతూనే వుందట మరి!! రికార్డులు సే!

ఇంగ్లండ్‌లో వర్షాభావం

ఇంగ్లండులో యీ ఏడు వర్షాల్లేక అక్కడి ప్రజ నానాకష్టాలూ పడ్డారట. లండన్‌లో వున్న భారతీయులు అంతా కలసి వానలకోసం పూజలు, యాగాలు, ప్రార్థనలూ చేసే సరికి వరుణదేవుడు సంతసించి ఓ రెండురోజులు కాంపిల్ రైన్ కురిపించాడట.

బిడ్డను కంటే ఏడ్నెల్ల సెలవు!

స్వీడనులో పిల్లనుకన్న తల్లికిగానీ, తండ్రికిగానీ (వారు ఉద్యోగంలో వుంటే) ఆ సంవత్సరంలో ఏడు నెలలు సెలవు మంజూరు చేస్తారట.

ఆస్తిని మించిన పన్ను!

బెంగుళూరులో ఒక ఆసామి తన ఆస్తి, తత్సంబంధమైన పన్నులు కట్టనేలేదని ఆ శాఖవారాయన మీద దాడిచేసి ఆయనకు 19.8 లక్షల కిమ్మత్తు చేసే ఆస్తివుందని అంచనా వేసి, దాని మీద 23.64 లక్షల పన్నువిధించి, ఆ పన్ను కట్టనిచో ఆస్తి జప్తు చేస్తామని హెచ్చరించారట.

స్త్రీ కారు నడిపితే జైలుశిక్ష!


కువైట్‌లో స్త్రీలకు కారు డ్రయివింగ్ లైసెన్సు యివ్వరట. స్త్రీలు కారు నడపరాదనే అక్కడి చట్టమట. ఇది మీరి ఎవరైనా నడిస్తే ఆ స్త్రీకి జైలు శిక్షట. అక్కడ మంచినీళ్ళ ఓ బాటిలు మూడ్రూపాయలపైనే నట. కరెంటు మాత్రం యూనిటొకరుపైసలట. మనం మంచినీళ్ళు యిచ్చి కరెంటు తెచ్చుకుంటేనో! పెట్రోలు లీటరు 45 పైసలేనట. అక్కడ బిచ్చగాళ్ళు లేనేలేరట!

డాక్టర్లకి కంపెనీల కమీషన్!

బొంబాయిలో మందులు తయారుచేసే కొన్ని కంపెనీలు, డాక్టర్లూ, కలిసి ఏదో ఒప్పందానికి వచ్చారట. దీనివల్ల మందులు సిఫార్సుచేసే డాక్టర్లకు మందుల కంపెనీలు కమీషనివ్వాలట. దీని వల్ల డాక్టర్లు ఎంత తక్కువ ధరవుందైనా సిఫార్సు చేసి తిరుగుతున్నారట. నాచురల్లి!

విద్యుద్ఘాతంవల్ల బాలుని మరణం

వంగపల్లి అనే గ్రామ మిరాస్దారు వీరప్ప గవుండరు కొడుకు పదహారేళ్ళ గోపాల్ అనే కుర్రాడు ఇంటిముందున్న కరెంటు దీపం వెలగలేదని బాగుచేసే ఉద్దేశ్యంతో స్తంభమెక్కి విద్యుద్ఘాతం వల్ల చనిపోయాడట. వీరప్ప గవుండరు యీ విషయం పోలీసులకు తెలియ జేయకుండా శవాన్ని యధాశాస్త్రంగా పాతిపెట్టాడట. పోలీసు సబ్ ఇన్స్పెక్టరు మాణిక్యం స్మశానానికి వెళ్ళి పాతి పెట్టిన శవాన్ని త్రవ్వి బయటకు తీయించి పట్టుకొని చక్కా పోయాడట. ●



కార్తీకమాసపు చలి రోజులు. మంచు పొరలింకా విడలనే లేదు. ఉదయం ఏడుగంట అవుతున్నా ఎండ పొడ ఎక్కడా కనిపించటం లేదు. 'సూర్య భగవానుడింకా నిద్ర నుంచి మేలుకో లేదా?' అన్నట్లుంది వాతావరణం.

మూడ్పావుగంట లేటుగా... బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ వచ్చిన పూరీ – రేణిగుంట ఎక్స్‌ప్రెస్– నా క్కాసేపు విశ్రాంతి కావాలి బాబూ! అన్నట్లుగా – విజయవాడ స్టేషనులో పట్టాలమీద పట్టుబట్టి ఆగిపోయింది!

"ఇంకా టైముంది గదా! క్షాసేపాగి ఎక్కుదాంలే రైలు!" అన్నట్లుగా లేదు ప్రకృతి. ప్రియురాలి వలపు స్పర్శలోని వెచ్చదనాన్ని పదేపదే గుర్తుకు తెస్తూ...విరహం విలువను మరింత పెంచుతోంది–వణికించేచలి!

స్టేషనులోకన్నా పెట్టెలో అయితే కాస్త వెచ్చగా ఉంటుందని – కంపార్టుమెంటు వైపుకు వడివడిగా అడుగులు వెయ్యబోయిన నేను ఆ దృశ్యం చూసి ... నిశ్చేష్టుణ్ణైపోయాను! చేతిలోని బ్రీఫ్ కేస్ పట్టుతప్పిజారి క్రిందపడిపోయింది. దాన్ని మళ్లీ చేతో అందుకునిఎవరోతరుముతున్నట్టు–ఆ దారుణకృత్యం జరుగుతున్న చోటికి వెళ్లాను. అతనింకా ఆ పని మానలేదు.

"ఏయ్ మిస్టర్! ఆపు! ఏమిటా అన్యాయం?" అంత పెద్ద టి.సి.ని నేనలా విలా అనగలిగానో నాకే అనూహ్యం!

అతను చేతికి విశ్రాంతి కల్పించి ఒక్క క్షణం నాకేసి అదోలా చూశాడు.

"నువ్వెవడివోయ్.. నన్నదిలించటానికి? ఇది నా (మా) సంస్థానం! ఇక్కడ నాకు స్థానబలం ఎక్కువ! నేనేం చేసినా నాకు అడ్డు లేదు!" అన్నట్లుంది అతని చూపు.

నేను దాన్ని కాతరు చెయ్యకుండా నిర్లక్ష్యంగా అన్నాను.

"ఎందుకిలా రాక్షసుడిలా ప్రవర్తిస్తున్నావు? ఏమిటి అతను చేసిన నేరం?"

"నేరం అని నెమ్మదిగా అడుగుతారేమిటండీ! దారుణ మయిన నేరమయితేను...!" కటువుగా ఉన్నాయతని మాటలు.

"ఏమిటో అది?" సాధ్యమయినంత వ్యంగ్యం చిలకరించాను.

"ఏమిటా?! బయటి నుంచి ఓస్ పాస్ చేసి స్టేషను లోనికి ప్రవేశించి ప్లాట్‌ఫారాల మీద అడుక్కోవటమే వీడి తప్పు! అందుకు వీణ్నేం చేసినా ఫరవాలేదు! పాపం కానేకాదు!" పళ్ళు నూరుతున్నాడు టి సి అతను ప్లాట్‌ఫామ్ ఇన్‌ఛార్జి టి. సి. అట.

నేనోసారి ఆ శాల్తీని పరికించి చూశాను. గోచీపాత మినహా వంటిమీద ఎలాంటి ఆచ్ఛాదనా లేదు. తల మీద జుట్టు, గడ్డం విపరీతంగా పెరిగి వికృతంగా ఉన్నాడు కారు నలుపు మలాం చేసినట్లున్న దేహచ్ఛాయ, పలకరించే ఎముకలు! తిండికోసం కలవరించే పొట్ట! "నన్ను రక్షించటానికి నువ్వు దేవుడిలా దిగి వచ్చావు గానీ లేకపోతే ఈ పాటికి టి. సి. చేతిలో నేను ఇంకా ..." అన్నట్లు దీనంగా చూస్తున్నాడు నా వైపు. అతని చూపుకు నా గుండె తరుక్కుపోయింది. హృదయం మారు మూలల్లో ఉన్న మానవత్వం కదలి కదలి... పెల్లుబిక పైకొచ్చింది.

జుగుప్స నిండిన కళ్ళతో ఆ టి. సి. వైపు చూస్తూ –

"అందుకని అమానుషంగా ప్రవర్తిస్తావా? అతన్ని గొడ్డును బాదినట్లు బాదుతావా ఆ క్రూరతో..." అన్నాను కఠినంగా.

ఎందుకనో టి. సి. కొంచెం తగ్గాడు. ప్లాట్‌ఫామ్ ఇన్‌ఛార్జి టి.సి. బెగ్గర్స్‌ని అమానుషంగా బాదుతున్నాడని – ఈ ఘాతుకాన్ని వెంటనే అరికట్టాలని – నేను కంప్లెయింట్ పుస్తకంలో రాస్తానని భయపడ్డాడేమో మరి? పైగా అప్పటికే అక్కడికి చాలా మంది ప్రయాణీకులు గుమిగూడారు చోద్యం చూద్దామని.

"మీకు తెలియదు సార్! వీళ్ళు వట్టి దొంగ వెధవలు! ఉదాహరణకి వీణ్ణే చూడండి! మీవైపిలా జాలిగా చూస్తున్నాడుగదా! అని దయతలచి వదిలి పెట్టావే అనుకోండి!..."

టి. సి. మాటకు అడ్డుతగిలాను నేను "ఏం చేస్తాడు? అడుక్కుంటాడు ...!

పొట్టతిప్పలు గదా!" అన్నాను.

"భలేవారు సార్ మీరు! అలా ఏం చెయ్యడు వీడు!"

"ఏం చేస్తాడు మరి?"

"ఏమరుపాటుగా ఉన్న ఏ ప్రయాణీకుల సామాన్లో ఎడిపోలవుతాయి! ఎక్కడో దూరా భారాన్నుంచి వస్తున్న వాళ్ళెంత ఇబ్బందికి గురవుతారో మీరాలోచించండి?"

గొంతు తగ్గించి సంజాయిషీ చెపుతున్నట్లుగా అన్నాడు టి. సి.

"ఇట్సాల్ రైట్! కాని వాణ్ణి కొట్టే హక్కు మాత్రం మీకు లేదు. కావాలంటే స్టేషన్ బయటకు పొమ్మని గట్టిగా చెప్పండి!" అని ప్రయాణీకుల గుంపు వేపు చూస్తూ "ఏమండీ మీరేమంటారు?" అన్నాను. మీరు చెప్పిందే సబబన్నట్లు తలలూపారు అందరూ. టి.సి. ముఖం చిన్నబోయింది. అయినా వెంటనే తేరుకుని "పోరా! పో! ఈయన పుణ్యమా అని — సువ్విహ్వాళ నా చేతిలోంచి తేలిగ్గా బయటపడి పోయావ్! మళ్ళీ ఈ ఛాయలకొచ్చావా?! డొక్క చీరేస్తాను జాగత్త!" అంటూ బెదిరించాడు టి. సి. వాణ్ణి.

వాడు ప్రబతుకుజీవుడా! అన్నట్లు నాకు పదేపదే నమస్కారాలు చేసి... ఎందుకయినా మంచిదని టి సి. కి కూడా మరొకటి పారేసి చిన్నతరహా పరుగులాంటి నడకతో ప్లాట్ ఫామ్ చివరకి పారిపోయాడు. అక్కడ జేరిన ప్రయాణీకులంతా వింత చూసి బెదరిపోయారు.

టి.సి. ని చిన్నబుచ్చినందుకు నా మనసులో బాధ కలిగింది. పైగా నా మాటమీద టి సి. వాణ్ణి విడిచిపెట్టాడు. అందుకని అతనితో స్నేహం కలపదలచాను. "థాంక్యూ వెరీ మచ్! రండి! మీకభ్యంతరం లేకపోతే కాంటీన్‌లో కాస కాఫీ తాగుదాం!" అన్నాను అతని చెయ్యి నొక్కి వదిలేస్తూ.

అతను ఓ సెకండు నావైపే దోలా చూసి... ఏమనుకున్నాడో ఏమో "సరే! పదండి!" అన్నాడు.

కాంటీన్ ప్రయాణీకులతో కళకళ లాడుతోంది: ఓ రెండు టేబులు కాస ఖాళీగా ఉంది ఇద్దరం కుర్చీలలో పక్క పక్కగా కూర్చున్నాం బ్రీఫ్‌కేసు నా పక్కన కింద పెట్టాను. కాఫీ టిఫిన్ సేవిస్తూ ఇండియాలో బెగ్గర్స్ ప్రాబ్లమ్ గురించి విపులంగా చర్చించుకున్నాము. అయితే మా ఇద్దరి అభిప్రాయాలు అన్నిచోటా కలవలేదు. నేను వారికి సానుభూతి ఎక్కువ చూపిస్తే... అతను వారిపట్ల కఠిన ధోరణినే వ్యక్తం చేశాడు. ఇంతలో మైకులోనుంచి ఎనౌన్స్‌మెంట్ వినిపించింది.

"యువర్ అటెన్షన్ ప్లీజ్!..." అంటూ దాని సారాంశం — పూరీ రేణిగుంట ఎక్స్‌ప్రెస్ రైలు ఆరవనంబరు ప్లాట్‌ఫారమ్ నుంచి అయిదు నిముషాలలో బయలుదేరబోతోంది. బయట మంచు సొరలు విడులుతూ ఉన్నాయి

నాకు కంపెనీ ఇచ్చినందుకు టి. సి కి థాంక్స్ చెప్పి లేచబోతూ — తల పక్కకి తిప్పి చూశాను. అంతే!! ఆశ్చర్యంతో తలమునకలయ్యాను! పక్కన బాంబు పడ్డట్లు అదిరిపోయాను!!

బెగ్గర్ జిందాబాద్

వాడు! ఇందాకటి బెగ్గర్!! టి. సి చేతిలో చావు దెబ్బలు తింటుంటే - నేను అడ్డుపడి తప్పించిన బిచ్చగాడు! మళ్లీ వచ్చాడో ఏమో ... ! నా కుర్చీ పక్కగా ముడుచుకు కూర్చుని కిందపెట్టిన నా బ్రీఫ్ కేసు మీద చెయ్యివేసి తన హస్త లాఘవాన్ని చూపించ బోతున్నాడు!! నేనూ టి. సి మా ధోరణిలో మేముండటంచేత వాణ్ణి ప్రత్యే కంగా చూస్తేగాని గమనించలేని స్థితిలో ఉన్నాము – ఇంతకు ముందు నించీ. ఇంకో సెకండు నేను గమనించకుండా ఉంటే... ! ఆ బెగ్గర్ వాడి అదృష్టాన్ని అభినందించు కుని ఉండేవాడు! కానీ నేను జరుగుతున్న సంఘటనను టి. సి కి చూపించటంతో పాపం దురదృష్టమే వాణ్ణి పలకరించింది!

టి. సి. ఉగ్రుడయిపోయాడు "ఏరా! రోగ్! నిన్నిందాక రక్షించిందే ఆయనయితే... ఆయన సామానే కాజేయటానికి పాల్పడతా వ్రటా? నిన్నిసారి ఆ దేవుడు గూడా రక్షించ లేడు!" అంటూ ఇందాకటి కర్రపెట్టి బెగ్గర్ వీపు మీద బాద సాగాడు. "చూశారా సార్! ఇందాక మీరేమేమో చెప్పారు! ఎంతో సానుభూతి చూపించారు!, ఇప్పుడు చెప్పండి వీళ్లను కొట్టాలో ... ఏంచెయ్యాలో...?!" అన్నాడు కొడుతూనే ... నన్నుద్దేశించి.

బ్రీఫ్ కేస్ చేతిలోకి తీసుకుని...వడివడిగా ట్రెయిన్ వేపు కదలి వస్తున్న నేను - ఈసారి ఓడిపోయినట్లుగా ముఖంపెట్టి ... రెండు పెదవులను బంధించటం మినహా ఏమి చెయ్యలేకపోయాను. నా మనసే నన్ను అపహాస్యం చేస్తున్నట్లుగా ఉంది. కదులు తున్న రైల్లోకి ఎక్కిన నాకు టి. సి – బెగ్గర్‌ను కొడుతున్న చప్పుడింకా వినిపిస్తూనే ఉంది.

అవీ - ఇవీ - అన్నీ

ప్రేమ – పెళ్లి

సినిమా స్టైలులో హాస్య నాటిక. రచన : శ్రీ కె. బాలచందర్ పాటూరు. శ్రీ బంధ్యాం 16 పేజీలు: ఈ పుస్తకం నాటక సంస్థలకు, కళాకారులకు ఉచిత బహుమతి.

లక్ష్మీ నిర్దోషి

సాంఘిక నవల. రచన: శ్రీధర్. కథనం: శ్రీమతి రూప్సరాణి. 64 పేజీలు. వెల ఒక రూపాయి. ప్రచురణ అనామిక పారిశ్రామిక ఈ రెండు పుస్తకాలు కావలసినవారు నవయుగ ఫిలింస్, విజయవాడ-3కు వ్రాయగలరు.

వేడిగాలి

కవితా సంకలనం. రచన శ్రీ సలంద్ర, 46 పేజీలు, వెల రు 2-50 ప్రతులకు. రచయిత, 8-5-402, అంబేద్కర్‌రోడ్, నిజామాబాద్. లేక అరుణా బుక్‌హౌస్, స్టేషన్‌రోడ్, నిజామాబాద్‌కి వ్రాయవచ్చు.

గమనిక

పోయిన వారం మధ్య పుటలలో వేసిన 'దీపావళి శోభ' ఫొటో పంపినది శ్రీ ఏ.బి. శంకర శాస్త్రి అని గమనించ గోరుతాము.

సం.

Printed and Published by S. NageswaraRao at the Andhra Patrika press, MallikarjunaRao Street, Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna

గర్భిణిగా వున్నప్పుడు ప్రత్యేక పోషణకి హార్లిక్స్ తీసుకొనవలసిందిగా యిప్పటికి దాదాపు 100 సంవత్సరాలనుంచి ప్రపంచమంతటా డాక్టర్లు సిఫార్సు చేస్తున్నారు.



గర్భిణిగా వున్న స్త్రీకి చాలా ప్రత్యేక తరహా ఆహారం అవసరం. మంచి సమతూకమైనది; తేలిగ్గా జీర్ణమయ్యేది; మంచి పుష్టికరమైనది.

దీని కారణంగానే, యించుమించు ఒక శతాబ్దకాలంగా గర్భిణీ స్త్రీలు హార్లిక్స్‌పై ఆధారపడుతున్నారు. అందువల్లే సుచిత్ర తాను గర్భిణిగా వున్న మూడుసార్లు కూడా హార్లిక్స్‌నే నమ్ముకొంది.

సుచిత్రకి, ఆమె డాక్టర్ చెప్పినట్టు, హార్లిక్స్, తల్లికి పిల్లకి కూడా శరీర నిర్మాణానికి కావలసిన మాంసకృత్తులు, కార్బొహైడ్రేట్లు సరైన పాళ్ళల్లో సమకూరుస్తుంది. దీనిని సేవించడంవల్ల ప్రొద్దున్న లేవగానే నిస్సత్తువుగా వుండటం తగ్గుతుంది. తల్లిపాలు ఎక్కువగాను, పుష్టికరంగాను వుంటాయి. అన్నింటికి మించి, హార్లిక్స్ తేలికైనది, సులువుగా జీర్ణమౌతుంది.

హార్లిక్స్ పుణ్యమా అని, తాను గర్భవతిగా వున్న మూడుసార్లు ఎంతో సంతోషంగా వున్నాననీ, ముగ్గురు పిల్లలు ఎంతో ఆరోగ్యంగా పుట్టారనీ సుచిత్ర అంటుంది.

Hx-4127 Tel. A

దీనిలో ఆరోగ్యముంది. హార్లిక్స్ మంచి పుష్టికరమైనది

హార్లిక్స్ రిజిష్టర్డ్ ట్రేడ్ మార్క్.


ఏ బోంబే డైయింగ్ దుకాణానికైనా
సరే, వెళ్ళి మీ విజ్ఞానాన్ని పరిపూర్తి
చేసుకోండి! ఉవ్విళ్ళూరించే
మా సూపర్‌ఫైన్ పాప్లిన్‌లు,
లాన్‌లు, కేంబ్రిక్‌లు, డెనిమ్‌లు,
పోలియెస్టర్/నూలు మిశ్రణాలని
చూడాలని అడగండి.
మీవీ-వారివీ కూడా హృదయాలను
స్పందింపజేసే రంగుల్లో, డిజైన్లలో
మీరు సెక్స్ అప్పీల్‌ను గురించి
ఎంతో తెలుసుకోవాలనుకున్నారు.*
*కాని అడగడానికి
సంకోచించారు.
బోంబే డైయింగ్

BD 9764